బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నాణ్యమైన ఆహారానికి ప్రాధాన్యం
తక్షణం జిఒ5 ఉపసంహరణ
నాలుగేళ్లలోపు 'ఎస్ఎల్‌బిసి' పూర్తి
ప్రపంచాన్ని అధ్యయనం చేయించేది పత్రికలే : కూనంనేని
లోపలి పేజీల్లో..

సంపుటి 27, సంచిక: 09 | ఆదివారం | 23-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00



## ఢిల్లీ మంత్రి ఆతిశీ దీక్షకు
# సిపిఐ సంఘీభావం

**న్యూఢిల్లీ :** నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఆతిశీకి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సంఘీభావం తెలియజేశారు. జంగ్‌పురలోని దీక్షా శిబిరాన్ని వారు శనివారం సందర్శించారు. సిపిఐ అగ్రనేతల వెంట సిపిఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వర్ష్నే, నాయకులు శంకర్‌లాల్, బబ్బన్‌కుమార్‌లు కూడా ఉన్నారు. ఆతిశీ దీక్షకు సంఘీభావంగా డి.రాజా మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలకు నీటి సరఫరా కోసం సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. హాతానీకుండ్ బ్యారేజ్ నుండి హర్యానా ప్రభుత్వం ఢిల్లీకి న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను హర్యానా తరువాయి 2లో

## 'న్యూయేజ్' చిదంబరం కన్నుమూత



**న్యూఢిల్లీ :** 'న్యూయేజ్' ఆంగ్ల వారపత్రిక ఎడిటోరియల్ బోర్డు మెంబర్ చిదంబరం(72) శనివారం రాత్రి దేశ రాజధాని ఢిల్లీలో మరణించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చిదంబరం అనేక సంవత్సరాల పాటు ఢిల్లీలోని ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో సుదీర్ఘకాలం పని చేశారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ వార పత్రిక 'న్యూ యేజ్'లో పదిహేనేళ్ళకు పైగా పని చేస్తున్నారు. కేరళకు చెందిన చిదంబరం తొలినాళ్ళలో ఎఐవైఎఫ్‌లో పని చేసి, అనంతరం జర్నలిజంలోకి ప్రవేశించారు. ఆయన మృతి పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## రైల్వేలో పలు సేవలకు
# నో జిఎస్‌టి



ఐరన్, స్టీల్, అల్యూమినియంతో తయారు చేసిన పాలక్యాన్లపై 12 శాతం జిఎస్‌టి

దేశ వ్యాప్తంగా బయో మెట్రిక్ ఆధారిత ఆధార్ అథెంటికేషన్ ప్రవేశం : జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం నిర్ణయం

పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవడంపై నిర్ణయం రాష్ట్రాలదే : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ :** ప్రయాణికులకు రైల్వేలు అందించే పలు సేవలను జిఎస్‌టి నుంచి మినహాయించాలని జీఎస్టీ పాలకమండలి తీర్మానించింది. అందులో రైల్వే ప్లాట్‌ఫామ్ టికెట్లు, ప్రయాణికులు బసచేసే గదులు, విశ్రాంతి గదులు, లగేజీ సేవలు, బ్యాటరీ ద్వారా నడిచే కార్ల సేవలు ఉన్నాయి. విద్యాసంస్థల వెలుపల విద్యార్థుల కోసం ఉద్దేశించిన హాస్టళ్లతోపాటు ఇంట్రారైల్వే సప్లయిస్‌ను జిఎస్‌టి నుంచి మినహాయించారు. కేంద్ర ఆర్థికమంత్రి శాఖ నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం ఢిల్లీలో జరిగిన 53వ పాలకమండలి సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. విద్యార్థులు బసచేయడానికి సంబంధించి ఒక్కొక్కరికీ నెలకు రూ.20వేలు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని పాలకమండలి సిఫార్సు చేసింది. ఐరన్, స్టీల్, అల్యూమినియం తయారు చేసిన పాల క్యాన్లపై 12 శాతం జిఎస్‌టి విధించాలని సమావేశంలో నిర్ణయించారు. పెనాల్టీకి సంబంధించిన టాక్స్ డిమాండ్ నోటీసులపై వడ్డీ రద్దు, అప్పలేట్ ట్రిబ్యునల్ ఎదుట టాక్స్ అథారిటీలు అప్పీలు చేసుకునేందుకు రూ.20 లక్షల పరిమితి , హైకోర్టుకు రూ.1 కోటి, సుప్రీం కోర్టుకు 2 కోట్ల తరువాయి 2లో

## నిధులు వినియోగించుకునే అవకాశం రాష్ట్రాలకివ్వాలి



కేంద్ర ప్రాయోజిత పథకాలలో కొంత వెసులుబాటు కల్పించాలని, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిధులు ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత ఏడాది తెలంగాణకు 1.4 శాతమే నిధులు వచ్చాయన్నారు. ఉపాధి హామీ నిధులు ఆస్తుల సృష్టి పనులకు వినియోగించేలా అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రాల నికర రుణపరిమితి సీలింగ్ ముందుగానే చెపితే దానికి అనుగుణంగా బడ్జెట్ పెట్టుకుంటామన్నారు. సెస్, సర్‌ఛార్జ్ పన్నులు పది శాతం మించకుండా చేయాలన్నారు. ఢిల్లీలో శనివారం జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో అసమానతలు తగ్గించేందుకు సమ్మిళిత అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కు, మూసి రివర్ ఫ్రంట్‌కు, హైదరాబాద్ గ్లోబల్ సిటి అభివృద్ధికి తరువాయి 2లో



# వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్

అభివృద్ధి, సంక్షేమంలో ఎపి సిఎం చంద్రబాబుతో పోటీ పడే అవకాశం వచ్చింది

ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలి

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీ పడి పని చేసే అవకాశం తనకు వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచానికి తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. తెలంగాణలో హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని, అన్ని రకాల వైద్య సేవలు అందేలా హెల్త్ టూరిజం హబ్ ఉంటుందన్నారు. ఇందులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చోటు ఖచ్చితంగా ఉంటుందని సిఎం చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ 24వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ, మాజీ ఎంపి నామా నాగేశ్వర్‌రావు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ఎంపి భారత్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామన్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయనే విధంగా వైద్య, ఆరోగ్య రంగాన్ని తీర్చిదిద్దుతామన్నారు. బసవతారకం ఆసుపత్రికి ఎలాంటి సహకారం కావాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం తరువాయి 2లో

## ఆఫీస్‌కు లేటుగా వస్తే
# వేతనంలో కోత..!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అలర్ట్



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు చేదు వార్త. ఇకపై ఉద్యోగులు కార్యాలయాలకు ఆలస్యంగా వస్తే ఉపేక్షించేది లేదని కేంద్ర సర్కార్ ఆదేశాలు జారీచేయనుంది. ఈ మేరకు త్వరలో కొత్త నిబంధనను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ఓ జాతీయ మీడియా సంస్థ ప్రచురించింది. కొత్త నిబంధనను త్వరలోనే అమల్లోకి తీసుకొచ్చే కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. కొత్త రూల్ ప్రకారం.. ఉద్యోగుల ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఉదయం 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ సదుపాయం ఉంటుంది. ఉద్యోగి ఆ గ్రేస్ పీరియడ్ కూడా ముగిసిన తర్వాత కార్యాలయానికి వస్తే హాఫ్ డే సెలవుగా పరిగణించబడుతుంది. అయితే నెలలో రెండు రోజులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తారు. రెండు రోజులకు మించి గ్రేస్ పీరియడ్ తర్వాత ఆఫీస్‌కు వస్తే.. అదనంగా తరువాయి 2లో

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో
# సింగరేణి దివాలా

లోపభూయిష్టమైన విధానాలతో వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలి

కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ :



తెలంగాణకు తలమానికమైన సింగరేణిని గత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఆయన కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకుని మితి మీరిన రాజకీయ జోక్యంతో ఆర్థికం విధ్వంసానికి పాల్పడడమే కాకుండా లోపభూయిష్టమైన విధానాలతో వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విచారణ కోరుతూ సింగరేణిలో వాటాదారుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో లేఖ కూడా రాయనున్నట్లు ఆయన చెప్పారు.హైదరాబాద్‌లోని బిజెపిరాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 2014 నాటికి రూ.3500 కోట్లు మిగులు నిల్వలు ఉన్న సింగరేణి ఏ బ్యాంకు అధిక వడ్డీఇస్తే వాటిలో డిపాజిట్ చేస్తామంటూ బ్యాంకులకే బహిరంగ కోటేషన్‌ను ఆహ్వానించిన చరిత్ర ఉందన్నారు. అలాంటి సింగరేణిని బిఆర్ఎస్ అధికారం చేపట్టిన తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో పూర్తిగా దివాళా తీసేలా చేసి కనీసం సకాలంలో జీతాలను కూడా ఇవ్వలేని పరిస్థితిలోకి కెసిఆర్ నెట్టివేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత బిఆర్ఎస్ తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు సింగరేణి సంస్థపై ప్రేమను నటిస్తూ కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరిస్తుందనేది శుద్ధ అబద్ధమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణిపై తరువాయి 2లో

# రాష్ట్రంలో నీట్ ప్రకంపనలు

పరీక్షను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇల్లు ముట్టడి

విద్యార్థి, యువజన సంఘాల నిరసన: ఒయులోనూ దీక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నీట్ ప్రకంపనలు అంతకు అంతా పెరుగుతున్నాయి. అవకతవకలు చోటు చేసుకున్న నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసిన తిరిగి నిర్వహించడం ద్వారా 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో రాష్ట్రం ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిరసలు వెల్లువెత్తుతున్నాయి. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నీట్ విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కేంద్రబొగ్గు , గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు.ఎన్ఎస్ఐయు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ,పిడిఎస్‌యు, పివైఎల్, విజెఎస్, వైజెస్ తదితర విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నీట్ ను సమస్యపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసేందుకు నీట్ విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు సమయం కోరగా, ఆయన ఇవ్వకపోవడంతో కేంద్ర మంత్రి ఇంటిని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థి, యుజజన సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నడంతో అప్రమత్తమైన పోలీసులు తరువాయి2లో

## న్యాయం చేయమంటే అక్రమ అరెస్టులా?

నీట్ పరీక్ష ఫలితాలను తక్షణమే రద్దు చేసి పరీక్షను మళ్ళీ నిర్వహించాలని, ప్రవేశ పరీక్షల్లో విఫలమైన ఎన్‌టిఎ చైర్మన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ బిజెపి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముట్టడి నిర్వహించిన వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తరువాయి 2లో

# ప్రజారోగ్యంతో చెలగాటం

నిబంధనలకు పాతర వేస్తున్న ఫార్మసీ సంస్థలు

రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ కంట్రోల్ దాడులు

20 ఫార్మసీ,మెడికల్ షాపులపై దాడులు

లైసెన్స్ ఉన్న షాపుల నుంచే మందులు కొనండి : కమలాసన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల ఆరోగ్యంతో కొన్ని మందుల ఉత్పత్తి సంస్థలు, డీలర్లు చెలగాటం ఆడుతున్నాయి. తమ ఉత్పత్తులను విక్రయించేందుకు మోసపూరిత ప్రకటనలు గుప్పిస్తున్నారు. మరి కొందరు ఏకంగా డ్రగ్స్ లైసెన్సులు లేకుండానే మెడికల్ షాపులను కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మందులను విక్రయిస్తున్నారు. గత కొంత కాలంగా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) రాష్ట్ర వ్యా ప్తంగా దాడులను నిర్వహిస్తోంది. ఈ నెల 1 నుంచి 21వ తేదీ వరకు జరిగిన దాడులలో సుమారు 20 వైద్య రంగానికి చెందిన సంస్థలను సీజ్ చేసింది. రూ.4.50లక్షల తరువాయి 8లో

## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య
# ఒప్పందం దిశగా...

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు



**న్యూఢిల్లీ :** సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం ఒప్పందం దిశగా చర్చలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ద్వైపాక్షిక చర్చల అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అన్ని రంగాల్లో సంబంధాలను మరింత విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని నిశ్చయించినట్లు వెల్లడించారు. భారత్‌కు బంగ్లాదేశ్ అతిపెద్ద అభివృద్ధి భాగస్వామి అని పేర్కొన్న ప్రధాని, ఆ దేశంతో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. సైనిక సహకారం, ఆయుధాల ఉత్పత్తి, భద్రతాదళాల ఆధునికీకరణపై విస్తృతంగా చర్చించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భారత్ తమకు నమ్మకమైన మిత్రదేశమని బంగ్లా ప్రధాని షేక్ హసీనా అన్నారు. 1971లో స్వాతంత్ర్య సమరంలో భారత్‌తో ఏర్పడిన సంబంధాలకు తాము విలువనిస్తామని పేర్కొన్నారు. రైల్వేల అనుసంధానం, డిజిటల్, మారిటైమ్ తరువాయి 8లో

# పరీక్షల్లో సంస్కరణలకు కమిటీ

'నెట్, నీట్' వివాదం వేళ కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** నీట్ యుజి, యుజిసి నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణల కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో ఎయిమ్స్ ఢిల్లీ మాజీ డైరెక్టర్ డా.రణ్‌దీప్ గులేరియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కె.రామమూర్తి, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్, ఐఐడి ఢిల్లీ డీన్ (విద్యార్థి వ్యవహారాలు) తరువాయి 2లో

## ప్రపంచం





గాజా స్ట్రిప్ రఫా నగరంలోని శరణార్థుల గుడారాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 50 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. అంతర్జాతీయ కట్టుబాట్లు, యుద్ధ నియమాలకు విరుద్ధంగా గాజాలో ఇజ్రాయెల్ మారణకాండను కొనసాగిస్తున్నది. వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలు హరిస్తున్నది. జనావాసాలు, ప్రార్థనా మందిరాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు అనే తేడా లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. తమ నివాసాలు ధ్వంసం కావడంతో, వేలాదిమంది తలదాచుకుంటున్న గుడారాలపైన ఇజ్రాయెల్ దాడులకు తెగబడడం పట్ల అంతర్జాతీయ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. తక్షణమే యుద్ధాన్ని నిలిపివేయాలని కోరుతున్నది. కానీ, హమాస్ ఏరివేత పేరుతో గాజా స్ట్రిప్‌లోని రఫా తదితర నగరాలను నేలమట్టం చేయడానికి ప్రయత్నిస్తున్నది.



ఉక్రేన్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కేంద్రాలే లక్ష్యంగా రష్యా దాడులు కొనసాగిస్తున్నది. శుక్రవారం రాత్రి జరిపిన బాంబు దాడిలో తగలబడుతున్న కీవ్ విద్యుత్ సరఫరా కేంద్రం.

### హిందుజా గ్రూప్ కుటుంబానికి

# నాలుగేళ్ల జైలు శిక్ష



**జెనీవా (స్విట్జర్లాండ్):** మానవ అక్రమ రవాణా కేసులో హిందుజా గ్రూప్‌కు చెందిన నలుగురు కుటుంబ సభ్యులకు స్విట్జర్లాండ్ జెనివా కోర్టు జైలు శిక్ష విధించింది. ఇంట్లో పనుల కోసం భారత్ నుంచి జెనీవాకు తరలించడం, వారికి తగిన వేతనాలు చెల్లించకపోవడం వంటి నేరారోపణలపై విచారణ జరిపిన కోర్టు తుది తీర్పును వెల్లడించింది. హిందుజా గ్రూప్ కుటుంబానికి చెందిన ప్రకాశ్ హిందుజాతో పాటు, ఆయన భార్య, కొడుకు, కోడళ్లకు కూడా జైలు శిక్ష పడింది. డబ్బు ఆశ చూపి, ఇతరత్రా ప్రయోజనాలను ఎరగా వేసి ఎంతో మందిని అక్రమంగా జెనీవా తరలిస్తున్నారని కూడా వారిపై ఆరోపణలు ఉన్నాయి. భారత మూలాలున్న హిందుజా బ్రిటన్‌లో స్థిరపడింది. అక్కడి సంపన్న కుటుంబాల్లో ఒకటిగా కొనసాగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలను నడుపుతున్నది. అందులో భాగంగానే జెనీవాలోనూ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. అక్కడి తమ విల్లాలో పని చేయడానికి భారత ప్రజలను, ప్రత్యేకించి నిరక్షరాస్యులను తరలిస్తున్నది. వారి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకొని, స్వస్థలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నది. హిందుజా కుటుంబంపై వచ్చిన ఆరోపణలపై జెనీవా కోర్టు విచారణ జరిపింది. స్విట్జర్లాండ్ చట్టాలను అతిక్రమించినట్టు గుర్తించింది. తమ వద్ద పని చేస్తున్న వారికి స్విస్ కరెన్సీలో జీతభత్యాలను చెల్లించకుండా, భారత్‌లో ఖాతాలో తెరచి, అక్కడ రూపాయిల్లో జమ చేస్తున్నదని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న కోర్టు, స్విట్జర్లాండ్‌లో హిందుజా గ్రూప్‌పై ఉన్న వివిధ కేసులు, ముఖ్యంగా పన్ను చెల్లింపుల్లో అవకతవకలను కూడా పరిశీలించింది. కాగా, తీర్పు వెల్లడించిన సమయంలో హిందుజా కుటుంబానికి చెందిన ఏ ఒక్కరూ కోర్టుకు హాజరు కాలేదు. వారి తరఫున మేనేజర్ నజీబ్ జియాజీ మాత్రం హాజరయ్యారు. న్యాయమూర్తి ఆయనకు కూడా 18 నెలల జైలు శిక్ష విధించారు. అయితే, ఆ తర్వాత ఆ శిక్షను రద్దు చేశారు. తమపై వచ్చిన ఆరోపణలను హిందుజా కుటుంబీకులు అంతకు ముందు కోర్టుకు వినిపించిన వాదనల్లో ఖండించినప్పటికీ, వారు అవకతవలకు పాల్పడ్డారని సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ సమర్పించింది. దీనితో కోర్టు వారికి జైలు శిక్షను ఖరారు చేసింది.



# చైనా కొత్త ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

**సిచువాన్ (చైనా):** ఖగోళ రహస్యాలు ఛేదించడానికి ఫ్రాన్స్‌తో కలిసి అభివృద్ధి చేసిన ఉపగ్రహ ప్రయోగం విజవంతమైంది. చైనా అధికారిక వార్తా సంస్థ జిన్‌హువా ప్రకటనను అనుసరించి, నైరుతి చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని జిచాంగ్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ఉపగ్రహాన్ని లాంగ్ మార్చ్ 2సి ర్యాకెట్ శనివారం నింగిలోకి తీసుకెళ్లింది. విశ్వంలోని సుదూర ప్రాంతాల్లో బాణాసంచా మాదిరి కమినుకుమినుకుమనే గామారే పేలుళ్లను ఈ ఉపగ్రహం అధ్యయనం చేస్తాయి. చైనా, ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు సుమారు 20 సంవత్సరాలు చేసిన కృషి ఫలితంగా ఈ ప్రయోగం సాధ్యమైంది. విశ్వం ఆవిర్భావమప్పుడు సంభవించిన తొలి గామారే పేలుళ్ల వంటి కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణల కోసం ఎదురుచూస్తున్నట్టు చైనీస్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. కాగా, గామారే పేలుళ్లు సాధారణంగా చాలా తక్కువ వ్యవధిలో ఉంటాయని, బిగ్ బ్యాంగ్ తర్వాత విశ్వంలో అత్యంత పెద్దవైన పేలుళ్లు సంభవించి ఉండకపోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. అయితే, తక్కువ వ్యవధిలో, నిర్ణీతమైన శక్తి సామర్థ్యాలతో సంభవించే పేలుళ్లు భారీ నక్షత్రాల పతనానికి లేదా బైనరీ కాంపాక్ట్ నక్షత్రాల విలీనానికి దారితీస్తాయని అభిప్రాయపడుతున్నారు. అయితే, గామారే పేలుళ్లపై శాస్త్రవేత్తలు ఇంకా ఒక స్పష్టతకు రాలేకపోతున్నారు. ఈ పేలుళ్లపై లోతైన పరిశీలన, పరిశోధనకు తాజా ప్రయోగం ఉపయోగపడుతుందని చైనా, ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలావుంటే, 2సి ర్యాకెట్ ద్వారా పంపిన ఉపగ్రహంలో నాలుగు సైంటిఫిక్ పరికరాలను అమర్చారు. వాటిలో రెంటిని చైనా, మరో రెంటిని ఫ్రాన్స్ అభివృద్ధి చేశాయి. ఈ నాలుగు సాధనాలు విశ్వంలో జరిగే పరిణామాలను, ప్రత్యేకించి గామారే పేలుళ్లను ఎంతో స్పష్టంగా పరిశీలిస్తాయి. అవసరమైన సమాచారాన్ని భూకేంద్రానికి పంపుతాయి. వాటి ఆధారంగా శాస్త్రవేత్తల అధ్యయనం కొనసాగుతుంది.

# హిజాబ్ రద్దుపై ఆందోళనలు



**దుషాన్బే:** తజికిస్తాన్ పార్లమెంటు ఇటీవల హిజాబ్‌ను రద్దు చేయడంపై ఆందోళనలు మొదలయ్యాయి. 'గ్రహాంతర వస్త్రాలు' వాడేందుకు వీల్లేదంటూ పార్లమెంటు ఎగువ సభ, మజ్లిసి మిల్లీ ఒక చట్టాన్ని ఆమోదించడం చర్చకు దారితీసింది, ఇది హిజాబ్ వంటి ఇస్లామిక్ సంప్రదాయ దుస్తులను లక్ష్యంగా చేసుకొని చేసిన చట్టంగా, అత్యధిక మంది ముస్లింలు ఉన్న కజకిస్తాన్‌లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును పార్లమెంటు దిగువ చాంబర్, మజ్లిసి నమోయాండగోన్, మే 8న ఆమోదించగా, ఎగువ సభ కూడా గ్రీన సిగ్నల్ ఇవ్వడంతో చట్టం అమల్లోకి వచ్చింది. కజకిస్తాన్‌లో చట్ట ఉల్లంఘనకు భారీ జరిమానాలు విధిస్తారు. దీనితో హిజాబ్ వంటి సంప్రదాయ దుస్తులపై నిషేధం విధించడాన్ని ముస్లిం సంప్రదాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ చట్టానికి వ్యతిరేంగా ఆందోళనలు ప్రారంభమయ్యాయి. నిజానికి 2007 నుంచి కజకిస్తాన్ హిజాబ్‌ను అనధికారికంగా అడ్డుకుంటున్నది. అయితే, క్రమంగా సంప్రదాయ దుస్తులు ధరించేవారు పెరుగుతున్నందున, కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంపై తజకిస్తాన్ అధ్యక్షుడు ఎమోమాలి రెహ్మాన్ ఒక ప్రకట చేస్తూ, విదేశీ దుస్తులు ధరించడాన్ని తప్పుపట్టారు. తజక్ సంప్రదాయ దుస్తులను వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేశామని, సముచితమైన దుస్తులను వివరించే గైడ్‌బుక్‌ను 2018లో జారీ చేశామని ఆయన వివరించారు. ఇలావుంటే, మత విశ్వాసాలకు అనుగుణంగా దుస్తులు ధరించడాన్ని అడ్డుకోవడం తమ స్వేచ్ఛను హరించడమేనని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తామని అంటున్నారు. మొత్తం మీద కజకిస్తాన్‌లో హిజాబ్ అంశం కొత్త వివాదానికి దారి తీసింది.

# అమెరికాలో అత్యధిక ఉష్ణోగ్రతలు



**వాషింగ్టన్ డిసి:** పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ ప్రభావం అమెరికా కూడా అనుభవిస్తున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో, పలు ప్రాంతాల్లో అమెరికన్లు అల్లాడిపోతున్నారు. వడగాడ్పులతో పలు రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. గత 24 గంటల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. ఒహియో, ఇండియానాలోని పలు ప్రాంతాల్లో వేడిగాలులు తీవ్రమయ్యాయి. కొన్ని పశ్చిమ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ దాటవచ్చని హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. అసాధారణ అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎంతో మంది దైనందన జీవితం అస్తవ్యస్తమవుతున్నది. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగింది. మిచిగాన్‌లో అనేక రాష్ట్రాలకు చెందిన యుటిలిటీ సిబ్బంది వేలాది మంది సబర్బన్ డెట్రాయిట్ కస్టమర్లకు సరిపడా విద్యుత్‌ను అందించడానికి కష్టపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి శ్రమిస్తున్నారు. బొగ్గు, చమురు, సహజవాయివులను విపరీతంగా వినియోగించడం వల్ల ఈనెల పగటిపూట ఉష్ణోగ్రతలు 35 రెట్లు పెరిగాయి. మనిషి స్వయకృతమే ఈ వైపరీత్యాలకు కారణమన్నది ముమ్మాటికీ నిజం. కాగా, 1936 తర్వాత అమెరికా గత ఏడాది అత్యధిక వేడి తరంగాలను ఎదుర్కొందని నిపుణులు తెలిపారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమవుతున్నదని స్పష్టం చేశారు. ఒకటి రెండు రోజుల్లో వడగాలుల తీవ్రత తగ్గుతుందని వాతావరణ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇలావుంటే,కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. ఉత్తర మిన్నెసోటాలోని అనేక చిన్నపట్టణ పర్యాటక ప్రాంతాల్లో, ఈ వారం ప్రారంభంలో వర్షం కురిసిన తరువాత వరద నీరు ముంచెత్తుతున్నది. రహదారులన్నీ నీటిలో మునిగిపోయాయి. మిన్నెసోటా రాష్ట్రం సెయింట్ లూయిస్ కౌంటీలో వరద నీరు వచ్చిచేరడంతో, స్థానికులు చిన్న చిన్న పడవల్లో ప్రయాణించడం విశేషం.

## రాష్ట్రంలో నీట్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)




వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకోవడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ తోపులాటలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ గాయపడ్డారు. దీంతో పరిస్థితులు మరింత ఉధృక్తతగా మారాయి. దీంతో అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున చేరుకున్న పోలీసు బలగాలు ఎంఎల్‌సి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, ఎఐఎస్ఎఫ్ నాయకులు చైతన్య యాదవ్, నరేష్, కళ్యాణ్ కాంత్రి, ఎఐవైఎఫ్ మర్రి శ్రీమాన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, కార్యదర్శి నాగరాజు పిడిఎస్‌యు అధ్యక్షులు మహేష్, రాష్ట్ర కార్యదర్శి ఆజాద్ , డివైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆనాగంటి వెంకటేశ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రామ కృష్ణ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, విజెఎస్ నాయకుడు అరుణ్‌కుమార్, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌లను అరెస్టు చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్ కి తరలించారు.

**ఒయులో నిరసన దీక్ష :**నీట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఓయూలో ఆమరణ దీక్ష నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ నాయకులు మెడ శ్రీనివాస్ , వినయ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, మోతీలాల్ నాయిక్, మోహన్‌లు పాల్గొన్నారు. ఈ దీక్షకు ఎఐఎస్ఎఫ్ ఓయు కార్యదర్శి సత్య సంఘీభావం ప్రకటించారు. శనివారం సాయంత్రం దీక్షను ఓయు అధ్యాపకులు: ప్రొఫెసర్ కాసిం, ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావులు దయాకర్ దీక్షను విరమిపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ ఎన్టీఏ నుండి మళ్లీ సిబిఎస్‌కి అప్పగించాలి డిమాండ్ చేశారు

## సింగరేణి దివాళా

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలన మొదలు సర్వహక్కులు 51శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని తెలిపారు. తెలంగాణ బిడ్డగా, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా సింగరేణి పరిరక్షణకు పూర్తిగా కట్టుబడి ఉండడమే కాకుండా కార్మికులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. 1966లో కనీస మద్దతు ధర విధానం అమల్లోకి రాగా 2014 వరకు 48 ఏళ్లలో అప్పటి కేంద్ర ప్రభుత్వాలు వరికి రూ.1300 మద్దతు ధరను ఇస్తే గడిచిన 10 ఏళ్ల లో మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం రూ.2300లకు పెంచిందన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలకే గ్యారంటీ లేదు : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పేరుతో హామీలకు అసలు గ్యారంటీయే లేకుండా పోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ తప్పితే మిగతా హామీలను తుంగలో తొక్కారన్నారు. మహాలక్ష్మి పథకం రూ.2500 ఆర్థిక సహాయం, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, నిరుద్యోగులకు రూ.4 వేల చొప్పున భృతి ఇస్తామని చెప్పి నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర యువ మోర్చా ఆధ్వర్యంలో టిజిపిఎస్‌సి ముందు ధర్నా చేస్తే విచక్షణారహితంగా పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు.

## నో జిఎస్‌టి (మొదటి పేజీ తరువాయి)

పరిమితి సిఫార్సు, అప్పీల్ ఫైల్ చేసుకునేందుకు ప్రీ డిపాజిట్ మొత్తాన్ని రూ.25 కోట్ల నుండి రూ.20 కోట్లకు తగ్గింపు, సింగిల్ లేదా డ్యుయెల్ ఎనర్జీ ఆధారిత సోలార్ కుక్కర్లపై 12 శాతం జిఎస్‌టి వంటి నిర్ణయాలు కూడా తీసుకున్నారు. అలాగే కార్టన్ బాక్సు లపైనా 12 శాతం జిఎస్‌టి విధించాలని తీర్మానించారు. ఈ నిర్ణయం హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లోని యాపిల్ పెంపకందారులకు మేలు చేస్తుందని జిఎస్‌టి పాలకమండలి అభిప్రాయపడింది. అంతే కాకుండా అన్నిరకాల స్ప్రింకర్లను 12 శాతం జిఎస్‌టి పరిధిలోకి తెచ్చారు. మరోవైపు పె ట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని, ఈ విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవాలని సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చే విషయంలో రాష్ట్రాలు ఐక్యం కావాలని సూచించారు. ఫేక్ ఇన్‌వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యను ఎదుర్కొనేందుకు దేశ వ్యాప్తంగా బయో మెట్రిక్ ఆధారిత ఆధార్ అథెంటికేషన్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. చిన్న వ్యాపారులకు సహాయం చేసేందుకు జిఎస్‌టిఆర్ 4 ఫామ్ రిటర్న్స్ దాఖలు చేసే గడువును జూన్ 30 వరకు పొడిగించారు. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం నుండి అమలులోకి వస్తుందని చెప్పారు. పన్ను సహేతుకరణ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌కు బిహార్ ఉప ముఖ్య మంత్రి సామ్రాట్ చౌధరని చైర్మన్‌గా నియమించినట్లు వెల్లడించారు. ఆగస్టు మధ్య నాటికి ఆయన నివేదిక సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

**జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్, డీజిల్ నిర్ణయం రాష్ట్రాలదే**

పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటుందని, ఈ విష యంలో నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్రాలే అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నా రు.ఢిల్లీలో జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిఎస్‌టిని ప్రవే శపెట్టిన మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అప్పట్లో పెట్రోల్, డీజిల్‌పై జిఎస్‌టి పరిధిలోకి తీసుకురా ఉద్దేశ్యంతో ఉండేవారని, పెట్రోల్, డీజిల్‌ను జిఎస్ టి పరిధిలోకి తీసుకురావడం, ఎంత శాతం విధించాలనే విషయంలో రాష్ట్రాలు కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వాటిపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ విధిస్తుం డగా, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్ విధిస్తున్నాయి. అయితే, ఎప్పటికైనా వాటిని జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు. ఆ మేరకు నిబంధన ఉన్నదని, రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్న తరువాత జిఎస్‌టి కౌన్సిల్ సమావేశమై పెట్రోలు, డిజిల్‌పై జిఎస్‌టి రేటును నిర్ణయిస్తుందన్నారు.

**రెండు శాతం కంటే తక్కువ మందికే నోటీసులు :**

సెంట్రల్ జిఎస్‌టి పరిధిలో 58.62 లక్షల పన్ను చెల్లింపుదారులలో రెండు శాతం కంటే తక్కువ మందికే అధికారులు నోటీసులు పంపారని, జిఎస్‌టి ద్వారా జీవితాలను సులభతరం చేయాలనేదే తమ ఉద్దేశ్యమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాము 1.14 లక్షల మందికే నోటీసులు పంపామని, వారి శాతం 1.96 మాత్రమేనని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులకు జిఎస్‌టిని మినహాయించండి :** భట్టి

ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాలపైన జిఎస్‌టిని మినహాయించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించారు. తద్వారా వివిధ రాష్ట్రాలు అదనంగా పాఠశాలలకు మరిన్ని నిధులను కేటాయిస్తారని, విద్యా ప్రాథమిక హక్కు బలోపేతమయ్యేందుకు దోహదపడుతుందని తెలిపారు. అదనపు న్యూట్రల్ ఆల్కహాల్ (ఇఎన్ఎ)ను జిఎస్‌టి పరిధి నుండి మినహాయించాలన్నారు. ఇఎన్ఎ జిఎస్‌టి పరిధిలో ఉండడంతో రాష్ట్రాల ఆర్థిక సౌలభ్యం తగ్గుతుందని, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వస్తువులపై పన్ను భారం పెరుగుతుందని తెలిపారు. ఇఎన్ఎకు సంబంధించిన చట్ట సవరణ ప్రతిపాదనకు మద్దతునిచ్చారు. రేట్ల హేతుబద్ధీకరణ కమిటీ ద్వారా నివేదికను త్వరగా సమర్పించాలనే అభ్యర్థనకు కూడా భట్టి విక్రమార్క మద్దతునిచ్చారు.

## వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్

(మొదటి పేజీ తరువాయి)

అండగా ఉంటుందని సిఎం చెప్పారు. ఎన్‌టిఆర్ ఆలోచనతో ఏర్పడ్డ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవలందించడం సంతోషమన్నారు. పేదలకు సేవలందించే ఉద్దేశంతో ఆనాడు ఎన్‌టిఆర్ ఆసుపత్రి నిర్మాణానికి పూనుకున్నారని, ఎన్‌టిఆర్ ఆలోచన విధానాలను కొనసాగించాలని చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించేలా చేశారన్నారు. పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఎన్‌టిఆర్ ఆలోచనలు అమలవుతున్న తీరు చూసి ఆయన స్వర్గం నుంచి ఆశీర్వదిస్తారన్నారు. రాజకీయం, సంక్షేమం ఎన్టీఆర్ వారసత్వంగా ఇచ్చారు. ఎన్‌టిఆర్ మూడో తరం కూడా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు

## సిపిఐ సంఘీభావం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆయన విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ రాకపోవడంతో కేంద్రం, హర్యానాలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు ఇబ్బందులు సృష్టిస్తున్నాయన్నారు. తద్వారా ఢిల్లీ ప్రజల గొంతు ఎండిపోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. నీటి కొరతతో ఢిల్లీలోని 28లక్షల మంది ప్రజలు ప్రత్యక్షంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే హర్యానా ప్రభుత్వం నీటిని విడుదల చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం హర్యానాకు చెప్పాలని కోరారు. ఈ అంశాన్ని పార్లమెంటు లోపల, బైట సిపిఐలేవనెత్తుతుందని,ఆతిశీ పోరాటానికి మద్దతునిస్తామని ప్రకటించారు.

## నిధులు వినియోగించుకునే అవకాశం రాష్ట్రాలకివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్ కేటాయించాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. అంతర్గత వనరులు సమీకరించుకుని రుణమాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు. బొగ్గు వేలంపై బిఆర్‌ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని, బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరి వల్లనే బొగ్గు వేలం చట్టం వచ్చిందని అన్నారు. బొగ్గు వేలం ఆపితే ఇల్లందు, సత్తుపల్లి గనులు ఎందుకు పోయాయని ఆయన ప్రశ్నించారు. సింగరేణికి నష్టంజరిగేలా, తమసొంతవారికీ గనులు వచ్చేలా బిఆర్‌ఎస్ అధిష్టానం వ్యవహరించిందని ఆయన విమర్శించారు.

## ఆఫీస్‌కు లేటుగా వస్తే వేతనంలో కోత..!

(మొదటి పేజీ తరువాయి)

ఆలస్యం చేసే ఒక్కోరోజు హాఫ్ డే వేతనం చొప్పున కోత విధించనున్నారు. అయితే ఉద్యోగికి కాజువల్ లీవులు (సిఎల్) ఉంటే వాటి నుంచి హాఫ్ డే లీవును మినహాయించనున్నారు. కాజువల్ లీవులు లేకపోతే ఎర్న్‌డ లీవుల (ఇఎల్) నుంచి తగ్గించనున్నారు. అవి కూడా లేకపోతే వేతనంలో కోత విధించనున్నారు. ఆలస్యంగా వచ్చే వాళ్లకు మాత్రమే కాకుండా ఎర్లీగా ఆఫీస్ నుంచి వెళ్లిపోయే వాళ్లకు కూడా ఈ నియమం వర్తిస్తుందని తెలిపారు. కాగా వేతనంలో కోత వార్తలపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తాము ఒక్కోరోజు రాత్రి 7 గంటల వరకు పనిచేస్తున్నామని, అప్పుడు తమకు అదనపు వేతనం ఇస్తలేరుగా అని ప్రశ్నిస్తున్నారు.

## న్యాయం చేయమంటే అక్రమ అరెస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్.అశోక్ స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులందరిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని, అదేవిధంగా ముట్టడి కార్యక్రమంలో తీవ్రంగా గాయపడిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల దేశంలో సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, నీట్, నెట్ వంటి ప్రతిష్టాత్మకమైన ప్రవేశ పరీక్షల పేపర్ లీకేజీల ఉదాంతం రోజురోజుకు పెరిగి పెద్దదవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు బీహార్ పోలీసులు 14మందిని అరెస్టు చేశారని, అదేవిధంగా మరికొంత మందికి నోటీసులు జారీచేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ దర్యాప్తు ఇంతవరకు చేయలేదని మండి పడ్డారు. గత ఏడేళ్లలో బిజెపి పాలిత రాష్ట్రాలలో సుమారు 70 ప్రవేశ, పోటీ పరీక్షల పేపర్స్ లీకేజీ అయ్యాయని, దీనివల్ల 1.7 కోట్ల మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. నీట్, నెట్ పేపర్స్ లీకేజి వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయమంటే కేంద్ర ప్రభుత్వం తమ తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం 'ది నోటిఫికేషన్ ఆఫ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్' చట్టాన్ని తీసుకొస్తున్నట్టు ప్రకటించడం సిగ్గుచేటన్నారు.

## పరీక్షల్లో సంస్కరణలకు కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రొఫెసర్ ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ సభ్యులుగా ఉన్నారు. ప్రవేశపరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండటం కోసం ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది.

**పేపర్ లీక్ చేస్తే పదేళ్లు జైలు శిక్ష, రూ. కోటి జరిమానా**

దేశంలో పేపర్ లీకేజీ వివాదం ముదురుతున్న నేపథ్యంలో పరీక్షల్లో జరిగే అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం కఠిన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్)'2024 చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇది శుక్రవారం(జూన్ 21) నుంచే అమల్లోకి వస్తున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ చట్టం ప్రకారం నేరం చేసినట్లు రుజువైతే ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష, రూ. కోటి వరకు జరిమానా ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే బిల్లును చట్టంగా చేశారు. ఎన్నికల కారణంగా అమలు తేదీని ప్రకటించలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ కేంద్ర సిబ్బంది, వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసే వారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహించినా, నకిలీ ప్రవేశ పరీక్ష కార్డులు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. కారకులకు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, కోటి రూపాయల వరకు జరిమనా విధించడానికి వీలుంది. గ్రూపులు, ముఠాలు, వ్యవస్థీకృత మాఫియాగా ఏర్పడి పేపల్ లీకేజీ వంటి అక్రమాల్లో పాల్పడే వారికి ఈ చట్టంలోని శిక్షలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అయితే ఈ కొత్త చట్టం ప్రకారం పరీక్షలను నిర్వహించే సంస్థ, అక్రమాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాంటి సంస్థలకు రూ.కోటి వరకూ జరిమానా విధిస్తారు. నేరానికి పాల్పడినట్లు రుజువైతే వారి ఆస్తులు జప్తు చేస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునూ వసూలు చేస్తారు. అలాంటి సంస్థలను భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల నుంచి నాలుగేళ్లపాటు నిషేధిస్తారు. ఇక నుంచి పేపర్ లీకేజీ కేసులను ఈ చట్టం కింద నమోదు చేస్తారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)లో సివిల్ సర్వీస్, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్, కంబైన్డ్ మెడికల్ సర్వీస్, ఇంజినీరింగ్ సర్వీస్ వంటి తదితర పరీక్షలకు వర్తిస్తుంది. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) ఎస్ఎస్‌సిలోని గ్రూప్ సి (నాన్ టెక్నికల్), గ్రూప్ బి (నాన్ గెజిటెడ్) వంటి పోటీ పరీక్షలు ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయి. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్ఆర్‌బి) నిర్వహించే గ్రూప్ సి స్టాఫ్, గ్రూప్ డి స్టాఫ్ వంటి తదితర పరీక్షలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ (ఐబిపిఎస్) వివిధ జాతీయ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో అన్ని స్థాయిల ఉద్యోగాల కోసం ఐబిపిఎస్ నిర్వహించే పరీక్షలకు కొత్త చట్టం వర్తిస్తుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించే జెఇఇ (మెయిన్), నీటి యుజి, యుజిసి నెట్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ మొదలైన పరీక్షలు ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.

## 'నీట్'పై సిబిఐ విచారణకు డిమాండ్

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిబిఐతో విచారణ జరిపించి నీట్‌ను రద్దు చేయాలని, వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) డైరెక్టర్‌ను తొలగించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బిహార్‌లో ఒక్క ప్రశ్నాపత్రానికి రూ.30 లక్షలు, హర్యాణలో ఏడుగురు విద్యార్థులకు 720 మార్కులు రావడంతో నీట్‌లో అవకతవకలు జరిగాయని స్వయంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒప్పుకున్నారని ఆయన అన్నారు. నీట్‌ను రద్దు చేయాలని రాష్ట్రంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలలో భాగంగా శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌కు గాయం కావడం పోలీసుల అత్యుత్సాహానికి అద్దం పడుతున్నదని అన్నారు. ఈ ఘటనను సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై విద్యార్థులకు నమ్మకం లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు.

## అభ్యర్థుల సమస్యలు పరిష్కరించరూ..

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు బహిరంగలేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ గ్రూప్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గ్రూప్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. గ్రూప్ 1 పోస్టులను 1:100 నిష్పత్తి ప్రకారం భర్తీ చేయాలని, గ్రూప్ 2లో రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3లో మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపాలని ఆ లేఖలో పేర్కొన్నారు. రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి తదనుగుణంగా నోటిఫికేషన్లను జారీ చేయాలని,మొత్తం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేలా మెగా డిఎస్సి నిర్వహించాలని కోరారు. నిరుద్యోగ భృతిని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే జిఒ 46 ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, అభ్యర్థులకు న్యాయం చేయాలని హరీశ్‌రావు కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలకే కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలను ఇచ్చారని, కానీ కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించారు. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, హైదరాబాద్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. గత 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కరీంనగర్ జిల్లా రామడుగులో 13 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో 12 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసిందన్నారు.

## ఆయిల్‌పామ్ గెలలకు రూ. 15వేలు

### కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా మార్చడం ద్వార కొత్త రైతులను ప్రోత్సహించడానికి ఆయిల్ పామ్ గెలల కు కనీస ధరగా టన్నుకు రూ. 15వేలు, క్రూడ్ పామ్ ఆయిల్ ధర కనీస టన్నుకు 1 లక్ష రూపాయలు ప్రకటించాలని వ్యవ సాయ, మార్కెటింగ్, కోఆపరేషన్, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ముడి పామ్‌ఆయిల్ ధరలను స్థిరికరించేందుకుగాను తిరిగి దిగుమతి సుంకాన్ని విధించడం ద్వారా దేశీయ పామ్ ఆయిల్ రైతులను ప్రోత్సహించుటకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాసిన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 1992 నుండి వివిధ కార్యక్రమాల అమలు చేయడం ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఇందుకు ఆయిల్ పామ్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన 21 ఏళ్లలో సుమారు 2లక్షలఎకరాలను ఆయిల్‌పామ్ సాగు పెరిగిందన్నారు. రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యాపామ్ ఆయిల్ సాగును పెద్ద ఎత్తున చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణ యించిన నేపథ్యంలో రైతుకు లాభసాటి ధరలు వచ్చేలా విధి విధానాలను రూపొందించాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతము ఆయిల్‌పామ్ గెలల ధరటన్నుకు రూ. 13,438గా ఉందని దీనిని కానీ రైతులు ఆయిల్ పామ్ గెలలకు కనీస హామీ ధర గా టన్నుకు రూ. 15వేలుగా గా నిర్ణయించమని కోరుతున్నారని మంత్రి తెలిపారు.క్రూడ్ పామ్ ఆయిల్ ధరను కనీసంగా టన్నుకు రూ.లక్ష రూపాయలుగా ఉండేలా చూడాలని, లేక రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభసాటిగా ఉండేలా సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## టిజిఎస్ఐ ప్రతిపాదన పత్రాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టిజిఎస్ఐ) పాలసీదారులగు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతిపాదన పత్రాలు సమర్పించాలని టిజిఎస్ఐ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బీమా అర్హత వయస్సు (56) సంవత్సరాల లోపు ఉండి, వారి జీతభత్యముల నుండి నెలసరి బీమా ప్రీమియంలను క్రమం తప్పకుండా తగ్గించి, తదనుగుణంగా ప్రతిపాదన పత్రాలు సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలకు సమర్పించి, తగిన విధంగా పాలసీలు పొందితే, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులవుతారని శ్రీనివాసు తెలిపారు. అయితే కొంతమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) సంవత్సరాల లోపు ఉండి ప్రీమియంలు క్రమంతప్పకుండా తగ్గించుచున్నప్పటికీ, సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో ప్రతిపాదన పత్రాలు సమర్పించకపోవడంతో నేటికీ పాలసీలు పొందలేకపోతున్నారన్నారు. అటువంటి వారు అన్ని రకాల బీమా ప్రయోజనాలకు అనర్హులవుతారన్నారు. అందువల్ల వారు, వారి డిడిఓలు తగిన చొరవ తీసుకొని వారి జీతభత్యాల నుండి మినహాయించే మొత్తం ప్రీమియంనకు సరిపడే విధంగా పూరించిన ప్రతిపాదన పత్రాలను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో సమర్పించి, వాటికి తగిన విధంగా పాలసీలను పొంది, అట్టి పాలసీ నెంబర్లను 'సమగ్ర ఆర్థిక నిర్వహణ, సమాచార విధానం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్ నందలి ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్ డేట్ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో వారి నెలసరి ప్రీమియంమొత్తాలు అనామతు ఖాతాలోకి వెళ్ళే అవకాశం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# తక్షణం జిఓ5 ఉపసంహరణ

### ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓఎంఎస్ నెం 5ను తక్షణమే ఉప సంహరించుకోవాలని ఏఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిఓ ఎంఎస్ 5న ఈ నెల 7న విడుదల చేసిందని, దీని ప్రకారం నాలుగేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఐటి పరిశ్రమలకు కార్మిక చట్టాలనుసడలిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఈ జీఓ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఐటిఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలు వర్తించవని బాలరాజు గుర్తు చేశారు. ఇప్పటికే ఈ పరిశ్రమల్లో చట్టబద్ద సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. తాజాగా విడుదల చేసిన ఈ జీఓ వల్ల ఈ కంపెనీల్లోని కార్మికులకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక చట్టాలసడలింపునుఐటిఈఎస్పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నెం.5ను తక్షణం ఉప సంహరించుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించినట్లు ఈ సమావేశానికి అధ్యక్షత వహించినఏఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలిపారు. జీఓ 5 ప్రకారం పని వేళలు, పని ప్రదేశంలో భద్రత, రవాణా సౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగులభద్రతను సంబంధించిన కొన్ని షరతులను అమలు చేయాలనే నిబంధన నుండి మినహాయింపు ఇవ్వడం సరైనది కాదన్నారు. గత అనేక సంవత్సరాలుగా ఐటి పరిశ్రమలను, కంపెనీలను కార్మిక శాఖ తనిఖీలు చేయడం మానివేసిందన్నారు.మహిళల భద్రతకు సంబంధించినంత వరకు పని వేళలు పెంచడంతో చాలా ఇబ్బంది కరంగా ఉందన్నారు. రాత్రి షిఫ్ట్‌ల కారణంగానూ మహిళలు ఎక్కువగా 8 నుండి 10గంటల పాటు విధులు నిర్వర్తిస్తూ తీవ్రమైనఇబ్బందికి గురవుతున్నారన్నారు. ఈ కారణాలన్నింటి రీత్యా ఈ కంపెనీలతో పనిచేసే మహిళలు ఉద్యోగులు ఉద్యోగాలు కూడా వదులు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఎస్.బాలరాజు అన్నారు. అనంతరం పాలడుగు భాస్కర్ (సిఐటియూ) మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి జీఓఎంఎస్ నెం.5 ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్‌కోడ్‌లలోని ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక చర్యల్లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓఎంఎస్ 5 కూడా ఉన్నదన్నారు. ప్రదీప్,ఎం.శ్రీనివాస్ (ఐఎఫ్‌టియూ)లు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుండి తెలంగాణ ఏర్పడ్డ ఈ పదేళ్ల కాలంలోనూ ఐటిఈఎస్ కంపెనీల కోసం కార్మిక చట్టాల నుండి మినహాయింపును పొం దుతూ కోట్లాది రూపాయల లాభాలు సంపాదిస్తున్నారని విమర్శించారు. ఏవి రావ్ (టిఎస్ ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ ) మాట్లాడుతూకార్మికులు ఇప్పటికే కనీస వేతనాలు అమలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంకె బోస్ (టిఎన్‌టియూసి) మాట్లాడుతూ సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్రం యత్నిస్తున్నట్లే ..జిఓ 5 ను తీసుకువచ్చి కంపెనీల్లో కార్మిక హక్కులను ఖతం చేయాలని చూస్తున్నారని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా జీఓఎంఎస్ 5ను ఉప సంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యావత్ కార్మిక లోకం కోరుతోందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రెబ్బా రామారావు(హెచ్ఎంఎస్), హనుమయ్య(ఎల్ఆర్ఎస్‌ఏ), సుందర రామయ్య( బ్యాంక్ ఎంప్లాయస్), వి.నాగేశ్వర రావు (సిజి కాన్ఫడరేషన్), ముకుంద్ (ఫార్మా సంస్థ) నుండి ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించారు.

## బెల్ట్‌షాపులపై దాడులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచిలక్ష రూపాయల విలువైన 48 లీటర్ల మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌కు చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు చిట్టులూరి శ్రీనివాస్ (48), రామంతాపూర్‌కు చెందిన బార్ అండ్ రెస్టారెంట్ ఉద్యోగి ఎం.మల్లేష్ (34)లు వైన్ షాప్‌ల నుంచి మద్యం బాటిల్స్ పెద్ద ఎత్తున ఖరీదు చేసి వాటిని అధిక ధరలకు రాత్రి వేళ్లలో స్థానికంగా బెల్ట్‌షాప్‌ల ద్వారా విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు జంగయ్య నేతృత్వంలో దాడులు చేసి పట్టుకున్నారు.

## నాణ్యమైన ఆహారానికి ప్రాధాన్యం

### మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలాప్రభుత్వ,ప్రైవేటు హాస్టల్స్, అన్ని ప్రభుత్వ క్యాంటిన్లలో ఆహార భద్రత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలనివైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులలో ఉన్న క్యాంటీన్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్‌లను తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైదరాబాదులోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, బ్లడ్ బ్యాంక్‌ల,ఎఫ్ఎస్ఎస్ఎఐ చట్టం అమలు, అన్ని విభాగాలను బలోపేతం చేయడానికి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ తదితర అంశాలపై మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నాచారంలో ఉన్న ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ ను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. బ్లడ్ బ్యాంకులను,తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులనుఅన్నిప్రభుత్వ ఆసుపత్రుల్లో కొరత లేకుం డా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నకిలీ మందుల బెడద లేకుండా నిరంతరం డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా పెట్టాలని తెలిపారు. నాణ్యమైన ఔషధాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్‌హెచ్ఎం కు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి. కర్నన్, ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల పాల్గొన్నారు.

## గీత పనివారల సంక్షేమానికి నిధులివ్వండి

### రాష్ట్ర గీత పనివారల సంఘం డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది పేద, వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెందిన వారి సంక్షేమం, పూర్తి రక్షణ కోసం రానున్న శాసనసభ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.జూలై, ఆగస్టు నెలలలో వివిధ స్థాయిలలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని, సభలు, సమావేశాలు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర సమితి సమావేశంహైదరాబాద్‌లోని ధర్మభిక్షం భవన్‌లో శనివారం జరిగింది. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులుబొమ్మగాని ప్రభాకర్ ప్రసంగిస్తూ వనపెంపకం కోసం జిఓ 560 ప్రకారం ఇచ్చే ఐదు ఎకరాలకు బదలు 10 ఎకరాలకు పెంచి రాష్ట్రంలోని అన్ని కల్లు గీత సహకారసంఘాలకు, హరితహారంలో భాగంగా తాటి, ఈత వనాలు పెంచాలని కోరారు. తాత్కాలికంగా ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ.2 లక్షలు, మెడికల్ బోర్డు సర్టిఫికేట్ విధానం రద్దు చేసి, ప్రభుత్వ సర్జన్ సర్టిఫికేట్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. గీత వృత్తిని ఆధునీకరించడం, గ్రామీణ, పట్టణాభివృద్ధి నిధుల క్రింద నిధులు కేటాయించి గృహ, వైద్య, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను, వృత్తిదారులకు మోపెడ్‌లు ఇవ్వాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు, ఎక్స్‌గ్రేషియాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దూసరి శ్రీరాములు మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియా గీత వృత్తిదారులకు సహకారసంఘాలలైసెన్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర కోఆర్డినేషన్ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ వన రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కెవిఎల్, మారగోని ప్రవీణ్ కుమార్, బొడిగె సైదులు, అంబటి విఠల్ గౌడ్, పందుల యాదగిరి,దొంకిని యాదయ్యగౌడ్,పబ్బుయాదయ్యగౌడ్, చాపల అంజయ్య, నాగేశ్వరరావు, దొంతు రామ్మూర్తి తదితరులు మాట్లాడారు. నూతన జిల్లాలలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రోడ్ల విస్తరణ తదితర కారణాలతో తాటి, ఈత వనాలు నరికివేస్తున్నందున గీత వృత్తిదారులు నష్టపోతున్నారని, వనరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు.

## రూ.31కోట్లతో రైతు రుణమాఫీ

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వచ్చే నెల లో రూ.31 వేల కోట్లతో రైతులకు రుణమాఫీ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ ంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలం లోని మోటాపురం, శంకరగిరి తండా, రాజేశ్వరపురం, అమ్మగూడెం, కోర్లట్లగూడెం, కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం, బోదులబండ, మంద్రాజుపల్లి గ్రామాలలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులకు రూ.31 కోట్లతో రుణమాఫీ అమలు చేసి తీరుతామని అన్నారు. రుణమాఫీ ని తట్టుకోలేక ప్రతిపక్షాలు నోరుజారుతున్నారని అన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో వెనక్కి తగ్గేది లేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి తో ఉన్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవాళ్లలో అతి పెదవాళ్లకు ముందు మంజూరు చేస్తామని అన్నారు. లిఫ్టులు రిపేరు చేయించి రైతులకు సాగు నీటిని ఇబ్బందులు లేకుండా చేస్తామని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇండ్లు, రేషన్‌కార్డు, సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. వివిధ గ్రామాలలో వినతి పత్రాలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మోటాపురంలో సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు గజమాలతో ఘనంగా సన్మానించారు. మండలం లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, ఎంపీపీ రమ్య, కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, జెర్రిపోతుల అంజిని, రావెళ్ల కృష్ణారావు, గుడిమళ్ల మధు, పెంటమళ్ల పుల్లమ్మ, పి.మాధవి, పాకనాటి కన్నారెడ్డి, కొచ్చేర్ల శ్రీనివాసరావు, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్, మారుతి కోటి తదితరులు పాల్గొన్నారు.

## ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజం (ప్రకృతి పర్యాటకం) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నదని అటవీ, పర్యావరణ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. పర్యావరణానికి, వన్య ప్రాణులకు ఏ మాత్రం హాని కలగకుండా, వాటి సహజ ఆవాసాలను పరిరక్షిస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ ఎకో టూరిజం పాలసీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి సురేఖ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని శనివారం అటవీ మంత్రిత్వశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటి ఛైర్మన్, మంత్రి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఎకో టూరిజం అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సరికొత్తగా ఆవిష్కరించనున్నామని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 12 సర్క్యూట్ లలో 40 ఎకో టూరిజం స్పాట్లను గుర్తించినట్లుగా మంత్రి సురేఖ తెలిపారు. అడ్వెంచర్, రీక్రియేషన్, ఆధ్యాత్మిక, వారసత్వ, సినీ, వెడ్డింగ్, నేచర్ అండ్ వైల్డ్ లైఫ్, హెరిటేజ్ అండ్ కల్చర్ తదితర అంశాల ఆధారంగా మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటిని ఎకో టూరిజం స్పాట్లుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం పాలసీ రూపకల్పనలో అటవీ, దేవాదాయ, రెవెన్యూ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకుంటూ, అడ్డంకులను అధిగమించుకుంటూ సాగాలని అటవీ అధికారులకు మంత్రి సురేఖ సూచించారు. ఆర్కియాలజీ శాఖతో సంప్రదింపులు జరిపి రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వం ఎకో టూరిజం పాలసీ రూపకల్పన పేరుతో కాలయాపన చేసిందని మంత్రి విమర్శించారు. ఒడిషా, కర్నాటక రాష్ట్రాల్లో అమలవుతున్న ఎకో టూరిజం విధానాలను అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఆ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గమనించిన పరిస్థితులను ఇక్కడి పరిస్థితులతో బేరీజు వేసుకొని అత్యుత్తమ ఎకో టూరిజం పాలసీల రూపకల్పనకు కృషి చేయాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. గతంలో జరిగిన సమావేశంలో ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలు, వన్యప్రాణుల, వలస పక్షుల ఆవాసాలు, జీవవైవిధ్య ప్రాంతాలు, వారసత్వ కట్టడాలున్న ప్రాంతాల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి గారు సూచించిన విషయాన్ని మంత్రి సురేఖ అధికారులకు గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధి చేసేందుకు పిపిపి పద్ధతిలో నిధులను సమీకరించాలి. రాష్ట్రంలోని ప్రధాన నది అయిన గోదావరి నదీపరివాహక ప్రాంతంలోనూ, జలపాతాలు, నీటివనరులున్న ప్రాంతాల్లో ఎకో టూరిజం స్పాట్లను అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సమావేశంలో కన్సల్టేటివ్ కమిటి మెంబర్లు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పిసిసిఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) పర్గెయిన్, పిసిసిఎఫ్ (కంపా) సువర్ణ, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా, స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపల్, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ (ఎకో టూరిజం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సెక్రటరీ(అటవీ) శ్రీలక్ష్మి, సిసిఎఫ్ క్షితిజ, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఛైర్మన్ ఇమ్రాన్ సిద్దిక్, ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ జిఎం ఉపేందర్ రెడ్డి, సిఐఐ మెంబర్ శ్రీదేవి రావు, డిఎఫ్ఓలు శివ ఆశిష్ సింగ్, నవీన్ రెడ్డి, సిద్ధార్థ్ వి సింగ్, కిష్టా గౌడ్, రాహుల్ కె జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## 25వేల ఎకరాలకు పైబడిన రైతులు 6,500 మాత్రమే

### సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ ప్ర భుత్వ హయాంలో కేవలం రూ.4వేల కోట్ల రుణ మాఫీ మాత్రమేఅమలుకాలేదనిబిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. 25 ఎకరాలకు పైబడి ఉన్న రైతులు 6,500 మందికి మించి లేరని, ఒక్క ఎకరా కూడా పడావు గా ఉండకూడదనే తపనతోనే కెసిఆర్ రైతు బంధు ప్రవేశ పెట్టారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు ఎకరాల భూమి ఉన్న రైతుల సంఖ్య 92 శాతం అని, ఐదు ఎకరాల లోపు ఉన్న రైతుకు లక్ష రూపాయలకు మించి పంట రుణాలను ఏ బ్యాం కు కూడా ఇవ్వబోదని తెలిపారు. రాష్ట్రంలో రూ. 2 లక్షల పంట రుణాలు ఉన్న వారు ఎంత మంది అనే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలన్నారు. రుణమాఫీ జరిగినట్టే కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, డిసెంబర్ 9 న రైతు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి, ఇపుడు కాబినెట్ లో చర్చిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్‌ను గుడ్డిగా వ్యతిరేకించడమే కొందరికి పనిగా మారిందని, కెసిఆర్ హయాంలో జరిగినమంచినిమంచిగాచెప్పడం కొందరికి నచ్చడం లేదన్నారు. తెలంగాణలో ప్రతి ఇంచు భూమి కూడా సాగుకు అనువైనదేన్నారు.రైతు బంధు గుట్టలున్న చోట ఇచ్చారని దుర్మార్గంగా మాట్లాడుతున్నారన్నారు. రైతు భరోసకు అర్హులెవరో ఇప్పటి వరకు ఎందుకు తేల్చలేదన్నారు. రైతు భరోసాకుమంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయ డం కుంటి సాకు మాత్రమేనని ఆరోపించారు. ఈ ఆధునికయుగంలో లబ్ధిదారులను ఎంపిక చేయ డం ఒక గంట పని అని, ఎక్కడైనా ఒక్కటో,అరో పొరపాట్లు జరిగితే సవరించుకోవడం పెద్ద పని కాదని తెలిపారు. రైతు భరోసాకు పట్టాదార్ పాస్ పుస్తకాలే ప్రామాణికం కావాలన్నారు. రికార్డులు వ్యవసాయ శాఖ వద్ద ఉన్నాయని, రైతు భరోసా ఇవ్వాలన్నారు.

**పార్టీ మారే ప్రసక్తే లేదు: ఎర్రబెల్లి**

తాను పార్టీ మారే ప్రసక్తే లేదని,కెసిఆర్‌ను మళ్ళీ సిఎం చేయడమే తన లక్ష్యమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. .అన్ని విషయాల్లో రైతుల పరిస్థితి ఘోరంగా మారిందని, రైతులకు సాయం అనే సరికే కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు ,షరతులు విధిస్తోందని ఆరోపించారు.

## కళ్లకు గంతలు కట్టుకుని జూడాల నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు తమసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశా రు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 24 నుంచి సమ్మెలోకి దిగుతామని ఇది వరకే తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రభుత్వాన్ని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. స్టైఫండ్ నెలనెలా చెల్లించాలని,ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేస్తూ గడిచిన మూడు రోజులుగా వారు నిరసన ప్రదర్శన చేస్తున్నారు. ఆస్పత్రులలో మౌలిక సదుపాయాలు లేక, ప్రభుత్వం నుంచి వచ్చే స్టైఫండ్ నెలనెలా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జూనియర్ డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయడం, ఆ తర్వాత మరి కొన్ని నెలల తర్వాత అదే సమస్యలు పునరావృత్తం అవుతున్నాయని వారు మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించామని,ఇప్పటి వరకు తగిన స్పందన రాలేదని జూడాలు తెలిపారు. తాము విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే వారు నల్లగుడ్డలు కట్టుకొని, ఆ మరుసటి రోజున నల్లదుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శనివారం రోజు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, అసెంబ్లీ బిల్డింగ్స్ డివిజన్, బషీర్‌బాగ్, హైదరాబాద్.
**ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**
NIT నెం.09/ 2024-25/ ABD/ DB/ NIT/ 226, తేదీ: 21/ 06/ 2024 కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన 4 పనుల కోసం ఓల్డ్ సిటీ, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్‌లోని వివిధ దేవాలయాలకు వెల్‌మెష్ జాలితో బారికేడింగ్ అందించడంలో అర్హులైన సమోదిత కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. అంచనా ECV ధర రూ.31,56,360/-, వస్తువుల వివరణ ECV పత్రాల క్రింద EMD లభ్యత, ముఖ్యమైన తేదీలు, టెండర్ షరతులు, టెండర్ యొక్క అర్హతలు మరియు అన్ని ఇతర వివరాలు http://tender.telangana.gov.in నందు అందుబాటులో ఉన్నాయి. డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 22.06.2024, డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 28.06.2024.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), అసెంబ్లీ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 152-DP/CL/ADVT/1/2024-25 Date: 22-06-2024




## పిల్లల్ని కంటారా లేక ట్యాక్స్ కడతారా?





భారత్, చైనా వంటి దేశాలు అధిక జనాభాతో ఇబ్బంది పడుతుంటే, కొన్ని దేశాలను అల్ప జనాభా వేధిస్తున్నది. రోజురోజుకూ తగ్గుతున్న జననాల రేటు ఆయా ప్రభుత్వాలను వేధిస్తున్నది. అలాంటి దేశాల్లో హంగేరీ ఒకటి. జనాభా తగ్గదలకు ఫుట్‌స్టాప్ పెట్టడానికి అక్కడి ప్రభుత్వం వినూత్న పథకాన్ని ప్రకటించింది. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారిని ఆదాయపన్ను నుంచి మినహాయిస్తామని తెలిపింది. వివాహాలు, కుటుంబాలను ప్రోత్సహించడంతోపాటు, వలసలను అరికట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్ చెప్పారు. 'ఆదాయం పన్ను నుంచి మినహాయింపు కావాలంటే... నాలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనండి' అనే ప్రకటన హంగేరీలోని అన్ని వార్తా పత్రికల్లో కనిపించింది. ప్రసార మాధ్యమాల్లోనూ ఈ ప్రకటన వివరాలు జోరందుకున్నాయి. కనీసం నలుగురు పిల్లలను పెంచే మహిళలకు జీవితకాలం ఆదాయపన్ను మినహాయింపు లభిస్తుందని ఆ ప్రకటన సారాంశం. ఈ ప్రకటన ఎంత వరకూ సత్ఫలితాలను ఇస్తుందో చూడాలి.

## ధృవాలను కొలవడానికి నాసా పోలార్ మిషన్



ఫార్‌ఇన్ఫ్రారెడ్ ఎక్స్పెరిమెంట్‌లోని పోలార్ రేడియంట్ ఎనర్జీ (పిఆర్ఇఎఫ్ఐఆర్ఇ/ ప్రీఫైర్) పోలార్ మిషన్‌లో జంట ఉపగ్రహాలు ఉంటాయి. ఒక్కొక్కటి ఒక్కో పరికరాన్ని మోసుకెళ్లి దాదాపు ఆరు గంటల తేడాతో ధ్రువాలను కొలుస్తుంది. భూమి ధ్రువ ప్రాంతాల నుండి ఉష్ణ నష్టంపై ఖచ్చితన సమాచారాన్ని సేకరిస్తుంది. వాతావరణ నమూనాలను సిద్ధం చేస్తుంది. ప్రీఫైర్ మిషన్ నుంచి సేకరించిన డేటా పలు రకాల పరిశోధనలకు ఉపయోగపడుతుంది. ముఖ్యంగా వాతావరణ మార్పులు, ప్రపంచ దేశాల బాధ్యతలను వివరించడానికి ఉపయోగపడుతుంది. షూబాక్స్ పరిమాణంలో ఉన్న క్యూబ్ ఉపగ్రహాలతో కూడిన మిషన్ ఎలక్ట్రాన్ లాంచ్ వెహికల్‌ను ప్రయోగిస్తుంది. అంగారక గ్రహంపై పరిశోధనలకు వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్నే పోలార్ మిషన్‌లోనూ నాసా వాడుతున్నది. థర్మల్ ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోమీటర్‌ను మోసుకెళ్లే రెండు ఉపగ్రహాలు అసమకాలిక ధ్రువ కక్ష్యల్లో ఉంటాయి. వేరువేరు సమయాల్లో ధ్రువాల తీరుతెన్నులను సెన్సార్ల మాదిరి ఉపయోగపడే థర్మోకపుల్ పరికరం పరిశీలిస్తుంది. భూమి మొత్తం భాగంతో పోలిస్తే, 1970 దశకం నుంచి ఆర్కిటిక్ కనీసం రెండు రెట్లు ఎక్కువగా వేడెక్కుతున్నది. ఇందుకు గల కారణాలను అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను అన్వేషించడమే నాసా లక్ష్యంగా ఎంచుకుంది.

## 'డెడ్‌బాట్స్'కు పెరుగుతున్న ఆదరణ



నైతికమా? అనైతికమా? అనే విషయాన్ని పక్కకు పెడితే, డెడ్‌బాట్స్‌కు ఇటీవల కాలంలో ఆదరణ పెరుగుతున్నది అనే మాట నిజం. ఇంతకీ డెడ్‌బాట్స్ అంటే ఏమిటి? మరణించిన తమ ప్రియమైన వారిని గుర్తుకు తెచ్చేలా, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఎఐ) అభివృద్ధి చేసిన చాట్‌బాట్స్‌ను డెడ్‌బాట్స్ అంటున్నారు. మరో రకంగా చెప్పాలంటే, మన నుంచి దూరమైన వారితో మాట్లాడుతున్న అనుభూతి కల్పిస్తాయి. వీటిని 'గ్రీఫ్‌బ్యాట్స్' అని కూడా పిలుస్తున్నారు. భౌతికంగా దూరమైనప్పటికీ, వారితో ప్రత్యక్షంగా సంభాషిస్తున్నట్టు భ్రమ కల్పించే డిజిటల్ విధానం తక్కువ కాలంలోనే విపరీతమైన క్రేజ్‌ని సంపాదించింది. మానసిక ఉపసమనానికి ఉపయోగపడినంత వరకూ ఫరవాలేదుగానీ, ఒక్కోసారి భద్రతకు ముప్పు కలిగించే విధంగా వీటిని వాడే ప్రమాదం లేకపోలేదు. ఉదాహరణకు, ఈ లోకంలో లేని, మనకు అత్యంత ఆప్తులైన వారు మనల్ని దూషిస్తున్నట్టు కనిపిస్తే ఎంతటి మానసిక క్షోభ అనుభవిస్తామన్నది ఊహించడానికే భయం వేస్తుంది. అత్యాధునిక సాంకేతికవల్ల ఎన్నిప్రయోజనాలు ఉన్నాయో, దుర్మార్గుల చేతిలో పడితే, అంతటి వినాశనం తప్పదని ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో రుజువైంది. అలాంటి ప్రమాదం లేనంత వరకూ డెడ్‌బాట్స్ వల్ల సమస్యలు ఉండవు. ప్రస్తుతానికి ఈ కొత్త ట్రెండ్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్నది.

## అటవీ సంరక్షణ సాధ్యమా?



అడవులను సంరక్షించడంతోపాటు, ఇప్పటికే నాశమైన ప్రాంతాల్లో తిరిగి అటవీ సంపదను పెంచాలనే ఐక్యరాజ్య సమితి ఉద్దేశం మంచిదే. కానీ, పర్యావరణ పరిరక్ష వంటి పలు అంశాల మాదిరిగానే అటవీ సంరక్షణ కూడా ఒక ప్రహసనంలా మారడమే ఆందోళన కలిగిస్తున్నది. 2030 నాటికి అడవులను సమృద్ధిగా విస్తరింప చేయాలన్నది 'యునైటెడ్ నేషనల్స్ ఫోరమ్ ఆన్ ఫారెస్ట్స్ (యుఎన్ఎఫ్ఎఫ్) ప్రధాన లక్ష్యం. అందకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి క్రమం తప్పకుండా సమావేశాలు జరుపుతున్నది. ప్రపంచ దేశాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. చర్చలు... సమీక్షలు.. తీర్మానాలకు లోటు లేదు. కానీ, తీర్మానాలను ఆమోదించిన ఎన్ని దేశాలు వాటిని అమలు చేస్తున్నాయన్నదే ప్రశ్న. ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలి (యునెస్కో) ఆధ్వర్యంలో, 2000 సంవత్సరంలో ప్రారంభమైన యుఎన్ఎఫ్ఎఫ్ అన్ని రకాల అడవుల నిర్వహణ, పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. న్యూయార్క్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏటా సమావేశమవుతుంది. ఈ సంవత్సరం కూడా సమావేశమై, అటవీ సంరక్షణపై విస్తృతంగా చర్చించింది. 2030 లోగా, పర్యావరణ పరిరక్షణకు అనువుగా అడవులను పెంచడం లేదా నిర్వహించడం చేయాలన్న ఎజెండాను సభ్య దేశాలు మరోసారి గుర్తుచేసుకున్నాయి. అన్ని దేశాలు ఒకే తాటిపై నిలిచి, అడవులను సంరక్షించాలని కూడా తీర్మానించాయి. కానీ, గతంలో తీసుకున్న ఇలాంటి నిర్ణయాలు సక్రమంగా అమలైన దాఖలాలు లేవు. యుఎన్ఎఫ్ఎఫ్ లక్ష్యం ఉదాత్తమైనదే అయినప్పటికీ, అమలుకానప్పుడు తీర్మానాలు ఎందుకనే ప్రశ్న తలెత్తుతుంది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

## తొలిరౌండ్ అసెంబ్లీ ఎన్నికలు

ప్రజాపక్షం
**23-06-2024, ఆదివారం**

18వ సార్వత్రిక ఎన్నికల తదుపరి తొలి రౌండ్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించింది. హర్యానా మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీల పదవీకాలం వరుసగా నవంబర్3, నవంబర్26, జనవరి 5వ తేదీల్లో ముగియనుంది. ఈలోపు కొత్త ప్రభుత్వాలు కోలువుతీరేలా ఎన్నికల షెడ్యూలు ఖరారుచేయబడుతుంది. వివిధ కారణాలరీత్యా దేశంలో అసెంబ్లీల పదవీకాలాలు వేర్వేరు సమయాల్లో ఆరంభమవుతున్నాయి. అందువల్ల "ఒకే దేశం—ఒకే ఎన్నికలు" అంటూ ప్రధాని నరేంద్రమోదీ కొన్నేళ్లుగా లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహణ ఆవశ్యకతను ప్రచారంలో పెట్టారు. ఇంత పెద్దదేశంలో గ్రామపంచాయతీ నుండి లోక్‌సభవరకు ఒకేరోజు ఎన్నికల నిర్వహణ సాధ్యంకాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒక రోజు ఎన్నికల నిర్వహణ సౌలభ్యంగా, ఆచరణ సాధ్యంగా కనిపిస్తున్నప్పటికీ, ఒకవేళ ఏదైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూలిపోతే మళ్లీ ఎన్నికల క్రమం వరుస తప్పుతుంది కదా, అప్పుడెలా అనే ధర్మసందేహాలు అనేకం ఉన్నాయి.

1967సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గుత్తాధికారాన్ని ప్రజలు తిరస్కరించటంతో ఏడెనిమిది రాష్ట్రాల్లో తొలిసారి సంకీర్ణ (సంయుక్త విధాయక్ దళ్ పేరుతో) ప్రభుత్వాలు ఏర్పడటం, వాటిలో అనేకం రెండేళ్లలోపు కూలిపోవటంతో ఎన్నికల నిర్వాహణ షెడ్యూలు చైన్ తెగింది; దేశంలో సంకీర్ణ రాజకీయ శకానికి పునాదులు పడ్డాయి. ఎమర్జెన్సీ అనంతరం 1977లో కేంద్రంలో అధికారం చేబట్టిన తొలి సంకీర్ణ (జనతాపార్టీలో పాత—సిండికేట్—కాంగ్రెస్, సోషలిస్టులు, జనసంఘ్ భాగస్వాములు) ప్రభుత్వం కాంగ్రెస్ పాలిత 8 రాష్ట్ర ప్రభుత్వాలను ఒక్క కలంపోటుతో రద్దు చేసి ఎన్నికలు జరిపింది. హర్యానాలో భజన్‌లాల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మొత్తంగా జనతాపార్టీ ప్రభుత్వంగా మార్చివేశారు. 1980లో తిరిగి అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధి అదే జనతా పార్టీ ప్రభుత్వాలను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లగా అవి మళ్లీ కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో అంతర్గత విభేదాలు, అవిశ్వాస తీర్మానాలతో ప్రభుత్వాలు పడిపోయి మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఇలా సంకీర్ణ రాజకీయ శకం కొనసాగుతుండగా 1998లో కేంద్రంలో వాజ్‌పేయి ప్రధానిగా ఏర్పడిన రెండవ సంకీర్ణ ప్రభుత్వం (ఎన్‌డిఏ) కాలంలో లోక్‌సభతోపాటు అసెంబ్లీ ఎన్నిలు జరిపేందుకు గల అవకాశాలపై నాటి హోంమంత్రి ఎల్.కె అద్వాణీ కొంత ఎక్సర్‌సైజ్ చేశారు. అది కొలిక్కిరాలేదు. 2004లో కాంగ్రెస్ యుపిఎ పేరుతో అధికారంలోకి రావటంతో ఆ చర్చ అంతటితో ఆగిపోయింది.

అయితే ఒకే దేశం —ఒకే సంస్కృతి, ఒకే దేశం—ఒకే భాష లాంటి హిందూ ఆధిపత్య అత్యాశలతో ప్రధాని నరేంద్రమోదీ 'ఒకే దేశం—ఒకే ఎన్నికలు' పాట మొదలుపెట్టారు. రెండవటరం అధికారం ముగిసే కొద్ది నెలల ముందు మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ నేతృత్వంలో ఇదే అంశంపై ఒక కమిటీని వేశారు. అది నివేదిక సమర్పించింది. 400 పైగా సీట్లతో మూడవ ఏకచ్ఛత్రాధిపత్య పదవీకాలాన్ని కోరుకున్న నరేంద్ర మోదీ కి దేశ ప్రజలు కనీస మెజారిటీ సీట్లు ఇవ్వకుండా సంకీర్ణ ప్రభుత్వాధినేతను చేశారు. అందువల్ల కోవింద్ నివేదికకు దుమ్ముపడుతుందో లేక ఎప్పుడు బయటకు తీస్తారో చెప్పటం కష్టం. ఆ కమిటీ పరిష్కారమేమిటో, సూచించిన సాధ్యాసాధ్యాలేమిటో బయటకు వచ్చి ఏకాభిప్రాయసాధన జరిగేవరకు ప్రతి ఏటా షెడ్యూలు ప్రకారం విడతలవారీ అసెంబ్లీ ఎన్నికలు జరగకతప్పదు.హర్యానాలో బిజెపి, మహారాష్ట్రలో దాని సంకీర్ణం, జార్ఖండ్‌లో జెఎంఎం—కాంగ్రెస్ సంకీర్ణం అధికారంలో ఉన్నాయి. అందువల్ల, లోక్‌సభ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్రల్లో బిజెపి దెబ్బతిన్న దృష్ట్యా ఈ అసెంబ్లీ ఎన్నికలు దానికి అత్యత కీలకం.

# 2024లో ప్రజల తీర్పునుండి పాఠాలు



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

స్వతంత్ర భారతదేశ చరిత్రలో 2024 సార్వత్రిక ఎన్నికలు అసాధారణమైనవిగా, ఆ పదానికున్న ప్రతి అర్థంలో గుర్తుం చుకోబడుతుంది. రాజ్యాంగంపై బిజెపి దురాగతాలను, దాడిని ప్రతిఘటించే నిమిత్తం 'ఇండియా' కూటమి ఏర్పడింది. లౌకిక–ప్రజాతంత్ర శక్తులు కలసికట్టు అయినాయి. నిరుద్యోగం, ధరలు పెరుగుదల వంటి సమస్యలు లేవనెత్తేందుకు, సమానత్వం, స్వేచ్ఛ, లౌకికత, సమాఖ్యవ్యవస్థ, సంక్షేమ రాజ్యం విలువలకు తలెత్తిన ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ఈ కూటమి ప్రతినబూనింది. 2024లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అందులో భాగస్వాములైన అందరికీ, రాజకీయ పార్టీలకు వేర్వేరు గుణపాఠాలు చెప్పాయి. లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీతో దశాబ్దంపాటు సాగిన దుష్పరిపాలన మన ప్రజాస్వామ్యాన్ని కుదించేందుకు, మన రాజ్యాంగ విలువలను దెబ్బతీసేందుకు దారితీసింది. బిజెపి పాలనలో ప్రజల కష్టాలు పెచ్చుపెరిగాయి. నిరుద్యోగం, అసమానత, ధరల పెరుగుదల ప్రజల జీవితాన్ని దుర్భరంచేశాయి.

మన రాజ్యాంగానికి, ఆర్థిక యాజమాన్యానికి ముప్పు, కేంద్ర ఏజన్సీల దుర్వినియోగం సందర్భంలో ఎన్నికలు జరిగాయి. దేశాన్ని హిందూ మతరాజ్యం దిశలో నడిపించటంవల్ల లౌకిక ప్రజాతంత్ర దేశం అనే అర్థతకూడ మసకబారింది. ఈ అన్ని కారణాలరీత్యా దేశ ప్రజలు నిర్ణయాత్మకంగా బిజెపి, ప్రధానమంత్రి మెడలు వంచారు. ఆయన అనుసరించిన ద్వేషం, ప్రజలమధ్య విభజన, బెదిరింపులు, ఆశ్రితపక్షపాతం రాజకీయాలను తిరస్కరించారు. లోక్‌సభలో బిజెపి సంఖ్యాబలం 63 సీట్లు తగ్గాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి హిందీ గుండెకాయ రాష్ట్రాల్లో ఓటమి పొందారు. "ఏక్ అకెలా సబ్ పార్ బారీ" అంటూ ప్రధానమంత్రి మోదీ ఆవేశంగా ఛాతీ గుద్దుకోవటాన్ని ప్రజలు తిరస్కరించారు. టిడిపి, జెడి(యు), ఎస్ఎస్(షిండె), ఎల్‌జెపి (ఆర్‌వి), జెడిఎస్, హెచ్ఎఎంఎస్, అప్నాదళ్ (ఎస్), ఎన్‌సిపి (అజిత్‌పవార్) (గ్రూపు వగైరాల తోడ్పాటుతో ఆయన విధిలేక సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు.

రెండోవైపున, ఇండియా కూటమి బిజెపి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బలమైన ప్రత్యర్థిగా ఆవిర్భవించినప్పటికీ మెజారిటీ మార్క్ చేరుకోలేకపోయింది. రాజ్యాంగాన్ని సమర్థిస్తూ, కార్పొరేట్‌లకు అనుకూలంగా దేశ ఆర్థికవ్యవస్థను నడుపుతున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి బలంగా చేసిన ప్రచారం, బిజెపి బలాన్ని ఉత్తరించిన ప్రజల తీర్పులో ప్రతిధ్వనించింది. బిజెపి నిరంకుశ పెత్తందారీతనం నుండి ప్రజాస్వామ్య రక్షణకై 2024లో చేసిన ముఖ్యమైన పోరాటంలో గెలిచాం. అయితే మన ప్రజాస్వామ్యం ఆరోగ్యం పునరుద్ధరించటం, మన సమాజ లౌకిక స్వభావాన్ని సజీవంగా ఉంచేందుకు సాగించే అంతకన్నా పెద్దయుద్ధం మన ముందుంది. ఈ వెలుగులో ఎన్నికల తీర్పును పరిశీలించాలి.

నేను ఇంతకుముందు వ్యాసాల్లో రాసినట్లు, మన రాజ్యాంగాన్ని రక్షించుకోవటం ఈ ఎన్నికల్లో ప్రధాన సమస్యగా, బహుశా మొట్టమొదటిసారి ముందుకు వచ్చింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, మెజారిటీ ఆధిపత్యవాదం వంటి ఇతర ప్రధాన సమస్యలతోపాటు రాజ్యాంగాన్ని, అందులో పొందుపరిచిన సమానత్వం, సామాజిక న్యాయం, సమాఖ్యవ్యవస్థ (ఫెడరవిజం), బలహీన తరగతుల అభ్యున్నతికి గట్టి సానుకూల చర్యలు వంటి విలువలను బిజెపి దాడినుండి రక్షించుకోవలసిన అవసరాన్ని ప్రజలు, ముఖ్యంగా బడుగు–బలహీన తరగతులు బాగా అర్థంచేసుకున్నారు.

**నేను ఇంతకుముందు వ్యాసాల్లో రాసినట్లు, మన రాజ్యాంగాన్ని రక్షించుకోవటం ఈ ఎన్నికల్లో ప్రధాన సమస్యగా, బహుశా మొట్టమొదటిసారి ముందుకు వచ్చింది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, మెజారిటీ ఆధిపత్యవాదం వంటి ఇతర ప్రధాన సమస్యలతోపాటు రాజ్యాంగాన్ని, అందులో పొందుపరిచిన సమానత్వం, సామాజిక న్యాయం, సమాఖ్యవ్యవస్థ (ఫెడరలిజం), బలహీన తరగతుల అభ్యున్నతికి గట్టి సానుకూల చర్యలు వంటి విలువలను బిజెపి దాడినుండి రక్షించుకోవలసిన అవసరాన్ని ప్రజలు, ముఖ్యంగా బడుగు–బలహీన తరగతులు బాగా అర్థంచేసుకున్నారు.**

ప్రధానమంత్రి మోదీ, బిజెపి ద్వేషపూరితరాజకీయాలను భారతదేశ ప్రజలు బలంగా తిరస్కరించారు. ఆర్ఎస్ఎస్–బిజెపి దాడి నుండి రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఓటుచేశారు. రెండు కారణాల రీత్యా దీనికి విశేష ప్రాధాన్యత ఉంది. ఒకటి, రాజ్యాంగ రక్షణకై ప్రజలు ఓటు హక్కు వినియోగించటం మనదేశంలో రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం ఎంత లోతుకు చొచ్చుకుపోయిందో, బడుగు –బలహీనవర్గాలు, శ్రమజీవులు తమ హక్కులు, మానమర్యాదలు, ప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాంగాన్ని ఎంత తప్పనిసరి అవసరంగా గుర్తించారో నొక్కిచెబుతున్నది. రెండు, ఆర్ఎస్ఎస్–బిజెపిలను మన రాజ్యాంగానికి, దాని విలువలకు వ్యతిరేకమైన శక్తిగా ప్రజలు స్పష్టంగా గుర్తించటం భారతదేశంలోని మితవాద శక్తుల రాజకీయ వైఖరిని బట్టబయలుచేసింది. ఆ వైఖరి స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజానికి, అవకాశాలకు వ్యతిరేకం. ప్రజలు రాజ్యాంగ రక్షణకై వామపక్ష మొగ్గు కలిగిన మధ్యేవాదులను మధ్యేవాదులు, సామాజిక న్యాయం అనుకూల శక్తులను ఎంచుకున్నారు. ఇది మన రాజ్యాంగం పట్ల ప్రజల భావన ఎంత బలపడిందో పుంఖానుపుంఖాలుగా చెబుతుంది. మన రాజ్యాంగానికి సంబంధించిన చర్చ, రాజకీయ వైఖరి మన రాజకీయ వ్యవస్థపై గాఢమైన ప్రభావం కలుగజేస్తుంది. ఎందుకంటే, రాజ్యాంగంలో పొందుపరిచినట్లు తాము పోరాడి సాధించుకున్న హక్కులను మితవాదులకు చెందిన నియంతృత్వ శక్తులు లాక్కోవటాన్ని అనుమతించబోమని ప్రజలు స్పష్టంగా చెప్పారు. అంతేగాక, అధికారిక పక్షం, మీడియా గడిచిన 10 సంవత్సరాల్లో ప్రతిపక్షాలపై దూకుడుగా దాడి చేశాయి. ప్రతిపక్షానికీ, ఇండియా కూటమిలో భాగస్వాములకు వ్యతిరేకంగా గత దశాబ్దం పాటు ఎంత తప్పుడు ప్రచారం సాగించినప్పటికీ, ప్రజలు తమ జీవన సమస్యలకు ప్రాధాన్యతయిచ్చి లౌకిక ప్రజాతంత్ర పార్టీలను బలపరచాలని నిర్ణయించుకున్నారు. ప్రతిపక్షాలు ప్రజల నిత్యజీవిత సమస్యలను దృఢంగా ఎండగట్టటం వాటిని వారి ఆదరణకు పాత్రులను చేసింది.

ప్రతిపక్షాల పరోక్షంలో అనేక ముఖ్యమైన శాసనాలు ఆమోదింపజేసుకోవటం ద్వారా ప్రధానమంత్రి, బిజెపి పార్లమెంటును అసంగతం చేయటానికి, నిరుపయోగమొనర్చటానికి గట్టిగా ప్రయత్నించాయి. పార్లమెంటరీ కమిటీలకు విలువలేకుండా చేశారు. బిల్లులను మనీ బిల్లులుగా వర్గీకరించి రాజ్యసభను నిరుపయోగం చేసే ప్రయత్నం చేశారు. చర్చ లేకుండా బిల్లులు ఆమోదించారు. అది సాధ్యం కానప్పుడు ప్రతిపక్ష ఎంపిలను సభ నుండి సస్పెండ్ చేసేవారు. ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్‌లో రికార్డు నెలకొల్పింది. పార్లమెంటరీ వ్యవస్థను దురుపయోగం చేయటానికి, లోపలినుండి దాన్ని ఛిద్రం చేయటానికి బిజెపి తన పార్లమెంటరీ బలాగాన్ని ఉపయోగించింది.ఇప్పుడు వామపక్షంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండటం, మోదీ సున్నితమైన సంకీర్ణానికి నాయకత్వం వహిస్తుండటం వల్ల పార్లమెంటు న్యాయబద్ధత పునరుద్ధరణ పొందవచ్చు. ఈ ఖ్యాతి అంతా ప్రతిపక్ష పార్టీలకు, పార్లమెంటుకు ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు వాటి సంకల్పానికి చెందుతుంది. మన ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో పార్లమెంటు విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యతవుంది. బలమైన ప్రతిపక్షం పార్లమెంటరీ వ్యవస్థకు ఎంతో విలువైనది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో మరో ముఖ్యాంశం మోదీ ప్రభుత్వం కేంద్ర ఏజన్సీలను బరితెగించి దుర్వినియోగపరచటం. భారత ఎన్నికల కమిషన్ సహా ముఖ్యమైన రార్యాంగబద్ధ సంస్థలు కార్యనిర్వాహకవర్గంతో రాజీపడటం. ప్రతిపక్షాన్ని బెదిరించి లొంగదీసుకోవటానికి ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర ఏజన్సీలను బిజెపి దుర్వినియోగం చేసింది. పలువురు రాజకీయ ప్రత్యర్థులను దర్యాప్తులతో వేధించింది, మరికొందిరిని జైళ్లలో తోసింది. కొన్ని రాజకీయ పార్టీలను బెదిరించి చీల్చారు. కొందరు వ్యక్తులను వేధించి తమ విధేయుల్ని చేసుకున్నారు. బిజెపి ఇతర పార్టీ లనుంచి దిగుమతి చేసుకున్న నాయకులకు నిలయమైంది. అవినీతిపరులుగా బిజెపి నిందించినవారే. వారిలో చాలా మంది ఉన్నారు. పలువురు హక్కుల కార్యకర్తలు, పాత్రికేయులు అల్పమైన ఆరోపణలతో నిరంకుశ చట్టాల కింద జైళ్లలో నిర్బంధంలో కొనసాగుతున్నారు.

కేంద్ర ఏజన్సీలు, సంస్థలకు స్వాతంత్ర్యం, స్వయం ప్రతిపత్తి, సవ్యంగా పనిచేయటాన్ని పునరుద్ధరించటం ద్వారా స్వేచ్ఛకు ప్రమాదాన్ని అదుపులో పెట్టాలి. ఇసిఐ, ఆర్‌టిఐ, సివిసి వంటి ముఖ్యమైన సంస్థల, వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తూ బిజెపి గతంలో అనేక నిబంధనలు తెచ్చింది. ప్రతిపక్షం పట్టువిడుపులేకుండా ఈ కుమ్మక్కును ఎండగట్టాలి. వాటి దుర్వినియోగాన్ని ఆపాలి. వాటి కార్యకలాపాల్లో కార్యనిర్వాహకవర్గం జోక్యాన్ని నివారించేందుకై వాటిని పార్లమెంటుకు జవాబుదారీ చేయాలి. మన ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా పనిచేయటానికి ముఖ్యమైన సంస్థలు సక్రమంగా పనిచేయటం అవసరం. పక్షపాతరహిత వ్యవస్థాగత స్వరూపానికి ఇండియా కూటమి నిబద్ధమై ఉంది.

**ఇండియా కూటమి మెజారిటీ మార్క్ చేరుకోలేకపోయినప్పటికీ, బిజెపి, మోదీ అహంకారాన్ని ఓడించటంలో, ఈ సారికి 400 సీట్లనే బుడగకు రంధ్రం పెట్టటంలో దాని శక్తిని నిరూపించుకుంది. అదే సమయంలో ఇది ఇండియా కూటమి భాగస్వాములు ఆత్మావలోకనం చేసుకుని, భవిష్యత్ వ్యూహాలు రూపొందించుకోవలసిన సమయం పరస్పర గౌరవం, సర్దుబాటు–తత్వం, సైద్ధాంతిక పొందిక రానున్న అనేక పోరాటాలు ఇండియా కూటమి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. ఆర్ఎస్ఎస్ విభజనవాద సిద్ధాంతం చొరబాటును మన వ్యవస్థ నుండి ఏరివేసేంతవరకు ఇది అవసరం.**

వ్యవస్థలు రాజీపడినప్పటికీ బలమైన బిజెపి పొగరుదించటం ఇండియా కూటమి తప్పక సంతోషించదగిందే. అయితే ఈ ఊపును నిలబెట్టుకోవటానికి ఆత్మవిమర్శనాపూర్వక విశ్లేషణ, భవిష్యత్ అవగాహన పట్ల స్పష్టత అవసరం. ఆశాభావం, న్యాయం, జీవనోపాధులు కలుగజేసే కూటమిగా ఇండియా అలయెన్స్‌ను దేశ ప్రజలు స్పష్టంగా చూస్తున్నారు. భాగస్వామ్య పక్షాలు పరస్పర ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని సంయుక్తంగా ప్రచారాందోళనలు, గౌరవప్రదమైన సర్దుబాటు ద్వారా సైద్ధాంతికంగా, రాజకీయంగా మరింత సన్నిహితం కావాలి. మితవాద శక్తులపై పోరాటం, ఓడించటంలో తమిళనాడు ఉత్తేజకరమైన నమూనాను నెలకొల్పింది. స్వాతంత్ర్య పోరాట వారసత్వాన్ని, రాజ్యాంగాన్ని కాపాడవలసిన గొప్ప బాధ్యతను ప్రజలు మనకు అప్పగించారు. వామపక్షం పోరాడాలని, బలమైన శక్తిగా తనను తాను నిర్మించుకోవాలని, పార్లమెంటులోనే కాదు, రాష్ట్ర శాసనసభల్లో, స్థానిక సంస్థల్లో కూడా తగిన ప్రాతినిథ్యం పొందాలని ఆవిర్భవిస్తున్న పరిస్థితి డిమాండ్ చేస్తున్నది. మన రాజ్యాంగం యొక్క లౌకిక, ప్రజాతంత్ర, సంక్షేమ, ఫెడరల్ స్వభావాన్ని తప్పక కాపాడుకోవాలి. రాజ్యాంగానుసారంగా జీవనోపాధులు కల్పించాలి. ప్రజలు ఉంచిన విశ్వాసంమేరకు పనిచేయటం, మన రాజ్యాంగ విలువలను క్రియాశీలంగా కాపాడుకోవటం, ప్రజల జీవితాలకు సకారాత్మకంగా ఐక్యంగా దోహదం చేయటం ఇప్పుడు ఇండియా కూటమి భాగస్వాములమైన మనపై ఉంది.

# ప్రభావవంతమైన మూడు పరిణామాలు

**రాజధాని సందడి**
– బొమ్మగాని కిరణ్‌కుమార్

తెలంగాణ రాష్ట్రంలో శుక్రవారం ఒక్క రోజే మూడు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందులో ఒకటి కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేరిక, రెండవది బొగ్గు గనుల వేలం పాట ప్రారంభం, మూడవది ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ చేయాలని క్యాబినెట్ తీసుకున్న కార్యాచరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించడం. ఇందులో అందరినీ ఆకర్షించింది కాంగ్రెస్ పార్టీలో పోచారం చేరిక. గతంలో ఆయన స్పీకర్‌గా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని టిఆర్ఎస్‌లో విలీనం చేస్తూ ప్రకటన చేశారు. అలాంటిది ఆయనే స్వయంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీకి ఇతర పార్టీల నుండి చేరికలు అవసరమా? అంటే అనివార్యమని ఆ పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని బిఆర్ఎస్ నేతలు, బిజెపి నేతలు శాపనార్థాలు పెట్టారు. దీనిని తెలంగాణ ప్రజలు హర్షించలేదు. తొలి నాళ్లలో బిఆర్ఎస్ ఎంఎల్‌ఏలు పలువురు కాంగ్రెస్‌లో చేరేందుకు సెక్రెటేరియెట్, సిఎం, ఇతర కాంగ్రెస్ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాని అప్పట్లో వారిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోలేదు. అయినప్పటికీ బిఆర్ఎస్, బిజెపిల నేతలు ప్రభుత్వం కూలిపోతుందనే వ్యాఖ్యలు మానలేదు. చివరకు పార్లమెంటు ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరువాత కాంగ్రెస్ గేట్లు తెరుస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో స్వయంగా పిసిసి అధ్యక్షుడు, సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే రోజు కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితం ఆరంభించి, అనేక పదవులు అనుభవించి, తరువాత బిఆర్ఎస్‌లో చేరిన ఎంఎల్‌ఏ దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వచ్చారు. ఆయనే సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా పోటీ కూడా చేశారు. అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కుమార్తె కావ్య బిఆర్ఎస్ టికెట్‌ను తిరస్కరించి, వరంగల్ నుండి కాంగ్రెస్ తరుపున లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తరువాత బిఆర్ఎస్ భద్రాచలం ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్ గూటిలో చేరగా, ఉప ఎన్నికలో సికిందరాబాద్ కంటోన్మెంట్ నుండి కాంగ్రెస్ తరుపున శ్రీగణేశ్ గెలుపొందారు. దీంతో ఆరు నెలల్లో కాంగ్రెస్ బలం 64 నుండి 68 కి పెరిగింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అనేక మంది స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులు కూడా క్యూ కట్టారు. అయితే, లోక్‌సభలో డబుల్ డిజిట్ స్థానాలు ఆశించిన కాంగ్రెస్ ఎనిమిది స్థానాల్లో గెలుపొందింది. గతం కంటే మెరుగైన ప్రదర్శనను కనబరిచినప్పటికీ, ఆ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటు బ్యాంక్ ఉద్దేశ్యపూర్వకంగానో మరో కారణం చేతనో బిజెపికి మళ్ళడం ఆందోళన కలిగించింది. తమ పార్టీకి లోక్‌సభలో ఒక్క సీటు కూడా రాకపోవడంతో బిఆర్ఎస్ క్యాడర్‌లో నిరాశ ఛాయలు అలుముకున్నాయి. ఆ పార్టీ ఓట్ల శాతం సైతం సగానికి మించి తగ్గిపోయి, అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన 37.38 శాతం నుండి 16.68 శాతానికి పడిపోయింది. దీంతో శాసనసభ్యులు కూడా ఆలోచనలో పడ్డారు. కేంద్రంలో బిజెపి ఒంటరిగానే మంచి మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఉంటే ఆ పార్టీ వైపు చూద్దామనుకున్న బిఆర్ఎస్ ఎంఎల్‌ఏలు, అక్కడ టిడిపి, జెడి(యు)ల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడడంతో ఆలోచనలో పడ్డారు. మరో వైపు బిఆర్ఎస్ అగ్రనేతలకు పలు విచారణ కమిషన్‌లు, కేసులు, ఆరోపణలు చుట్టు ముడుతుండడంతో ఆ పార్టీ ఎంఎల్‌ఏలు భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరిగినప్పటికీ, తెలంగాణలో బిజెపి పుంజుకునే ప్రమాదం కనపడుతుంది. దీన్ని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా ఎటూ పాలుపోని బిఆర్ఎస్ ఎంఎల్‌ఏలను కాంగ్రెస్‌లోకి తీసుకునేందుకు పావులు కదులుతున్నాయి. అందులో భాగంగానే ఎంఎల్‌ఏ, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా ఆయన ఇంటికి వెళ్ళి పార్టీలోకి చేర్చుకున్నారు. ఇక త్వరలోనే మరో 20 మంది కాంగ్రెస్‌లోకి చేరుతారనే వార్తలు వస్తున్నాయి.ఇందులో ప్రధానంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎంఎల్‌లు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ జాబితాను అధిష్టానం వద్దకు క్లియరెన్స్ కోసం పంపినట్లు తెలిసింది. అయితే, పోచారం శ్రీనివాస్ రెడ్డితో ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రారంభించడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది. రెండవ కీలక పరిణామం బొగ్గు గనుల వేలం పాట. ఇటీవలనే కేంద్ర బొగ్గు గనుల మంత్రిగా రాష్ట్రానికి చెందిన జి.కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత దేశ వ్యాప్తంగా 67 బొగ్గు గనుల వేలం పాటలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మైనింగ్ చేస్తున్న సింగరేణి బొగ్గు గనుల పక్కనే సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్ 3, శ్రావణపల్లి బ్లాక్, పికె డిప్ సైడ్ ఒసి గనులు ఉన్నాయి. వాటిని సింగరేణికి కేటాయించాలని కోరుతున్నారు. వాటిలో సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్ 3లను గతంలోనే వేలం ద్వారా రెండు ప్రైవేటు సంస్థలు దక్కించుకున్నాయి. తాజాగా శ్రావణపల్లికి వేలం వేస్తున్నారు. అయితే సింగరేణి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం మొరపెట్టుకున్నప్పటికీ వీటిని కేటాయించకుండా కేంద్రం వేలం పాటకే సిద్ధమైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వేలం పాట వేదిక వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి, ఆ గనులను సింగరేణికి కేటాయించాలని, అందుకు ప్రస్తుత ఎంఎండిఆర్ చట్ట సవరణ తరువాత కూడా 17(ఎ) లోని రిజర్వేషన్ ప్రక్రియ ఉపయోగించాలని సూచించారు. కాని కేంద్రం మాత్రం ప్రైవేటీకరణ విధానంలో భాగంగా వేలం పాట ముందుకే సాగుతోంది. ఇక మూడవ పరిణామం రైతు రుణమాఫీ. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రకటించినప్పటికీ, టిఆర్ఎస్ రైతు బంధు కారణంగా కాంగ్రెస్‌కు ఆ ఎన్నికల్లో లబ్ది చేకూరలేదు. పిసిసి అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి పగ్గాలు చేపట్టిన తరువాత 2023 ఎన్నికలకు ఏడాదిన్నర ముందే వరంగల్ లో మే 6, 2022న ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ ప్రకటించారు. దీనిని విస్తృతంగా జనంలోకి తీసుకెళ్ళడంలో ఆ పార్టీ సక్సెస్ అయింది. ఈ వాగ్దానాన్ని జాతీయ కాంగ్రెస్ సైతం తన మ్యానిఫెస్టోలో పెట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలకు రైతు రుణమాఫీకి మార్గం సుగమం చేసింది. మొత్తం రూ.31 వేల కోట్లు దీనికి అవసరం. విధి విధానాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, వచ్చే నెల నుండి ఆగస్టు 15 లో గా రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటూ పోతుంది. తెలంగాణలో రైతులకు లబ్ది చేకూర్చిన ప్రభుత్వాలను , నాయకులను రైతులు మరవలేదు. గతంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఉచిత కరెంటు, కెసిఆర్ రైతు బంధుతో విశేషంగా లబ్ది పొందారు. తాజాగా రైతుకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కూడా అదే స్థాయిలో విశ్వాసం ఉండే అవకాశం లేకపోలేదు. గతంలో యుపిఎ హయాంలో రైతులకు ఏక కాలంలో కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేసింది. రాష్ట్రంలో అప్పటికే రుణాలు చెల్లించిన రైతులకు వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి రూ.5వేల చొప్పున ప్యాకేజీ ప్రకటించారు.యుపిఎ 2 ప్రభుత్వం ఏర్పడేందుకు తెలంగాణ నుండి అధిక ఎంపి స్థానాలు గెలుచుకునేందుకు దోహదపడడంలో ఈ అంశం కూడా ఒకటి. ఒకే రోజులో సంభవించిన ఈ మూడు పరిణామాలు అటు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని, వ్యవసాయ, సింగరేణి భవితవ్యాన్ని మార్చేలా ఉన్నాయి. ఇది ఎటు దారి తీస్తుందో కాలమే చెప్పాలి.

## 28 నుంచి ఖమ్మంలో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు

ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఐ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకు ఖమ్మంలో జరగనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నేడు తెలిపారు. 28న రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని 29,30 తేదీలలో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు.సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారు.

## వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించి, బాధ్యతాయుతంగా పని చేయాలని వైద్యులను సూచించారు. ఐసియులో బెడ్స్, డ్రగ్స్, నిరంతరం శానిటేషన్ చేపట్టాలని, ప్రసూతికి వచ్చే మహిళలకు సాధారణ ప్రసవం చేసేందుకుఅధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోగులకు మందులు కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు. ఆసుపత్రిలో జనరల్ క్యాజువాలిటి, ఆర్థోవార్డులను తనిఖీ చేసి రోగులతో అందుతున్న వైద్యం సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసరంగా కావాల్సిన వాటి కోసం నివేదికను రూపొందించాలని సూచించారు. అనంతరం అధికారుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్సోత్తం, డాక్టర్ నర్సింహ్మా, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## 'బండి'ని కలిసిన బిసి యువజన నేతలు



ప్రజాపక్షం/కరీంనగర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను శనివారం కరీంనగర్‌లోని ఎంపి కార్యాలయంలో జిల్లా బిసి యువజన సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ శాలువా కప్పి పూలబొకే ఇచ్చి కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సత్కరించారు. ఆయనను కలిసిన వారిలో బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, బిసి యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాటా వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీనివాస్, కరీంనగర్ మండల అధ్యక్షుడు బెల్లం నరేందర్, బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తదితరులున్నారు.

## చౌటుప్పల్‌లో ఆసుపత్రి సీజ్




ప్రజాపక్షం/చౌటుప్పల్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యాధికారులు కొరడా జూలిపించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గత కొంతకాలంగా అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను గుర్తించిన వైద్యాధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేసి సీజ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పాపారావు ఆదేశాల మేరకు చౌటుప్పల్ పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసినట్లు డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.యశోధ తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్ట ప్రకారం అనుమతులు లేని గుర్తించడం జరిగిందని అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో ప్రియాంక ఎముకల ఆసుపత్రి, సంజీవిని ఫిజియోథెరపీ సెంటర్, అర్చమోలల ఆసుపత్రి, సాయిరాం ఎముకల ఆసుపత్రి లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆయా ఆసుపత్రుల్లో అర్హత కలిగిన డాక్టర్లు కూడ లేనట్లు తెలిసిందని చెప్పారు. ప్రజల జీవితాలతో చెలగాట మాడడం నేరమని అన్నారు. అర్హత లేకుండా వైద్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ సుమన్ కళ్యాణ్, మండల వైద్యాధికారి కాటంరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుబ్లాకులు సింగరేణికే కేటాయించాలి




ప్రజాపక్షం/ ఖమ్మం : బొగ్గు బ్లాకులను వేలం పాట వేయకుండా సింగరేణికి ఉచితంగా కేటాయించాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. స్వదేశీ మోడీ గ్యారెంటీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి వనరులను, ఖనిజాలను, జాతి సంపదను నిలువునా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని ఆయన ఆరోపించారు. శనివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్న బిజెపి ఇప్పటికే 300 బొగ్గు బ్లాకులను ప్రైవేటు కంపెనీలకు దరాదత్తం చేసిందని ఇప్పుడు మరో 60 బొగ్గు బ్లాకులను అమ్మడానికి వేలం నిర్వహిస్తుందని రంగారావు ఆరోపించారు. రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమించాలని విజ్ఞప్తిచేశారు. బిజెపి హయాంలో ఇప్పటికే 70కు పైగా పేపర్లు లీకై యువత భవితవ్యాన్ని దెబ్బతీశాయని తాజాగా నీట్ నెట్ పరీక్షలు లీక్ కావడంతో కోట్లాది మంది నిరుద్యోగులు నష్టపోయారన్నారు. బిజెపి వైఖరి అక్రమార్కులకు అండగా నిలుస్తుందన్నారు. మీడియా సమావేశంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్య, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, పార్టీ నాయకులు ఆవుల అశోక్, ఆవుల వెంకటేశ్వర్లు, కె. రామయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, సివై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేరుస్తాం

ప్రజాపక్షం/దేవరకొండ: వచ్చే నెల నుండి రూ. 31 వేలకోట్లతో రుణ మాఫీ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం నల్గొండ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంఎల్ఏలు, ఎంఎల్సీలు, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలతో కలిసి సమావేశంలో పాల్గొన్న బాలునాయక్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

# దిగజారుతున్న పోలీసుల ప్రతిష్ట

### ఇటు ఎసిబి దాడులు - అటు లైంగిక దాడులు
### వరుస సంఘటనలతో తలలు పట్టుకుంటున్న అధికారులు




ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్రంలో పోలీ సు శాఖ పరువు దిగజారుతుందన్నడంలో సందేహంలేదు. పోలీసులపై వరుసగా నమో దవుతున్న వివిధ కేసులో ఇందుకు నిదర్శనం. ఒకపక్క అవినీతి నిరోధక శాఖ అధికారులకు పోలీసులు పట్టుబడడం, మరోపక్క లైంగిక దాడుల్లో పోలీసులు చిక్కుకుంటుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఎంత నీతివంతులైనాకిందిస్థాయి సిబ్బందిపై దృష్టి సారింకపోవడమే ఇలాంటి ఉదంతాలకు తావిస్తుందనేవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎసిబి దాడులు...**

సిసిఎస్‌లో ఎసిపి ఉమామహేశ్వర్‌రావు ఏకంగా తన వద్దకు వచ్చే ఫిర్యాదులపై కోట్లాది రూపాయలు దండుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. బాధితులకు న్యాయం చే యాల్సిన సదరు అధికారి నిందితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని కేసులను నీరుగారుస్తున్న వైనం ఇటీవలే బయటపడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఎసిబి అధికారులుఅతనికార్యాలయంతో పాటు ఇంటిపై, బంధువులు, స్నేహితుల ఇళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించి కోట్లాది రూపాయల అక్రమ సంపాదన సీజ్ చేశారు. ప్ర స్తుతం ఇతగాడు చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. ఈ ఘటన మరచిపోక ముందే అదే హైదరాబాద్ సిసిఎస్‌లో ఆర్థిక నేరాల విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ సుధాకర్ఒకకేసులో బాధితుడి నుంచి రూ.3 లక్షల నగదును తీసుకుంటుండగా ఎసిబి అధికారులకురెడ్‌హ్యాండెడ్‌గాపట్టుబడి చంచల్‌గూడ జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు. కుషాయిగూడ ఇన్స్పెక్టర్ జి.వీరస్వామి, ఎస్ఐ షేక్ షఫీలు నిందితుడిపై నమోదైన హత్యాయత్నంకేసుమూసివేసేందుకు రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డా రు. రెండు రోజుల క్రితం సూరారం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశం ఒకకేసువిషయ ంలో లక్ష రూ పాయలు లం చంతీసుకుంటు ండగా ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు.

**రివాల్వార్‌చూపించి సిఐ,ఎస్ఐ లైంగిక ...**

లైంగిక దాడుల ఆరోపణల్లో రాష్ట్ర పోలీసు శాఖలో గత 6 నెలలుగా 8మంది అధికారుల పై తెలంగాణ వ్యాప్తంగా శాఖ పరమైన చర్యలుతీసుకున్నారు.అందులో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 2 అధికారులపై వేటు పడింది. ఇలా స్టేట్ వైడ్ చాలానే పిర్యాదులు వచ్చినా.. మీడియాకు లీకు కాకుండా ఉన్నవిచాలానే ఉన్నాయి. ఉన్నతాధికారులు మాత్రంవారికిమోమె జారీ చేయడం, సస్పెం డ్ చేయడం లాంటివి చేశారు. ఇక టాస్క్‌ఫోర్స్ సిఐ నాగేశ్వర్‌రావు ఏకంగా రివాల్వార్‌ను చూపించి వనస్థలిపురంలో మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇక కాళేశ్వరం ఎస్ఐ భవానీసేన్ గౌడ్ ఏకంగా నలుగురు మహిళా కానిస్టేబుళ్లపై రివాల్వార్‌తో బెదిరించి లైంగిక దాడులకు పాల్పడ్డాడు. ఎంతో మంది తన సొంత డిపార్మెంట్ లోని 3 కానిస్టేబుల్స్ లైంగిక దాడులకు పాల్పడ్డారని డిఎస్‌పి స్థాయి అధికారి విచారణలో తెలింది. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గతంలో రెబ్బన ఎస్సగా విధులు నిర్వహిస్తున్న సమయంలోను యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెన్షన్‌కి గురయ్యాడు. మంచిర్యాల తాండుర్, కోటపల్లి పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సమయంలో కూడా ఇలాంటి లైంగిక అరోపణలు ఎన్నో వచ్చాయనితెలుస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డి సర్వీస్ రిమూవల్ చేయాల్సిందిగా ఐజీ రంగనాథ్‌కి అదేశాలిచ్చారు.

## సమష్టిగా నల్లగొండ పట్టణ అభివృద్ధికి కృషి

### ఔటర్ రింగ్‌రోడ్డు మూడవ ఆప్షన్ ఉపసంహరించుకోవాలని కౌన్సిలర్ల నిరసన



ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులు ఆగిపోయాయని, ఇకనుంచి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంతో పూర్తి చేస్తామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో పాలక వర్గ సభ్యులంతా సమిష్టిగా నల్లగొండ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 270 కోట్లతో అమృత్ 2 పనులు ప్రారంభమయ్యాయని, త్రాగునీటి పైపులైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉద్యోగులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కోరారు. ఉద్యోగులందరూ బాధ్యతతో పని చేయాలని, పట్టణ అభివృద్ధి కోసం తమతో కలిసి పనిచేయని వారు స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చని హెచ్చరించారు.బిజెపి ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డు అలైన్మెంట్ మార్చి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం మూడవ ఆప్షన్ ఉపసంహరించుకోవాలని పలువురు కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు బొడ్డుపల్లి లక్ష్మి , పున్న గణేష్, మాతంగి సత్యనారాయణ, బోగరి ఆనంద్, జానయ్య, కరుణాకర్ రెడ్డి, పిల్లి రామరాజు, గుర్రం ధనలక్ష్మి, ఊట్కూరు వెంకట్ రెడ్డి, జేరిపోతుల అశ్విని,యామ కవితా రాణి, తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ రాష్ట్రంగా మారుస్తాం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుని అన్నపూర్ణ రాష్ట్రంగా మారుస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడానికి ఆమోదం తెలిపిన సందర్భంగా శనివారం పోచంపల్లి పట్టణంలో ప్రధాన కూడలి నేతాజీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ చిత్ర పటానికి ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల లోపే రైతన్నలకు ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలపడం ఒక పండగ వాతావరణం అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతటి భారమైన సరే రైతుల పక్షపాతిగా ప్రభుత్వం రూ.31వేల కోట్ల రుణ మాఫీ చేయడానికి సన్నద్ధమైందని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న సాగు నీటి కాలువలను పూర్తి చేసి రైతాంగానికి గోదావరి జలాలతో పంటలు నీరందించి సస్యశ్యామలం చేస్తామని మరోసారి పునరుద్ఘాటించారు. త్వరలోనే అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు శుభవార్త తెలుపడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు కళ్ళలో సంతోషాన్ని చూస్తున్నామని అది చాలా ఆనందంగా ఉందని సందర్భంగా సిఎంకు క్యాబినెట్‌కు శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలియజేశారు. డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి,సామ మధుసూదన్‌రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు,పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, కార్యదర్శి బండారు ప్రకాష్‌రెడ్డి,ఉపాధ్యక్షులు కాసుల అంజయ్య పక్కీరు నర్సిరెడ్డి,మల్లారెడ్డి,అర్జి పిఆర్ఎస్ కన్వీనర్ గునిగంటి రమేష్ గౌడ్,కౌన్సిలర్స్ భోగ భానుమతి,మోటే రజిత,పడాల సతీష్ చారి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముక్తాల రమేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు సమస్యలు పరిష్కరించండి




ప్రజాపక్షం/ మునుగోడు : మునుగోడులో ప్రజా సమస్యలను పరిష్కరించాలని మునుగోడు జెడ్‌పిటిసి సాంఘిక సంక్షేమ స్థాయి సం ఘం చైర్మన్ నారబోయిన స్వరూపరాణి రవి ముదిరాజ్ కోరారు. నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం చివరి జెడ్‌పి సమావేశం జరిగింది. నారబోయిన స్వరూపరాణి రవి ముదిరాజ్ మాట్లాడారు. ఎలక్ట్రికల్ లోఓల్టేజి సమస్య మునుగోడు మండలంలోని కొరటికల్, మునుగోడు, చోల్లేడు, ఊకోండి గ్రామాలలో అధికంగా ఉందన్నారు.మునుగోడు మండల కేంద్రంలో ప్రభుత్వ వాగు భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని, మండల కేంద్రంలో శిదిలావస్థలో వున్న ప్రభుత్వ ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని పూర్తిగా కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. అదేవిధంగా గురుకుల పాఠశాల పక్క భవన నిర్మాణం కొరకు సర్వే నెంబర్ 10లో గల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఊకోండి, కిష్టాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికినిధులుకేటాయించాలని సూచించారు.మునుగోడుమండల కేంద్రంలో రోడ్డుకు ఇరు వైపుల అసంపూర్తిగా ఉన్నడ్రైనేజీనిపునరుద్దరించాలని, నూతన గ్రామ పంచాయితీలకు పక్క భవనాలు నిర్మి ంచాలని కోరారు. సమస్యలను జిల్లా మంత్రి కోమటిరెడ్డివెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి మునుగోడు మండలంలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

## యువతకు సాధ్యం కానిది ఏదీలేదు



ప్రజాపక్షం/ఆలేరు: మత్తు పానీయాలకు శక్తులు పనిచేస్తున్నాయి వాటిని తిప్పుకొట్టాలంటే యువతకే సాధ్యం అవుతుందని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఏసీపి రమేష్ అన్నారు. శనివారం ఆలేరు నియోజకవర్గంలో వెంకటరమణ కళాశాలలో యువతకు మత్తు పానీయాల నిర్మూలన కార్యక్రమం పై అవగాహన సదస్సు కార్యక్రమంలో వారు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా యువత గంజాయికి అలవాటు కాకూడదు అన్నారు. అదేవిధంగా మత్తు పానీయాలు చాక్లెట్ల ద్వారా వస్తున్నాయి. వాటిని పసిగట్టి దగ్గర్లో ఉన్న పోలీసు శాఖకు అదేవిధంగా గ్రామంలో ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. యువత చెడు బాటలో నడవద్దని సూచించారు. యువత పాడై తల్లి దండ్రులకు ఇబ్బంది పెట్టకూడదని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అయ్యప్పను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ కొండల రావు, ఎస్ఐ వెంకట శ్రీను, టౌన్ అధ్యక్షుడు ఎజాస్, ఉట్కూరు సురేష్, ముదిగొండ శ్రీకాంత్, సాగర్ రెడ్డి, జహంగీర్, రమేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే పాఠశాలల నిర్వహణ



ప్రజాపక్షం-/ మిర్యాలగూడ: ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, శ్రీనివాస్‌చారి, అహ్మద్, ఓరుగంటి శ్యాం సుందర్, నర్సిరెడ్డి, మహమ్మద్‌ఖాన్, సాయిశ్రీనివాస్, వరప్రసాద్, జయరాజ్‌లు అన్నారు. శనివారం ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డికి, డీఎస్పీ రాజశేఖర్‌రాజుకు, ఎంఈవో బాలాజీనాయక్‌లకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. పట్టణంలో వేలాది మంది విద్యార్థులకు విద్యబోధన చేస్తూ ఉపాధ్యాయులకు ఉపాధి కల్పిస్తున్న తమపై పలు రాజకీయ పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రుల ఇష్టానుసారమే వారికి అనుకూలంగానే ఫీజులను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు సరిపడా రాకపోవడంతో సొంతంగా ముద్రించినవి కాకుండా మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటి రేటు ప్రకారమే విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చార్లెస్, శ్రీపతి శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకట్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పైవంతెనతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం

### ఎంఎల్ఏ వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య త్వరలో తీరనుందని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. స్థానిక మున్సిపాలిటి కేంద్రంలో శనివారం ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మిర్యాలగూడ ఎంఎల్ఏ బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పట్ట ణ ప్రజలు ఫ్లైఓవర్ లేక అనేక ట్రాఫిక్ సమస్యలతో పాటు, రోడ్డు ప్రమాదాల భారిన పడ్డారని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దశలో నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫ్లైఓవర్ పనులకు శంఖుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. పట్టణ ప్రజలు, వ్యాపారుల విన్నపం మేరకు మంత్రి వెంకట్‌రెడ్డి పట్టుదలతో ఫ్లైఓవర్ పనులకు మోక్షం కలిగించారని అందుకు ఆయన కృతజతలు తెలియజేశారు. చిట్యాల నుండి భువనగిరి వరకు నాలుగు వరుసల రహదారి కూడా త్వరలోనే సాంక్షన్ చేయింస్తానని మంత్రి తెలిపినట్లు ఆయన వీరేశం అన్నారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మం డల, పట్టణ శాఖ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మి నర్సింహ్మా, జడల చిన్నమల్లయ్య ఉన్నారు.

## సారూ.. ఇదేం తీరు.. అనైతిక చర్యలతో వృత్తికే కళంకం!





ప్రజాపక్షం/ ఖమ్మం : రోజు రోజుకు స్థాయి దిగజారి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెస్తున్నారు కొందరు ఉపాధ్యాయులు. వృత్తిపట్ల బాధ్యతగా లేకపోవడం సరైన పర్యవేక్షణ కొరవడడం అనైతిక చర్యలకు తావిస్తుంది. అతి కొద్ది మంది వ్యవహారం మొత్తం విద్యా వ్యవస్థకు చెడ్డపేరు తెస్తుంది. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ముల్కలపల్లి మండలం రాజీవ్ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరయ్య మద్యం సేవించి విధులకు హాజరయ్యాడు. మత్తులో నడవలేక పాఠశాల బయటే రోడ్డుపై పడిపోవడంతో గ్రామస్తులు అతన్ని రోడ్డు పై నుంచి ఓ చావిడిలోకి తీసుకెళ్లి పడుకోబెట్టారు. ఈ ఉపాధ్యాయుడు రోజు ఇదే రీతిలో వ్యవహరిస్తున్నాడని తల్లిదండ్రులు, విద్యార్థులు వాపోతున్నారు. ఇది ఒక వీరయ్యకే పరిమితం కాలేదు. గత కొంత కాలం నుంచి పరిశీలిస్తే విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదడం, వివాహేతర సంబంధాలు పాఠశాలల్లోనే ఉండి బోధనకు తిలోదకాలు ఇచ్చి సెల్‌ఫోన్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేయడం, చిట్టీలు రకరకాల ఆర్థిక పరమైన వ్యవహారాలను నిర్వహిస్తూ ఐపిలు పెట్టడం ద్వారా ఉపాధ్యాయ వృత్తి గౌరవం మసకబారుతుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సరిగ్గా లేక రోజు రోజుకు ప్రభుత్వ విద్య కుచించుకుపోతుంది. ఒక మండలం మొత్తంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కంటే ఒక మామూలు ప్రైవేటు విద్యా సంస్థలో ఉండే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇదే ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థే కనుమరుగవుతుంది. ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల ప్రదర్శిస్తున్న వైఖరి ఈ తీరుకు కారణమవుతుంది. మండల విద్యాశాఖాధికారుల నియామకాలు లేకపోవడం జిల్లా విద్యా శాఖాధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా కార్యాలయాలకే పరిమితం కావడం ఉపాధ్యాయులతో ఉన్న ఆర్థిక సంబంధాలు చర్యలు తీసుకోవడానికి అడ్డుగా మారడం విద్యా వ్యవస్థ దిగజారడానికి కారణమవుతుంది. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులే మండల విద్యా శాఖాధికారులుగా కొనసాగుతున్నారు. వారు పాఠశాలలకే పరిమితం కావడంతో సమయ పాలన , బోధన పద్ధతులు, ఉపాధ్యాయుల వ్యవహార శైలిని పరిశీలించే అవకాశం ఉండడం లేదు. దీనితో కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి పాఠశాల వదిలి రిజిస్టర్ కార్యాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసే ఉపాధ్యాయులు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. పాఠశాలలో ఉన్న నిరంతరం ఫోన్లలో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులు పంచాయితీలు నిర్వహిస్తూ పాఠశాలకు ఎగనామం పెడుతున్నారు. ఓ ఉపాధ్యాయుడు పాఠశాలకు సెలవు పెట్టి విదేశాలకు వెళ్లినా మీడియాలో వార్త వచ్చేంత వరకు విద్యాశాఖ గమనించ లేదంటే ఎంత నిద్రావస్థలో ఉందో అవగతమవుతుంది. ఏమి చేసినా మీరు మీడియాలో రాకుండా చూసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. విద్యా వైద్యానికే తమ తొలి ప్రాధాన్యత అని చెబుతున్న పాలకులు విద్యా వ్యవస్థ దిగజారుడు తనాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడంలో మాత్రం వైఫల్యం చెందుతున్నారు. అధికారులు లేకుండా వ్యవస్థ సరిగ్గా పనిచేయదన్న సూత్రాన్ని తెలుసుకుని విద్యాశాఖలో పూర్తి స్థాయిలో నియమాకాలు చెపట్టాల్సిన అవసరం ఉన్నది. చర్యలు తీసుకోకుండా ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ విద్య కనుమరుగు కాక తప్పదు.

# వ్యవసాయ రంగానికి నీరు అందించాలి

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి: గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరితో కలిసి గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణంపై, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం 95 శాతం పూర్తయినందున గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చుటకు పంట పొలాలకు త్వరగా సాగు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు అవసరమైన అక్కన్నపేట మండలంలో 132 ఎకరాలు, హుస్నాబాద్ మండలంలో 235 ఎకరాలు, కోహెడ మండలంలో 304 ఎకరాల భూమి సర్వే పెగ్ మార్కింగ్‌ను జూలై 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జూలై11వ తేదీన మరో సారి సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు 95శాతం పూర్తయినందున మిగతా 5శాతం పూర్తి కాకపోతే వర్షకాలంలో డ్యాంకు ఇబ్బంది కలుగుతుందని మిగతా 5 శాతం పూర్తి చేసేందుకు అనుమతి కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను కోరాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ కింద 500కు పైగా చెరువులు ఉన్నాయని, ప్రాజెక్టు రైట్ కెనాల్ 47 కిలో మీటర్లు, లెఫ్ట్ మెయిన్ కెనాల్ 14 కిలో మీటర్ల ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలో చెరువులకు సాగు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన పనులను మూడు కేటగిరిగా గుర్తించి పనులను చేపట్టాలని పేర్కొన్నారు. మెయిన్ కెనాల్ లో నీరు వస్తే రైతులకు నమ్మకం పెరిగి కెనాల్ త్వరగా నిర్మాణం అయ్యేందుకు సహకరిస్తారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ఏరియా పర్యాటక రంగ అభివృద్ధికి చాలా అనువైన ప్రాంతమని, గౌరవెల్లి ప్రాజెక్టు ఏరియాలో ప్రభుత్వ భూములను గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. మత్స్య సంపదను అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశంను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ )శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ సీ కరీంనగర్ శంకర్, హుస్నాబాద్ ఆర్టీవో రామ్మూర్తి, సిద్దిపేట ఆర్టీవో సదానందం, ఇరిగేషన్ డివిజన్ ఈఈ , డీఈలు, తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.

## రైతన్న కన్నీరు తుడుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఎన్నికల సమయంలో ఏక కాలంలో రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని ఆ మాట నిలబెట్టుకోవడం కోసం క్యాబినెట్ తీర్మాణంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి రైతుల కన్నీరు తుడుస్తున్నారని డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2లక్షల రుణ మాఫీ ప్రకటించడం రాజకీయ నిర్ణయాలలో ఒక మైలురాయి అని తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని భవిష్యత్తులో సీఎం నెరవేరుస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టినటువంటి రైతులు, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని ఏ విధంగా అయితే ఇపుడు ఆశీర్వదించి ముందుకు నడిపించారో రానున్న కాలంలో కూడా ఇదే విధంగా ఆదరించాలని ఆయన కోరారు.

## ప్రజా ధనాన్ని కొల్లగొడితే ఉపేక్షించం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/ లక్ష్మి దేవిపల్లి : కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో స్క్రాప్ టెండర్ల అవినీతిని నిగ్గు తేల్చాలని ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కెటిపిఎస్‌ను సందర్శించిన ఆయన ఓఅండ్ ఎండిడి ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిఈ ఛాంబర్‌లో అధికారులతో భేటీ అయ్యారు. స్క్రాప్ టెండర్ ప్రక్రియ విచారణ కమిటీకి అందించిన నివేదికలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోట్ల రూపాయల విలువల గల ప్రజాధనం దుర్వినియోగం అయ్యాయన్న సమాచారం నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జరిగిన టెండర్ ప్రక్రియ పై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణకు తల మానికంగా ఉన్న కేటిపిఎస్‌లో అవినీతిని సహించేది లేదని అక్రమాలకు పాల్పడాలని చూస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఓఅండ్ ఎంసిఈ, ఎస్ఈలు, ఇతర కెటిపిఎస్ అధికారులతో పాటు తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ స్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, నాయకులు ముత్యాలవిశ్వనాథం, సాయిబాబా, పూర్ణచందర్‌రావు తదితరులు ఉన్నారు.

## గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేది లేదు : కొండా సురేఖ



ప్రజాపక్షం/గజ్వేల్ : రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించాలనే దురుద్దేశంతో గ్రూపులను ప్రోత్సహిస్తే సహించేది లేదని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, గంగుమళ్ల ఎలక్షన్ రెడ్డిలతో కలిసి పెద్ద ఎత్తున నియోజకవర్గ సీనియర్ నేతలు ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను వారు ఆమె దృష్టికి తెచ్చారు. పదవుల పందేరం పేరుతో కొంత మంది పనిగట్టుకుని పార్టీకి నష్టం కలిగేలా ప్రోత్సహిస్తూ పార్టీకి చేటు చేస్తున్నట్లు తెలిపారు. గాంధీభవన్ కేంద్రంగా ఉంటూ గజ్వేల్‌లో గ్రూపులను ప్రోత్సహించడం ఎంత మాత్రం తగదని, పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు పూర్తిగా తనకు తెలుసని, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి నర్సారెడ్డి పనితీరుపై తనకు పూర్తి నమ్మకం ఉందని, మూడు దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేసినట్లు గుర్తు చేశారు. గత పదేళ్లుగా నర్సారెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయగా, పార్టీ పిలుపుమేరకు ఎన్నో రాష్ట్రస్థాయి కార్యక్రమాలను విజయవంతం చేసినట్లు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో గజ్వేల్ నుండి చక్కటి ఫలితాలు రాగా, పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు నియోజకవర్గ ఇంచార్జి సూచించిన వారికే నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నట్లు వివరించారు.

## మంత్రులు కొండా సురేఖ, తుమ్మలను కలిసిన రాపోలు



ప్రజాపక్షం/రఘునాథపల్లి: తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను శనివారం హైధరాబాద్‌లోని సచివాలయంలోని ఆమె కార్యాలయంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాపోలు రామ్మూర్తి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అదేవిధంగా వ్యవసాయ, చేనేత, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఓఎస్డీని కలిసి కంచనపల్లిలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థలో జరిగిన అవినీతిపై ఆయనకు వివరించారు. వెంటనే దీనిపై స్పందించి అవినీతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతేగాకుండా రైతులకు మేలు చేసే వ్యవసాయ సహకార సంస్థను కాపాడాలని కోరడం జరిగింది. అంతేగాకుండా పలు చేనేత సహకార కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లడం జరిగింది. మంత్రులను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదం గట్టయ్య, పరమేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఒసిని అందజేసిన ఎమ్మెల్యే కడియం



ప్రజాపక్షం/రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన కొయ్యడ రచన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో వెంటనే ఆయన స్పందించి వైద్యానికి తక్షణ సహాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2లక్షల50 వేల విలువ గల ఎల్‌వోసిని శనివారం హన్మకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులకు ఆయన అందించడం జరిగింది. వారి వెంట మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిసిపి

ప్రజాపక్షం/పాలకుర్తి: జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ శనివారం పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా జనగామ (వెస్ట్‌జోన్)కి కొత్తగా వచ్చిన డీసీపీ రాజమహేంద్రనాయక్ పోలీస్ స్టేషన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో పర్యటించి ట్రాఫిక్ నిబంధనలు గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, పాలకుర్తి ఎస్ఐ ప్రసన్న కుమార్, ఎస్ఐ లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయండి

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండా నిర్మాణం జరుగుతున్న భవనంలో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న శ్రీచైతన్యపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి యాదవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని షిఫ్టింగ్ పర్మిషన్ లేకుండానే పాఠశాలలను వేరే భవనాలకు బదిలీ చేస్తూ నూతనంగా జరుగుతున్న భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నారని, నాలుగు అంతస్తుల భవనంలో కింది రెండు అంతస్తులలో తరగతులు, హాస్టల్ నిర్వహిస్తున్నారని, పై రెండు అంతస్తులలో నిర్మాణం జరుగుతుందని, అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి విద్యార్థులకు నష్టం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. వేల సంఖ్యలో అడ్మిషన్లు తీసుకొని కనీస సదుపాయాలు కల్పించడం లేదని, ఇరుకు గదులలో విద్యా బోధన చేస్తున్నారని, విద్యార్థులు ఆడుకోవడానికి కనీసం ఆట స్థలం కూడా లేకుండా వ్యవహరిస్తున్నారని వెంటనే విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. రెండు,మూడు రోజుల్లో శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు చల్ల సమ్మయ్య,బాణోత్ నవీన్,సిద్దుల సుమన్‌లు పాల్గొన్నారు.



## చేగుంట తహసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : జిల్లాలో పనిచేస్తున్న రెవిన్యూ అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా చేగుంట, చిన్న శంకరంపేట తహసిల్దార్ కార్యాలయాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేగుంట తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్, డిటి విధులకు హాజరు కాలేదని సిబ్బంది ద్వారా తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేస్తూ సమయపాలన, విధుల పట్ల క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. చిన్న శంకరంపేట తహసిల్దార్ కార్యాలయం పరిశీలించగా అధికారులు సిబ్బంది అందరూ విధులు క్రమశిక్షణగా నిర్వహించడంతో వారిని అభినందించారు. తహసిల్దార్ కార్యాలయం ద్వారా ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు.

# నాణ్యత లోపంతో నేషనల్ హైవే



ప్రజాపక్షం/వాజేడు : తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ నేషనల్ హైవే 163వ జాతీయ రహదారి నాణ్యత లోపంతో చేపట్టారు. ప్రజలకు పది కాలాల పాటు ఉపయోపడాల్సిన జాతీయ రహదారి కనీసం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా హైవే నిర్మాణ పనులు చేపట్టి ఆదరాబాదరగా పూర్తి చేశారు. వాజేడు మండలం పెద్ద గొల్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారి డబుల్ రోడ్డు నుండి ఫోర్ వేకు మంజూరవ్వడంతో కిలోమీటర్ మేరా నిర్మాణ పనులు పూర్తి చేశారు. అధికారుల అండ దండలతో కాంట్రాక్టర్ నాసిరకంగా పూర్తి చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులకు క్యూరింగ్ చేయకుండానే తారు రోడ్డు నిర్మించడంతో ఎక్కడికక్కడ బీటలుగా మారి దర్శనమిస్తున్నాయి. ఛత్తీస్‌గడ్, తెలంగాణ రహదారిపై భారీ వాహనాలు వెళుతుండడంతో నిర్మాణం చేపట్టిన రెండు నెలలకే పగుళ్లు తేలి విడిపోతుండడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారని వాపోతున్నారు. ఈ రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ క్యూరింగ్ చేయకపోవడంతో నాణ్యత లోపంతో నిర్మించారని నిర్మించిన నాలుగు రోజులకే పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. తారు రోడ్డు మధ్యలో రోడ్డు పెచ్చులు లేవడంతో వాహనదారులు రోడ్డు నుండి వెళ్ళాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అలాగే నిర్మాణం చేపట్టి రెండు నెలలు గడుస్తున్న కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయంలో భారీ వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయలతో మంజూరైన రహదారిని అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు కొనసాగించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం జరిగేటప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తైన చూడకపోవడం వలన అధికారులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇంటింటి సర్వే 97 శాతం పూర్తి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ లపై ఇంటింటి సర్వేలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని, మెదక్ జిల్లాలో 97 శాతం మిషన్ భగీరథ సర్వే పూర్తి అయ్యిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి మెదక్ జిల్లా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల పై ఇంటింటా సర్వే నిర్వహణ తీరును సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వే మండలాల వారిగా ప్రణాళిక బద్ధంగా ఈ సర్వే అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు ప్రతి ఇంటికి అందాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాలు కలవని. తాగు సరఫరా లేని ఆవాసాలు, ప్రాంతాలు, ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వేను ప్రారంభించిందని దీన్ని క్షేత్రస్థాయిలో నిర్దేశిత గడువు తేదీలోగా పూర్తిచేసే దిశగా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సంబంధిత ఎంపీడీవోలు, ఎంపిఓలు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/హసన్‌పర్తి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు, అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల అసోసియేషన్ బాధ్యుడు ఎర్ర కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. ఐసీడీఎస్, సీడీపీఓ 1975 సంవత్సరం నుంచి 40 ఏళ్లుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ సమయంలో టీచర్లకు రూ. ఒక లక్ష, హెల్పర్లకు రూ. 50 వేలు ఇస్తామని జీవో విడుదల చేసిందని, దీనివల్ల చాలా నష్టం జరుగుతుందన్నారు. పాలక ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లకు రూ. 26 వేలు, హెల్పర్లకు రూ. 18 వేలు వేతనం ఇవ్వాలని, అలాగే రిటైర్డ్ సమయంలో టీచర్లకు రూ. 10 లక్షలు, హెల్పర్లకు రూ. 8 లక్షలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దె బిల్లులు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సంసిద్ధంగా ఉన్నారన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సంబందిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐసిసి సముదాయము జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో మాదక ద్రవ్యాల డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై పోలీస్ శాఖ అబ్కారీ శాఖతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేటి యువత రేపటి భావి భారత పౌరులని వీరిలో కొంత మంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని దీనిని గుర్తించి డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్‌తో పాటు, గుట్కా ,గంజాయి, మాదక ద్రవ్యాల, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా చేయాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకం ఉన్న పిల్లలను బాదితులుగా పరిగణించి చివారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, దీని కోసం జిల్లాలో అందుబాటులో ఉన్న సైకాలాజిస్ట్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలలో అవసరమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలను పోలీస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చే యాలని మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం జువైనల్ యాక్ట్ గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా ప్రోహిబిషన్ & ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, మహిళా శిశు, సంక్షేమాదికారిణి వసంత కుమారి జిల్లా విద్యాదికారి వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్స్, కలెక్టర్ సి సెక్షన్ పర్యవేక్షకులు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం



ప్రజాపక్షం/కొహెడ: కొహెడ మండలం సముద్రాల గ్రామంలోని వేముల చంద్రమౌళి, వేముల మల్లేశం, బుక్క చంద్రం, మౌతమ్ నాగరాజు, పోలోజు సంపత్‌ల ఐదుగురి దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 149.760 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొహెడ ఎస్ఐ తిరుపతి తెలిపారు.ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో అక్రమ వ్యాపారాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, బెల్ట్ షాపులు నడిపిన, పేకాట, గుట్కాలు వంటి చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని సూచించారు.సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# గ్రామాలలో సమస్యలపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ టిఎస్ దివాకర్



ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి : గ్రామాలలో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టాలని గ్రామాలలో స్థానికంగా ఉండే సమస్యలు వనరులు జీవనోపాధిలపై నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన చాంబర్ నుండి జిల్లా అధికారులతో మీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 9 మండలాల్లోని ప్రతి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై వనరులపై జీవన ఉపాధిపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి, గ్రామస్థాయి అన్ని శాఖల అధికారులతో ప్రత్యక్ష సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ సమావేశాల ద్వారా స్థానిక గ్రామాలలో ఉన్న ప్రధాన సమస్యలు, గ్రామీణ ప్రాంత వనరులు, వారి జీవనోపాధి, గ్రామస్తుల ప్రధాన అవసరాలు, విద్య, ఆరోగ్యం పౌష్టికాహారం, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, హార్టికల్చర్, పశుపోషణ, మత్స్యసంపద వంటి అన్ని రంగాల వివరాలు నివేదికలో పొందుపరిచి తమకు సమర్పించాలని సూచించారు. సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాలలోని ప్రజలకు సులువైన పద్ధతిలో జిల్లా యంత్రాంగం ఏ విధంగా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది. స్థానిక యువతకు ఎలాంటి నైపుణ్యాలు నేర్పించాల్సి ఉంటుంది. మహిళలకు ఎలాంటి కుటీర పరిశ్రమలు నెలకొల్పాలసి ఉంటుందనే తదితర అంశాలు ఈ నివేదిక ద్వారా తెలుసుకునే అవశ్యకత ఉంటుందని తెలిపారు. ఈ గూగుల్ మిట్(వీడియో కాన్ఫరెన్స్)లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్ఓ అప్పయ్య, డిడబ్ల్యూఓ స్వర్ణలత లెనిన, డిఈఓ పాణిని, డిసిఓ సర్దార్‌సింగ్, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డిఏఓ విజయచంద్ర, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, తహసీల్దారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

### సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలి

గిరిజన విశ్వ విద్యాలయ స్థలం చుట్టు సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాయం ఎదురు గిరిజన విశ్వ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ కోసం మొత్తం 337 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు బదలాయింపు చేయడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా తాత్కాలిక తరగతుల నిర్వహణ ములుగు మండలంలోని ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ తరగతులు ప్రారంభం ఔతున్నాయని తెలిపారు. 337 ఎకరాల స్థలాన్ని ఎవరు ఆక్రమించకుండా చుట్టు సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థలాన్ని ఎవరు ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ కె సత్యపాల్‌రెడ్డి, తహసీల్దారు విజయభాస్కర్, ఆర్ఐ విజేందర్, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్‌ముందు రైతుల ధర్నా



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గత కొన్ని రోజులుగా మండల విద్యుత్ శాఖలో పని చేస్తున్న కొందరు అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం రైతుల పాలిట పెను శాపంగా మారింది. మండల కేంద్రంలో పని చేస్తున్న లైన్ మెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుల, ప్రజా ప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ తన శాడిజాన్ని చూపిస్తున్నాడు. మండల కేంద్రంలో గత 15 రోజుల క్రితం గాంధీనగర్ కాలనీ వైపు విద్యుత్ వైర్లు పోల్ నుండి కట్ చేసి వదిలేయడంతో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పై ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్థంభం పక్కకు వంగి విద్యుత్ సరఫరా కావడంతో పక్కనే ఉన్న బర్ల మందలో విద్యుత్ శాఖకు గుర్రై వేములవాడ చంద్రయ్య, రొద్ద నర్సయ్య అనే రైతులకు చెందిన రెండు గేదేలు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని కారణమైన విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నష్టపరిహారం అందించాలని, సంఘటన స్థలానికి వచ్చిన విద్యుత్ శాఖ ఏఈ, అధికారులను రైతులు నిలదీశారు. ఎంతసేపటికి అధికారులు సమాధానం చెప్పకపోవడంతో మృతి చెందిన గేదేలతో సబ్ స్టేషన్ ముందు రైతులు అరగంటకు పైగా దర్నాకు దిగారు. దీంతో ఏఈ వినీత్, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నష్టపరిహారం అందించేలా చూస్తామని ప్రధాన కారణమైన బాద్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. మల్లాపూర్ సెక్షన్ పరిధిలో పని చేస్తున్న ఒకరిద్దరు కరెంట్ అధికారుల పనితీరుతో విసుగు చెందుతున్నామని ఫోన్ చేసిన లిఫ్ట్ చేయరూ.. సమాధానం చెప్పరంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రైతుల పంట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న లైన్ మెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎస్సై కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్నా చేస్తున్న రైతులతో మాట్లాడారు. దర్నాలో పాల్గొన్న వారిలో మాజీ ఎంపిటిసి గంగరాజం, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజన్న, ఎంపిటిసి రాజేష్, నాయకులు శరత్ లింగస్వామి, రైతులు ముత్యాల శంకర్, మహేష్, నర్సయ్య, చంద్రయ్య, సురేందర్ కుమార్, కొండయ్య, ఆశన్న, వినోద్, మహిళా రైతులు ఉన్నారు.

## 'మల్లాపూర్'పై ఎసిబి నజర్

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యాలయాల్లో పని చేస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఏసిబి అధికారులు దాడులు చేపడుతుండడంతో అవినీతి అధికారుల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మల్లాపూర్ మండలానికి సరిహద్దు మండలమైన రాయికల్‌లో ఇసుక రవాణా చేసే వ్యక్తుల నుండి మధ్యవర్తుల సహాయంతో డబ్బులు డిమాండ్ చేసిన ఎస్సైపై ఏసిబి అధికారులు దాడులు చేయడంతో జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. అక్రమ వ్యాపారాలైన ఇసుక, బెల్ట్ షాపులు, కలప దందా ఇతరత్రా కార్యకలాపాలకు అడ్డాగా మల్లాపూర్ మండలం ఉండడంతో అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు పిర్యాదులు పెద్ద ఎత్తున ఉండడంతో మండలం వైపు కూడా ఏసిబి నజర్ పెట్టినట్లు వినికిడి. పల్లెల్లో ప్రధానంగా తలెత్తె భూ సమస్యలపై తిరిగి ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయిస్తుండడంతో అదునుగా భావించిన ప్రభుత్వ కార్యాలయాలలో పని చేస్తున్న కొందరు మద్యవర్తుల ద్వారా ప్రతి దానికి ఒక రేటును నిర్ణయిస్తూ చేతి వాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విసుగు చెందిన కొందరు ఏసిబి అధికారులను ఏ విధంగా ఆశ్రయించాలనే విషయాన్ని ప్రజా ప్రతినిధుల వద్ద చర్చిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పక్క మండలంలో ఒక్కసారిగా ఏసిబి దాడులు జరగడంతో మల్లాపూర్‌లో సైతం ఏసిబి ప్రకంపనలు కొందరిలో చెమటలు పుట్టిస్తున్నాయి. ఏమైనా ఏసిబి దాడులు మండలంలో జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయనే గుసగుసలు ప్రధాన కూడళ్లలో వినబడుతున్నాయి.

## విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడంతో పాటు పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ పాఠశాల ఉపాధ్యాయ బృందం, మంచిర్యాల వాసవి క్లబ్, ఇతర దాతల సహకారంతో సుమారు 50వేల విలువ గల 100 స్కూల్ కిట్లను అందించడం అభినందనీయమని అడ్లూరి అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ పక్షాన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మ ణ్, జె. సుముఖ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు గొల్లపల్లి గణేష్, బోగ శివప్రసాద్, పాలెపు చంద్రమౌళి, ముత్యాల దినేష్, ఆర్. శ్రీనివాస్, జి. శంకర్, ఎస్. సంజీవ్ పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్య పరిష్కరించండి



**ప్రజాపక్షం/బోథ్ :** పోడు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం బోథ్ మండలం కౌఠ(బి) గ్రామస్థులు... కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ను కలిసి సమస్యను తెలియజేశారు. వర్షాకాలం వచ్చిందంటే పోడు భూములు కలిగిన రైతులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. అయితే ఈ విషయంపై స్పందించిన ఆత్రం సుగుణ సోమవారం ఆదిలాబాద్ డిఎఫ్ఓ ను కలిసి మాట్లాడి ఈ సమస్యను ఎదుర్కొంటున్న రైతుల పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌఠ(బి) గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గాజుల సురేందర్, ముదిరాజుల సంఘం అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు సింగారపు రాష్ట్ర పాల్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి



**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 53 మందికి షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి రూ. 1,00,116/ చొప్పున రూ. 53,06,148 శనివారం లబ్ధిదారులకు బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ చేతుల మీదుగా అంగజేయడం జరిగిందని మండల తహసీల్దార్ సంతోష్ రెడ్డి, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదంతటి బిడ్డలకి ఒక వరమని తెలంగాణ రాష్ట్ర సాధకులు తొలి ముఖ్య మంత్రి కేసిఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటతి బిడ్డల కొరకు ఈ పథకాన్ని అందించి దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు.

# ప్రైవేటు అక్షరాభ్యాసాలు...

బాసరలో అమ్మవారి చెంత అపచారం..
మీడియాలో రాగానే దుమారం...
వేలాదిమంది భక్తులు హాజరు...
లక్షల్లో అమ్మవారి ఆదాయానికి గండి...
ప్రైవేట్ అక్షరాభ్యాసాలు జరిపిన వారికి
నోటీసులు ఇస్తున్నాం...
ఇఒ విజయ రామారావు....







**ప్రజాపక్షం/బాసర :** దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతి దేవి అమ్మవారు కొలువైన నిర్మల్ జిల్లా బాసరలో మరో అపచారం చోటుచేసుకుంది.దేశంలోనే వివిధ ప్రాంతాల నుండే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా భక్తులు తమ చిన్నారులకు సరస్వతి దేవి సన్నిధిలో ఘనంగా అక్షరాభ్యాసాలు నిర్వహిస్తుంటారు.చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో ఆలయ పండితులు అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు.అయితే నాలుగైదు రోజుల క్రితం ఇక్కడ అందకు విరుద్ధంగా ప్రైవేటుగా ఆలయ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో మహారాష్ట్రకు చెందిన వారు అక్షరాభ్యాసాలు చేయించుకొని దర్జాగా వెళ్లిపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఆలయానికి కూతవేటు దూరంలోనే ఈ తతంగమంతా కొనసాగింది. దాదాపు 70 వేల మందికి పైగా ఈ ప్రైవేటు అక్షరాభ్యాస కార్యక్రమాలకు హాజరయ్యారని పలువురు చెబుతున్నారు. అంతేగాకుండా ఆలయానికి చెందిన గదులు, లాడ్జీలు ఇతర సౌకర్యాలనీ వారు వాడుకోవడం కల కలం రేపింది. మహారాష్ట్రలోని నాసిక్కు చెందిన ప్రధాన అర్చకుడు ఒకరు ఈ తతంగాన్ని కొనసాగించినా స్థానిక ఆలయ అధికారులు గానీ కమిటీ సభ్యులుగానీ పట్టించుకోకపోవడం వివాదాస్పదంగా మారుతోంది. ఇదిలావుండగా, ఆలయానికి బదులుగా ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన అక్షరాభ్యాసాలై బాసర మీడియా పలువార్త పత్రికలు, ఛానల్ లలో ప్రచురించినా ఆలయ అధికారుల కండ్లు తెరుచుకున్నాయి. వెంటనే హుటాహుటిన ఆలయ అర్చక సిబ్బంది ఇతర ఆలయ సిబ్బంది తో ఆలయ ఈవో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన వ్యక్తులకు అక్షరాభ్యాస నిర్వాహకులకు నోటీసులు పంపుతున్నట్లు బాసర సరస్వతి అమ్మవారి ఆలయ ఈఓ విజయ రామారావు తెలిపారు. ఇక ఈ విషయంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది...

## ఖమ్మం మార్కెట్ విస్తరణకు ప్రతిపాదనలు




రూ. 148.5 కోట్ల అంచనా
విస్తరణకు మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మార్కెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఖమ్మం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ 15 ఎకరాలలో నిర్మించబడింది. తొలి నాళ్లలో మార్కెట్‌కు వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు అంతగా లేకపోవడంతో మార్కెట్ లో ఇబ్బందులు తలెత్తలేదు. కాలక్రమేణ పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటల సాగు పెరగడం ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణలోని వరంగల్, నల్గొండ జిల్లాల రైతులు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తమ తమ ఉత్పత్తులను తీసుకు వచ్చి విక్రయిస్తుండడంతో సరైన వసతులు లేక వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో రోజు లక్ష బస్తాలకు మించి మార్కెట్‌కు వస్తుండడంతో ప్రాంతమంతా బస్తాలతో నిండిపోయి చుట్టూ ఉన్న రోడ్లు కూడా ఆక్రమించి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం మార్కెట్‌ను పునర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు మార్కెట్ యార్డు అధికారులు రూ.148.5 కోట్ల అంచనాతో నివేదికను రూపొందించారు. తుమ్మల ఆ ప్రతిపాదనలకు కొన్ని సవరణలు చేసి ప్రభుత్వానికి పంపించారు.

## చనిపోయాడా..? చంపేశారా..?




మృతదేహం కలకలం

**ప్రజాపక్షం/ సిర్పూర్ టి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రం సమీపంలో టాటా ఎసి ట్రాలీ వెనకాల ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిర్పూర్ ఎస్ఐ ధీకొండ రమేష్ స్థానికులు తెలిపిన వివరాలు నమోదు చేసుకొని ప్రమాదమా లేక మరేదైన కారణమా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతుని సహోదరుడు కొడపాక మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తన తమ్ముడైన వెంకటేష్ కార్పెంటర్‌గా పని చేస్తూ, కర్ర వ్యాపారం చేస్తుంటాడని తెలిపారు, వృత్తి రీత్యా ఈ నెల 20వ తేదీన మహారాష్ట్ర లోని నాగపూర్‌లో కర్రని కొనుగోలు చేసి ఎంహెచ్ 33 టి 3546 అనే టాటా ఎసి వాహనం లో తిరిగి వస్తున్న క్రమంలో సిర్పూర్ టి మండలంలో శనివారం ఉదయం గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ భార్గవి రైస్ మిల్ దగ్గర నిలిపి ఉన్న వాహనం వెనకాల తీవ్ర రక్తపు మడుగులో పడి ఉన్నాడని స్థానికులు, పోలీసులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వచ్చామని తెలిపారు. తన సోదరుడి శరీరంపై చిన్న చిన్న గాయాలు ఉన్నాయని, చిన్న గాయాలకే ఎలా చనిపోయాడో తెలియదని కన్నీరు మున్నీరయ్యారు. కొడిపాక వెంకటేష్ మృతి పై అనేక అనుమానాలు ఉన్నాయని, పోలీసులు విచారణ చేసి తన సోదరుడి మరణానికి కారణాలు తెలిపి, తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

## అక్రమాలను ప్రశ్నిస్తే ఉలుకు ఎందుకు..?

జిల్లా అధికారుల అనుమతి లేకుండా ఖానాపూర్‌లో
ఐసిడిఎస్ సిబ్బంది ర్యాలీ, ధర్నా...?
ప్రజాపక్షం కథనాలపై ఖానాపూర్ సిడిపిఓ అక్కసు...



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ప్రతినిధి :** అవినీతి అధికారి దోపిడిని, బట్టబయలు చేసి, ప్రశ్నిస్తే...? తీవ్ర అక్కసు వెలిబుచ్చి, ఏకంగా ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేసి, ప్రజాపక్షం వార్త పత్రిక కథనాలపై అక్కసు వెళ్ళగక్కుతూ, శనివారం ర్యాలీ, ధర్నా, నిర్వహించిన సంఘటన, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో జరిగింది. గత కొంత కాలంగా, ఖానాపూర్ ఐసిడిఎస్ అధికారులపై వస్తున్న, ఆరోపణలను ఉటంకిస్తూ, శనివారం ప్రజాపక్షం వార్త పత్రికలో ''ఐసిడిఎస్ శాఖలో అవినీతి తిమింగలం'' అన్న శీరికతో, పక్కా ఆధారాలతో కథనాలు రాస్తే, అందుకు కోపంతో రగిలిపోయిన ఐసిడిఎస్ అధికారిని, ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలోని, నాలుగు మండలాల అంగన్వాడి ఉపాధ్యాయులను, ఆయాలను, పిలిపించి, ఖానాపూర్ పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ మేరకు, వార్త కథనం అబద్ధమని, వారు దుయ్యబట్టారు, కాగా గత ఎండాకాలం 15 రోజులు అంగన్వాడి పాఠశాలలకు, అనధికార సెలవులు తీసుకున్న ఆధారాలు, దాంతో పాటు అంగన్వాడి, ఉపాధ్యాయుల వద్ద, ప్లెక్సీలు,పైస్లు అంటూ, ఒక్కొక్కరి వద్ద రూ.1000/- వసూలు చేసిన ఆధారాలు ఇంకా ఎన్నో అక్రమాల విషయంలో జిల్లా అధికారులకు ప్రాజెక్ట్ కమిషనర్‌లకు, అనేకమంది ఫిర్యాదులు చేసిన ఆధారాలతో, వార్తా కథనం ప్రచురించగా, మింగుడు పడని అధికారిని, ప్రతికపై అంతేకాకుండా ప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం ఖానాపూర్ తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కాగా కథనంలో అనేక మంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ప్రాజెక్టు సిబ్బందికి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా అమౌంట్ పంపించిన ఆధారాలు , మెసేజ్లు, రుజువులతో వార్త ప్రచురించడం గమనార్హం, ఇది ఇలా ఉండగా నాలుగు మండలాల సిబ్బందిని జిల్లా అధికారుల అనుమతి లేకుండా, ఖానాపూర్ పిలిపించి, ర్యాలీ నిర్వహించడం, అధికారిని యొక్క ధర్నానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. ఈ మేరకు ఈ వార్త కథనం జిల్లా స్థాయిలో చర్చకు తావిచ్చినట్లు అయింది. ఇకనైనా పై అధికారులు స్పందించి, తగు విచారణ చేపడితే సాక్షులు బయటకు వచ్చి చెప్పే అవకాశం ఉందని, పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో, విచారణ నిష్పక్షపాతంగా జరిగితే అధికారి అక్రమాలు బయటపడే అవకాశం ఉందని, పలువురు అంటున్నారు. ఇదివరకే ఈ అధికారిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

నా అనుమతి లేకుండా ఏ ర్యాలీ, ధర్నాపై చర్యలు..
డిడబ్ల్యూఒ అధికారి నాగమణి



జిల్లా అధికారి అనుమతి లేకుండా ర్యాలీ, ధర్నాను చేయరాదు. అనుమతి లేకుండా సిడిపివో చేసిన ర్యాలీ ధర్నాపై విచారణ తీసుకున్న తర్వాత చర్యలు చేపడతామని జిల్లా అధికారి నాగమణి అన్నారు. ఎవరి వద్ద నుండి డబ్బులు తీసుకొని, ప్లెక్సీలు చేయరాదు. ఏదైనావ్యక్తి గాతంగా అంగన్వాడి టీచర్లు తీసుకుంటారు అనుమతి. అంగన్వాడి సెంటర్లను బంద్ చేసిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటమన్నారు. పత్రికలో వచ్చిన కథనాలపై వాస్తవాస్తా పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాల కానీ జిల్లా అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేయడంపై విచారణ చేపడుతమున్ని అన్నారు.

## అప్పడు హరితం.. ఇప్పడు ఖతం

గ్రీన్ ట్రీ పేరుతో మొక్కలు నాటారు..
విస్తరణ పేరుతో తొలగిస్తున్నారు..
రూ. 5 లక్షల ప్రజా ధనం వృథా

**ప్రజాపక్షం/ఇచ్చోడ :** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు... వృక్షో రక్షత.. రక్షిత: అనే నినాదంతో గత ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటించింది.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం.. ముందుచూపు లేకుండా మొక్కలు నాటడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రూ.5 లక్షల ప్రజా ధనం వృథా అయిపోయినట్లయిందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రమైన ఇచ్చోడలో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో కూడిన రోడ్డు విస్తరణ పనుల మంజూరుకు అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే గోడం నగేశ్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ కలిసి కృషి చేశారు. ఇచ్చోడలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్, ప్రధాన రహదారి చిన్నగా ఉండ టం వలన తలెత్తున్న సమస్యల గురించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. టెండర్ల విషయంలో జాప్యం అయింది. ఎట్టకేలకు 2023 సెప్టెంబర్‌లో ప్రభుత్వం నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు సుమారు రెండున్నర కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. రూ. 13 కోట్లు వెచ్చించింది. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి.

సమన్వయ లోపంతోనే...

ఇచ్చోడలో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో రోడ్డు విస్తరణ పనులు మంజూ రు కానున్నదని అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్, ఆర్అండ్ బీ అధికారులు కలిసి, రోడ్డు బౌండరీలు గుర్తిస్తే ఆ తర్వాత మొక్కలు నాటితే బాగుండేది. గతంలో అధికారులు చేసిన తప్పిదాల వలన పెరిగి పెద్దవిగా అయిన చెట్లను కూడా రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2020లో రోడ్డుకు ఇరువైపుల 800 మొక్కలను అమెన్యూ ప్లాంటేషన్ కింద నాటారు. నాటిన మొక్కల సంరక్షణ కోసం రూ. 5 లక్షల వరకు ఖర్చు చేశారు. దీని వలన ప్రజా ఆదాయం దుర్వినియోగంతో పాటు అధికారుల, ప్రజా ప్రతినిధుల సమయం కూడా వృథా అయింది.

## 'సోషల్ వెల్ఫేర్'లో ఫుడ్‌పాయిజన్

అస్వస్థతకు గురైనా విద్యార్థులు
పట్టించుకోని వైనం
సమస్యలపై నిలదీసిన విద్యార్థి సంఘాలపై
సిబ్బంది దురుసు ప్రవర్తన



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సాక్షిగా చెడ్డపేరు మూటగట్టుకుంటుంది. ఫుడ్ విషయంలో చేస్తున్న నిర్లక్ష్యంతో విద్యార్థినిలు తరచు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. గతంలో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థినిలు ఆందోళన చేసినప్పటికీ పర్యవేక్షకులలో ఎటువంటి మార్పురాకపోవడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. తాజాగా శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడక్రాస్‌రోడ్‌లో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థినిలు ఫుడ్‌పాయిజన్ అయ్యి అస్వస్థతకు గురైన పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. దీంతో అక్కడి పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన విద్యార్థి సంఘాల నేతలపై సిబ్బంది దురుసు ప్రవర్తనను కనబరిచారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడారు...డిగ్రీ కళాశాలలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులను తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపిచి ఉపాధ్యాయులు చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం ఒక క్లాసు కూడా బోధించకపోవడం బాధాకరమన్నారు. ఇక్కడి సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా అధికారులు వైఫల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఆర్‌సీఓగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోపం వల్లనే ఇలా జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యార్థినులను మానసికంగా కృంగదీస్తూ విద్యార్థి సంఘాల ముందు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి గురుకులంలో జరుగుతున్న పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాలన్నింటిని కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, రాకేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినోద్, మనోజ్, పిడిఎస్ జిల్లా నాయకులు భాను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం, రెబ్బల్ దేవ్ పల్లి (చిన్నబొంకూర్) గ్రామానికి చెందిన అభినవ్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అభినవ్ ఆర్థిక పరిస్థితుల గురించి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుకు వివరించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విజయ రమణారావు అభినవ్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60,000/ మంజూరు చేసి ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే విజయరమణారావు అన్వేష్‌కు అందజేశారు.

## మెరిసిన ఆరుద్ర పురుగు...

**ప్రజాపక్షం/నేరడిగొండ :** గత రెండు రోజులగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు చల్లటి వాతావరణానికి ఆరుద్ర పురుగులు వస్తున్నాయి.ఇరుద్ర కార్తె ప్రారంభం సందర్భంగా రైతులు చేనులలో ఆరుద్ర పురుగుల రాకను వర్షాలు అధికంగా కురుస్తాయి అన్న సంకేతంగ భావిస్తూ ఉంటారు.మండలంలోని ఆయా గ్రామాలలో రైతుల చేసులలో ఆరుద్ర పురుగులు కనిపించడంతో వర్షాలు ఎక్కువ కురుస్తాయని కాలం కలిసి వచ్చినట్టే అని ఆనందపడ్డారు.

మహారాజ శ్రీ గౌరవ మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ SC/ST జిల్లా జడ్జీ వారి కోర్టు ఖమ్మం
M.A.T.O.P. No. 3/2024
బిట్వీన్..
1) జాలాది @ ములక స్టెల్లా
2) జాలాది వివియాన్ ఉదయపాల్
3) జాలాది వరుణ్ పీటర్
4) J. నంజన్ సలోమి ...క్లెయిమ్ పిటీషనర్స్
మరియు
1) సింఘాల్ వైభవ్ అగర్వాల్ మరియు ఇతరులు ...రెస్పాండెంట్
నోటీసు
R1: సింఘాల్ వైభవ్ అగర్వాల్, తండ్రి: సింఘాల్ జైప్రకాశ్ అగర్వాల్, వయసు: 33 సం.లు, వృత్తి : డ్రైవర్ ఆఫ్ ది కార్, బేరింగ్ నెం. AP07UA4873, నివాసం: ఫ్లాట్ నెం. 212, TNR మానస అపార్ట్‌మెంట్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా.
R2: సోను అగర్వాల్, తండ్రి: జైప్రకాశ్ అగర్వాల్, వృత్తి: ఓనర్ ఆఫ్ ది కార్, నెం. AP07UA4873, నివాసం: ఇం.నెం. 23/ 129/ 1, త్యాగరాయనగర్ కాలనీ, ఫ్రూట్స్ మార్కెట్ ఎదురుగా, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా.
పైన తెలిపిన క్లయిమ్ పిటీషనర్స్, రెస్పాండెంట్స్ నెం. 1&2 అయిన మీపై మోటార్ వాహన ప్రమాద నష్టపరిహారం కొరకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట దావా దాఖలు పరిచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు ది. 16/ 07/ 2024న వాయిదా ఉన్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది. 16/ 07/ 2024న ఉ.గం. 10:30 ని.లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
// కోర్టు వారి అనుమతిలో //
ఓరుగంటి శేషగిరిరావు,
న్యాయవాది,
ఓరుగంటి నగర్,
వరంగల్ 'X' రోడ్, ఖమ్మం
సెల్: 9849505610

# నాలుగేళ్లలోపు 'ఎస్ఎల్‌బిసి' పూర్తి

### త్వరలో సిఎం సందర్శన
### జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేద్దాం
### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : ఉమ్మడి నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను రానున్న మూడు నాలుగేళ్ల లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, త్వరలో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును సిఎం రేవంత్‌రెడ్డి సందర్శించి ప్రాజెక్టు పనుల పూర్తికి అవసరమైన చర్యలు తీసుకుంటా రని, రాజకీయాలకతీతంగా జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్ల డించారు. శనివారం నల్లగొండ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధ్య క్షతన జరిగింది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి మంత్రి కోమటిరెడ్డి సమావేశానికి హాజర య్యారు. సమావేశంలో జెడ్పీటిసిలు, ఎంపిపిలు, లేవనె త్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధి కారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోగా ఏకకాలంలో రూ.31వేల కోట్లతో 2 లక్షల వరకు రుణమాఫీ చేయబోతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రూ.2 లక్షల రుణమాఫీ చేయలే దని, గత ప్రభుత్వాలు చేసిన విడతల వారి రుణమాఫీ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో రోడ్లు, జాతీయ రహదారులు రూ.30 వేల కోట్లతో రాబోతున్న ట్రిబుల్ ఆర్ రోడ్డు సహా అన్ని రోడ్లు పూర్తి చేయిస్తామన్నారు. జిల్లాలో ఏ గ్రామంలో కూడా మిషన్ భగీరథ పథకం అందడం లేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారని, నాన్స్‌గ్రామం బ్రాహ్మణవెల్లెంలలో కూడా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయి లో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథకు సంబం ధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లింపులపై అధికా రులు స్పష్టత నివ్వాలన్నారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సాగునీటి ప్రాజె క్టుల మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు ఉన్నందున జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గొట్టిము క్కల, సింగరాజుపాలెం పెళ్లిపాకుల రిజర్వాయర్లు పిల్లా యిపల్లి, ధర్మారెడ్డి రిజర్వాయర్లు, కెనాల్లను పూర్తిచేయ డానికి చొరవ చూపాలని కోరారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ జిల్లాలో సరిపోయినన్ని ఎరువులు, విత్తనాలు ఉన్నాయని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రతిపాదనలు రూపొందించుకొని సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. మిర్యా లగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్ర భుత్వం రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్న దని, రైతు రుణమాఫీ, రైతు భరోసాతో సహా హామీలన్నీ టిని నెరవేర్చినందున కృతజ్ఞతలు తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ శాలిగౌరారం తదితర మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని, పంచా యతీరాజ్ రోడ్లు కంకర తేలి ఉన్నాయని, వాటిని బాగు చేయాలని, జాతీయరహదారి నుండి ఇరుకులపాడు రోడ్డు పనులను ప్రారంభించాలని, శాలిగౌరారం చెరువు కట్టను పటిష్టం చేసే పనులు చేపట్టాలని కోరారు. దేవర కొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు ప్రతి నియోజకవర్గానికి రెండు కోట్ల రూపాయలు ఇప్పించే విధంగా మంత్రి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదే జిల్లా పరి షత్ చివరి సర్వసభ్య సమావేశం కావడంతో జెడ్‌పిటి సిలు, ఎంపిపిలను ఘనంగా సన్మానించారు.

## మహిళలపై పెరుగుతున్న హింస
### నిందితులను కఠినంగా శిక్షించాలి
### చట్టాలను కఠినతరం చేయాలి
### మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ఇటీవల కాలంలో మహిళలపై, పసిపిల్లలపై విపరీతమైన హింస, అత్యాచారాలు పెరిగిపోయాయని, వీటి ని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి నేదునూరి జ్యోతి విమర్శించారు. మహిళా సమాఖ్య రాజన్న సిరిసిల్ల సమితి సమావేశం సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్మిక భవన్‌లో ఏ.రోజా అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశానికి నేదు నూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ వరుస సంఘటనలతో మహిళలు బెంబే లెత్తిపోతున్నారన్నారు. మహిళల నేరాలకు పాల్పడితే కఠినశిక్షలు లేకపో వడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వందల కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని, కేసులను ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు ద్వారా విచారిం చి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ లో చెంచు మహిళపై దాడి చేసిన నింధితులను కఠినంగా శిక్షించి, బాధితు రాలిని అన్నివిధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలను అరికట్టాలని, ఏరులై పారుతున్న మద్యాన్ని నిషేధిం చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహిళలకు రూ.2500పెన్షన్, కళ్యాణ్‌లక్ష్మి పథకం ద్వారా తులం బంగారం, అర్హులైన పేదలకు పక్కా ఇల్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని, సమస్యలు పరి ష్కారానికి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నా రు. కన్వీనర్‌గా ఎ.రోజా, కో కన్వీనర్‌లుగా జి.మంజుల, కే.లక్ష్మి సత్య, ప్రేమలతలను ఎన్నుకొన్నారు. సమావేశంలో మనెవ్వ పుష్పలత, రామవ్వ, లక్ష్మి, నరసమ్మ, యశోద పాల్గొన్నారు.

## 'నీట్'పై కేంద్రం స్పందించాలి
### విద్యార్థి సంఘాల డిమాండ్




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : దేశంలో నీట్ పరీక్ష గందర గోళంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, యన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు సి.రాజు లక్ష్మణ్, ప్రశాంత్, భరత్, అవేస్, రమేశ్, సీతారాం మాట్లాడుతూ గ్రేస్ మార్కులను పొందిన వారి మార్కులు మాత్రమే రద్దు చేసి, జూన్ 23న రీ ఎగ్జామ్ నిర్వహించి, జూన్ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని కోరుతూ నీట్ పరీక్ష లీకే జీపై కేంద్రం స్పందించకుండా, ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్లీ రీ ఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవకతవకలు పక్కదారి పట్టించడమే అని విమర్శించారు. దీని వల్ల నీట్ ర్యాంకులు తారుమారు అయ్యి గందరగోళం ఏర్పడుతుందని తెలి పారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయకుండా, ఎన్‌టిఎ ఏకపక్షంగా వ్యవరిస్తుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఆరోపణలు ఉన్నాయని, వాటిపై తక్షణమే విచారణ జరపాలని డిమాండు చేశారు. రీ ఎగ్జామ్ నిర్వహించి, ఎన్‌టిఎను రద్దు చేసి నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండు చేశారు. ఎన్‌టిఎ చైర్మన్, డైరెక్టర్లను తప్పించా లని, వారిపై సిబిఐ విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు భరత్, నందు, రమేశ్ పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధికి తోడ్పడాలి
### జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : భూగర్భ గనులలో పనిచేస్తున్న ఉద్యోగులు హాజరు శాతాన్ని పెంచి, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. శనివారం జిఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియాలోని ఎస్ఆర్‌పి 1, 3 గనులలో 2023వ సంవత్సరంలో 100 మస్టర్లు చేయని, 2024వ సంవత్సరంలో కనీసం 50 మస్టర్లు చేయని గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి ఉద్యోగి తమ హాజరు శాతాన్ని పెంచుతూ సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. సింగరేణి కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడా లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగులు ప్రతినెల 20 మస్టర్లు చేయాలని సూచించారు. కౌన్సిలింగ్‌కు 116 మంది గైర్హాజరు ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, సిఎంఒఎఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డిజిఎం పర్సనల్ పి.అరవిందరావు, డిజిఎం ఐఇ డి చిరంజీవులు, డివై సిఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు, డివైపిఎంలు రాజేష్, రాజు, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## 24న అంగన్‌వాడీల ధర్నా : పల్లా

ప్రజాపక్షం/దేవరకొండ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా జయప్రదం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చేర్చిన విధంగా అంగన్‌వాడీలకు తక్షణమే రూ.18వేల వేతనం చెల్లించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు పది లక్షలు, హెల్పర్లకు ఐదు లక్షలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రిటై ర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో ఈనెల 24న జరిగే ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దేవేందర్‌రెడ్డి శనివారం పిలుపునిచ్చారు.

## గాంధీభవన్‌లో సంబురాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకు గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకు లు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నా రు. గాంధీభవన్‌లో శనివారం బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం ఏకకాలంలో ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తానని ప్రకటించడంపై నేతలు హర్షం వ్యక్తం చేశారు.

**సిఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు : కోదండ రెడ్డి**

రైతు రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసు కున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎం.కోదండరెడ్డి కృతజ్ఞత లు తెలిపారు. గాంధీభవ న్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన వరంగల్ డిక్లరే షన్ హామీలో మొదటిది రుణమాఫీ అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం హర్షనీయమైన నిర్ణయం తీసు కుందని ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ కిసాన్ కాంగ్రెస్ సెల్ తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ హయాం నుండి కాంగ్రెస్ రైతులకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

**హరీశ్‌రావు రాజీనామా లేఖ సిద్ధం చేసుకోవాలి : అన్వేష్‌రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అభివర్ణించారు. తెలం గాణ కిసాన్ సెల్ రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ అనేది కేవలం కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. మాజీమంత్రి హరీశ్ రావు రాజీనామా చేయబోతుండన్నారు. స్పీకర్ పార్మేట్‌లో రాజీనామా సిద్ధం చేసుకోవాలని ఆయన హరీశ్ రావును ఉద్దేశించి అన్నారు.







## ప్రపంచాన్ని అధ్యయనం చేయించేది పత్రికలే

### సిపిఐ తెలంగాణ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
### వామపక్షాలు సోషల్ మీడియా వినియోగించాలి సిపిఐ ఎపి కార్యదర్శి రామకృష్ణ
### ఘనంగా విశాలాంధ్ర 72వ వార్షికోత్సవం

ప్రజాపక్షం/విజయవాడ : ప్రపంచ విజ్ఞానాన్ని అధ్యయనం చేయించేది పత్రికలేనని వక్తలు అన్నారు. విశాలాంధ్ర జాతీయ దినపత్రిక 72వ వార్షి కోత్సవం విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి అన్యాయం జరిగినా, నిరంకుశత్వాన్ని ప్రశ్నించటానికి పుట్టిన వామపక్ష పత్రిక విశాలాంధ్ర అన్నారు. తాను ఇక్కడ ఓనమాలు దిద్ది జీవన ప్రస్థానాన్ని ప్రారంభించానని గర్వంగా చెప్పారు. దళితులు, మహిళలు, కార్మికులకు అండగా ఈపత్రిక నిలుస్తోందన్నారు. కొత్తపంథాలో పత్రికను నడిపించ టానికి కృషిచేయాలని సూచించారు. పరిశోధనాత్మక జర్నలిజంపై దృష్టి పెట్టాలన్నారు. విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు చైర్మన్, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులు వేసిన పునాదుల కారణంగా విశాలాంధ్ర ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిల బడిందన్నారు. పత్రికను అణచివేయాలని జగన్‌లాంటి నియంత ఎంత ప్రయత్నించినా వెనక్కు తగ్గలేదన్నారు. దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత విశాలాంధ్రపై ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సమ గ్రాభివృద్ధి, సాంస్కృతిక పునరుజ్జీవనం, సాంస్కృతిక వికాసం, తెలుగు భాషాభివృద్ధికి విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందన్నారు. 72వ వార్షికోత్సవం సందర్భంగా పత్రిక నిర్దేశించుకున్న కర్తవ్యాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ముందు తరాలు కూడా విశాలాంధ్ర పత్రికను దిగ్విజయంగా నడిపిస్తాయనే నమ్మకం తన కుందన్నారు. విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేసు మాట్లాడుతూ ఢిల్లీలో వడదెబ్బకు ప్రజలు చని పోతుంటే కశ్మీర్‌లో ప్రధాని యోగా చేయటం వల్ల దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వస్తున్న వార్తలను ఎలా అర్థం చేసుకోవాలని సందేహం వ్యక్తంచేశారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాద కులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ జర్నలిస్టులను తయారు చేసిన కర్మాగారం విశాలాంధ్ర అన్నారు. అంతర్జాతీయ వార్తలు, మహిళల కోసం ప్రత్యేక పేజీని ముందుగా ఏర్పాటు చేసింది విశాలాంధ్ర అని గుర్తుచేశారు. మద్దుకూరి చంద్రశేఖర రావు, ఏటుకూరి ప్రసాదరావు, సి.రాఘవాచారి, మోటుకూరి హనుమంతరావు తదితరులు చేసిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావును విశాలాంధ్ర విజ్ఞాన సమితి యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## సింగరేణి పరిరక్షణకు ఆందోళనలు
### వేలంపాటను ఉపసంహరించుకోవాలి : సిపిఐ



ప్రజాపక్షం/ఖమ్మం : సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం తక్షణం ఉప సంహరించుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బొగ్గు వేలం పాటలను అడ్డుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రోజురోజుకు కుచించు కుపోతున్నదని ఈ నేపథ్యంలో సింగరేణి పరిధి లోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తే మనుగడే ప్రమాదంలో పడుతుందన్నారు. కేంద్రం ప్రైవేటు వ్యక్తులకు జాతి సంపదను కట్టబెడుతుదని ప్రసాద్ ఆరోపించారు. గతం లో లక్షకు పైబడిన కార్మికులు కోట్లాది రూపాయల టర్నోవర్‌తో సిరుల తల్లిగా పేరొందిన సింగరేణి ఇప్పుడు బొగ్గు నిక్షేపాలు కరువై యాంత్రీక రణ పెరిగి కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి విషయంలో అటు బిజెపికి మద్ద తునిస్తూ ఇటు వేలం పాటలకు పోకుండా అడ్డుకుని భవితవ్యాన్ని దెబ్బతీ సిందని ఆయన తెలిపారు. ఇప్పటికే కోయగూడెం ఉపరితల గనిని అర బిందో కంపెనీకి అప్పగించిందని సత్తుపల్లి ఓసిని మరో ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన బిజెపి ఇప్పుడు మరో మూడు బొగ్గు బ్లాకులను వేలం వేయ డాన్ని సిపిఐ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. సింగరేణి పరిరక్షణకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఐ పిలుపు నిస్తుందన్నారు.సిపిఐ నేతృ త్వంలో వేలం పాటలను ప్రైవేటు సంస్థలు బొగ్గు తీయడాన్ని అడ్డుకుంటా మని ప్రసాద్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
### ప్రభుత్వ విప్ అడ్లూరి

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశా న్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని, అందుకు ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి అసౌకార్యలకు లోను కాకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉచిత పుస్తకాలతో పాటు రెండు జతల యూనిఫాం,మధ్యాహ్న భోజనం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేటుకు దీటుగా విద్యాభోధన కొనసాగుతుందని అన్నారు. ముఖ్యంగాఆ ప్రభుత్వ పాఠశాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పునరావాస బాధితులకు అండగా ఉంటాం : కలెక్టర్



ప్రజాపక్షం/కడెం : కొత్త మద్దిపడగ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం కడెం మండలం లోని కొత్త మద్దిపడగ గ్రామంలో కలెక్టర్ పర్యటి : కంచారు. గతంలో కడెం మండలంలోని మైసంపేట్,రాంపూర్ గ్రామాలను పునరావాసం కింద తరలిం చగా ప్రజలకు కల్పించినటువంటి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకోవచ్చారు. నష్టపరి హారం కింద ప్రజలకు అందించిన సాగు భూమిని సాగుకు యోగ్యంగా చదు నుగా మార్చాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హరితహారం కార్యక్ర మంలో భాగంగా గ్రామంలో రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటాలని సూచిం చారు. ఖాళీ చేసిన గ్రామాలలోనీ పాఠశాలలను ఇక్కడికి తరలించాలని అధి కారులను ఇక్కడికి తరలించాలని అధికారులను ఆదేశించారు. మహిళల జీవ నోపాధికై అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అటవీ శాఖ అధికారి ప్రసాద్, ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ సుజాత, ఎంపిడిఓ అరుణ పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంతో చెలగాటం
**(మొదటి పేజీ తరువాయి)**

విలువ చేసే మందులను స్వాధీనం చేసుకున్నది. మధ్య ప్రదేశ్, విజయవాడ, హిమాచల్‌ప్రదేశ్, బెంగుళూరు, ఉత్తరఖండ్, పంజాబ్,గుజరాత్ తదితర ప్రాంతాలలో మందులను ఉత్పత్తి చేసి, వాటిని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మోసపూరిత ప్రకటనలతో విక్రయిస్తున్నారు. ఇటువంటి మందులపైన నిఘా పెట్టిన డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ వి.బి.కమలాసన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా కొంతకాలంగా దాడులు జరుగుతున్నాయి. ఈనెల 1 నుంచి 21వ వరకు ప్రశాంతినగర్, మిర్యాల గూడ, పెద్దపల్లి, కూకట్‌పల్లి, మంచిర్యాల, జీడిమెట్ల, నిజామాబాద్ అర్బన్, ఉప్పల్, పటాన్‌చెరు, నిజామా బాద్‌రూరల్, గండిపేట, షాబాద్, రాజేంద్రనగర్‌లోని పలుప్రాంతాల్లో దాడులు చేశారు. ముఖ్యంగా మూత్ర పిండాల్లో రాళ్లు, మధుమేహం, జ్వరం లాంటి పలు ఆరోగ్య సమస్యలపై పలు కంపెనీలు మోసపూరిత ప్రకట నలు గుప్పించారు. వీటిని పరిశీలించిన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఆయా ఉత్పత్తి చేస్తున్న సంస్థలు, మందుల ను విక్రయిస్తున్న డీలర్లు, షాపులపైన దాడులు చేశారు. కేంద్రంలోని నేషనల్ ఫార్మక్యూటికల్ ప్రైసింగ్ అథా రిటీ(ఎన్‌పిపిఎ) నిర్ధేశించిన ధరలకు భిన్నంగా హనుమ కొండ, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ ప్రాంతాల్లో అధిక ధరలకు మందులను విక్రయిస్తున్న సంస్థలపైన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. రూ. 101.45లకు విక్రయించాల్సిన ముజోక్ 2 ఆయింట్ మెంట్‌ను రూ.130ల లెబుల్‌వేసి విక్రయిస్తున్నట్టు అధి కారులు గుర్తించారు. రూ.71.7లకు విక్రయించాల్సిన సెఫిక్స్‌మి ఫర్ ఒరాల్ సస్పెన్షన్ ఐపి మందును రూ. 145 ఎంఆర్‌పి లెబుల్‌ను పెట్టి అధిక ధరలకు విక్రయిస్తు న్నారు. దీంతో అధికారులు ముగ్గురు విక్రయాదారుల పైన కేసులు నమోదు చేశారు. అలాగే ఎటువంటి లైసెన్స్ పొందకుండానే మహబూబ్‌నగర్‌లోని మెడికల్ షాపును అధికారులు సీజ్ చేశారు. రూ.1.5లక్షల విలువ చేసే 65 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు.

**లైసెన్స్ ఉన్న షాపుల నుంచే మందులు కొనండి : కమలాసన్ రెడ్డి...** లైసెన్సులు పొందని మెడికల్ షాపుల నుంచి మందులను కొనుగోలు చేయవద్దని, నకిలీ ఉత్ప త్తులు ఉండే అవకాశాలు ఉంటాయని డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి తెలిపారు. ఫిర్యా దులు ఉంటే 18005996959 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫార్మసీ, మెడికల్ షాపులకు లైసెన్సు ఉన్నాయా? లేదా తెలుసుకునేందుకు <https://odls.telangana.gov.in/ThirdPartypublicview.aspx>. వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

## ఒప్పందం దిశగా...
**(మొదటి పేజీ తరువాయి)**

రంగాల్లో సహకారం మరింత విస్తరించే దిశగా భారత్– బంగ్లాదేశ్ ఒప్పందాలు చేసుకున్నాయి. హరిత భాగస్వా మంపైనా ఒప్పందాలు చేసుకున్నాయి. 'గత పదేళ్లలో మేం 1965కు ముందున్న సంబంధాలను పునరుద్ధ రించాం. ఇప్పుడు డిజిటల్, ఇంధన రంగాల్లో సంబంధా లకు ప్రాధాన్యం ఇస్తాం. దీనివల్ల రెండు దేశాల ఆర్థికవ్య వస్థలు వేగం పుంజుకుంటాయి. ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు జరపా లని ఓ అంగీకారానికి వచ్చాం. బంగ్లాదేశ్‌లోని సిరాజ్ గంజ్‌లో కంటెయినర్ డిపో నిర్మాణానికి భారత్ మద్దతు అందిస్తుంది. 54 నదులు ఇరుదేశాలను కలుపుతాయి. వరద నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టులపై సహకరించుకుంటూ వచ్చాం. మేం 1996 గంగానది ఒప్పందం కోసం సాంకేతిక అంశాలపై చర్చలు ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నాం. బంగ్లాదేశ్‌లోని తీస్తానది సంరక్షణ, నిర్వహణ కోసం వెంటనే సాంకేతిక బృందం బంగ్లాదేశ్‌కు వెళ్తుంది' అని ప్రధాని మోదీ అన్నారు. 2019 నుంచి భారత్ బంగ్లా ప్రధానులు ఇప్పటికే పదిసార్లు కలుసుకున్నారని, ఈ చర్చలు ద్వైపాక్షిక సంబంధాల్లో అపూర్వమైన మార్పు లకు దారి చూపాయని రణధీర్ జైస్వాల్ పోస్ట్ చేశారు. వాణిజ్యం, కనెక్టివిటీ, ఇంధన రంగాలతో సహా ద్వైపా క్షిక సంబంధాల బలోపేతంపై మోదీ–హసీనా కీలక చర్చలు జరిపారని రణధీర్ వివరించారు. షేక్ హసీనా, ప్రధాని మోదీ చర్చలు భారత్–బంగ్లా సంబంధాలకు కొత్త ఊపు తెస్తాయని తెలిపారు. తన పర్యటన రెండు దేశాల మధ్య సన్నిహిత, స్థిరమైన సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని హసీనా అన్నారు.

### బంగ్లా ప్రధానికి ఘనస్వాగతం

భారత పర్యటనకు వచ్చిన బంగ్లా ప్రధాని షేక్ హసీ నాకు ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో శనివారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో లాంఛనప్రాయ స్వాగతం లభించింది. విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి జెపి నడ్డా, జితేంద్ర సింగ్, కీర్తి వర్ధన్ సింగ్ బంగ్లా ప్రధా నికి స్వాగతం పలికారు. త్రివిధ దళాల నుంచి బంగ్లా ప్రధాని షేక్ హసీనా గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి షేక్ హసీనా నివాళుల ర్పించారు. జూన్ 9న ప్రధాని మోదీ సహా కేంద్రమంత్రి మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఏడుగురు విదేశీ అగ్ర నేతల్లో హసీనా కూడా ఉన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## ఎమ్మెల్యే సత్యం కుటుంబసభ్యులకు సిఎం పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొంపల్లిలో నివాసముంటున్న చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి చిత్రపటానికి సిఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేకు ధైర్యం చెప్పి పిల్లలను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన వారిలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిలు ఉన్నారు.

## టిపిసిసి లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా తిరుపతివర్మ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారులు తిరుపతివర్మ కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతివర్మకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియమక పత్రాన్ని అందజేశారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులుగా తిరుపతి వర్మ పనిచేశారు. ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిరుపతివర్మ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ అస్తిత్వం కోసం న్యాయవాద వృత్తిలో ఉండి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో పాల్గొన్నానని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్లు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని తిరుపతివర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రెండు లక్షల రుణమాఫీ హర్షనీయం

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సిఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటు నిర్ణయం రాష్ట్ర రైతాంగానికి శుభదాయకం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే విధంగా, రైతు రాజ్యం నిర్మించే దిశగా పని చేస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టడం అభినందించతగ్గ విషయం అని చెప్పారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కులకు రాష్ట్ర రైతాంగం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలి

### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో మెలగాలని,పార్టీ అధిష్టానం కొత్త పదవులు ప్రకటించేంతవరకు నియోజకవర్గం పరిధిలో ఎలాంటి పార్టీ పదవులు ఉండవని,గతంలోని పదవులన్ని రద్దు చేయడం జరిగిందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీఎం ఎల్‌ఎ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి(కెఎల్‌ఆర్) అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజవర్గ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు గతంలో చెప్పిన విధంగా అసెంబ్లీ ఎలక్షన్ ముగిసిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పదవులన్నిటిని రద్దు చేయడం జరిగిందన్న విషయం గుర్తించాలని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నూతన పదవులను ఎవరికి కూడా ఇవ్వలేదని,ఇట్టి విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్త ప్రతి ఒక్కరు గమనించగలని కోరారు. పార్టీ నూతన కమిటీలు వేసే వరకు మన నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి పదవుల్లోను నాయకులు లేరని,ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కెఎల్‌ఆర్‌కెఎల్‌ఆర్ స్పష్టం చేశారు.

## పాఠశాలల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/షాబాద్ :** గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులందరూ కృషి చేయాలని గ్రామ యువ సంఘాల నాయకులు రాజు, నరేష్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అక్షరభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పాఠశాలను కాపాడుకోలేకపోతే గ్రామంలో నిరుపేదలకు చదువు అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులందరూ అలోచించి పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని వివరించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారాలేదా, విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా లేదా అనే విషయాలను గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నుండి పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యువకులు , పాఠశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/నార్సింగి:** మణికొండ మున్సిపల్ పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సిటిజన్ కౌన్సిల్ సభ్యులు అందే లక్ష్మణరావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, ఉపేందర్‌రెడ్డిలు జిహెచ్‌ఎంసి స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం పర్యవేక్షిస్తున్న చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావుని కలసి వినతిపత్రం అందజేశారు. పంచవటి కాలనీ దగ్గర బుల్కాపూర్ మరియు మల్కం చెరువుల ద్వారా వచ్చిన మురుగునీరు షేక్పేట్ నాలాలోకి తరలించవలసి ఉండగా డిజైన్ తప్పిదం వల్ల మురుగు నీరు పందెం వాగులోకి మళ్లించడం కారణంగా పందెం వాగు చుట్టుపక్కల తీవ్ర దుర్గంధం వెదజల్లి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో పందెం వాగు పొంగి కాలనీలను ముంచెత్తడం విధితమే. వరద నివారణ చర్యల్లో భాగంగా పంచవటి కాలనీ నుండి ట్రైల్స్ గేటెడ్ కమ్యూనిటీ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం జరుగుతున్నది. ఈ నిర్మాణాన్ని పూర్తిచేసి ట్రాఫిక్‌కు వెసులుబాటు కలుగజేయాలని, నిర్మాణాన్ని పొడిగించాలని కోరారు. మణికొండ పురపాలక సంఘం పరిధిలో మురుగు నీరుపారుటకు ఏకైక నాలా పందెం వాగును ఆధునీకరించవలసిన అవసరాన్ని వారి దృష్టికి తెచ్చారు. మణికొండ మున్సిపల్ పరిధి లోని ప్రధాన సమస్యను జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఐదుగురు డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు నిందుతులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి 1,53,000 విలువ చేసే 12.72 గ్రాములు గంజాయిని స్వాధీనపరుచుకున్నమని తెలిపారు. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్నరన్న పక్కా సమాచారంతో మాదాపూర్ పోలీసులు, టిజిఎన్‌ఎబి పోలీసులు ఆధ్వర్యంలో ంతో చాకచక్యంగా ఐదుగురు డ్రగ్స్ అమ్ముతున్న నిందితులు 1. వెకటసాయిచరణ్ (25), బెంగుళూరు రాయల్ టూరిస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ , మాలిక్ లోకేష్ (25) మాదాపూర్, హైద్రాబాద్, సందీప్‌రెడ్డి (30) మాదాపూర్, రాహుల్ (30) మాదాపూర్, సుబ్రమణ్యం (25) సనత్ నగర్, అనే నలుగురుకి ట్రావెల్స్ ద్వార డ్రగ్స్ సప్లై చేస్తున్నాడని తెలిపారు. తనకు 500 మంది డ్రగ్స్ అమ్మే కస్టమర్లు ఉన్నారని వెంకట సాయిచరణ్ తెలిపాడని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని 5గురుని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు మంజూరు

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాడ బోనాల ఉత్సవాలు జరగాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ ఏడాది బోనాల నిర్వహణకు సిఎం రేవంత్‌రెడ్డి రూ.20 కోట్లు మంజూరు చేశారని మంత్రి సురేఖ ప్రకటించారు. బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని దేవాదాయ శాఖ కమిషనర్లతో మంత్రి సురేఖ శనివారం సెక్రటేరియట్‌లోని తన కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. బోనాల ఉత్సవ ఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై మంత్రి సురేఖ ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో దేవాదాయశాఖ కమిషనర్లు కృష్ణవేణి, బాలాజీ, సంధ్యారాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరిలోని ప్రధాన దేవాలయాలతో పాటు ఇతర దేవాలయాల్లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేశారని ప్రకటించారు. దేవాలయాల అలంకరణ, పట్టు వస్త్రాలు కొనుగోలు, బోనాల సమాచారాన్ని తెలిపే పుస్తకాల ముద్రణ, అంబారీ నిమిత్తం ఏనుగు సేవల వినియోగం, విద్యుత్, సాంస్కృతిక, సమాచార ప్రజాసంబంధాలశాఖ ప్రచారం తదితర ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ యేడాది బోనాల నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చైర్మన్‌గా రాష్ట్రస్థాయి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. దేవాదాయశాఖ మంత్రి అయిన తాను, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, రాజ్యసభ ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యులుగా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులు, కన్వీనర్‌గా ఏడుగురితో కూడిన కమిటీ బోనాల ఉత్సవ నిర్వహణా బాధ్యతలను చేపడుతుందని మంత్రి సురేఖ తెలిపారు. ఇతర ప్రధానదేవాలయాలకు ఉత్సవ కమిటీల ఎంపిక ప్రక్రియ రెండుమూడురోజుల్లో పూర్తవుతుందని తెలిపారు.

## సింగరేణి విద్యాసంస్థల్లో 100శాతం ఫలితాలు

### సిఎండి ఎన్.బలరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి విద్యాసంస్థలను అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సిఎండి ఎన్.బలరామ్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సింగరేణి చరిత్రలో తొలిసారిగా రామగుండం 2 ఏరియాలోని సెక్టర్ 3 పాఠశాలలో సిబిఎస్‌ఈ బోధనను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని.. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న 9 పాఠశాలలు, 1 జూనియర్ కళాశాల, 1 డిగ్రీ కాలేజీ, 1 పిజి కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాలల పనితీరుపై తొలిసారిగా శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో గత ఏడాది సాధించిన 10వ తరగతి ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన సెక్టర్3 పాఠశాల, భూపాలపల్లి పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. మిగిలిన పాఠశాలలు కూడా విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. సింగరేణి విద్యాసంస్థల్లో దాదాపు 7500మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని.. గత ఏడాది 94 శాతం ఫలితాలు సాధించినట్లు జిఎం(ఎడ్యుకేషన్) నికోలస్ వివరించారు. సింగరేణి విద్యా సంస్థలను దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెట్లపై ఎక్కువగా ఉందని.. అందరూ సమన్వయంతో పనిచేయాలని సిఎండి పిలుపునిచ్చారు. పాఠశాలల్లో అహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని.. ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వాళ్లు అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని , క్రీడాసక్తిని పెంపొందించేలా బోధన సాగాలన్నారు. సింగరేణి విద్యా సంస్థల్లో ఇతరుల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని.. సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్స్) ఎన్.వి.కె.శ్రీనివాస్, జిఎం(కో ఆర్డినేషన్) జి.దేవేందర్, జిఎం(ఎడ్యుకేషన్) నికోలస్, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బెదిరించినందుకే చంపాం..

### హత్య కేసులో నలుగురి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చంపేస్తానని తరచు స్నేహితులను బెదిరించిన రౌడీషీటర్ ..చివరకు స్నేహితుల చేతిలోనే హత్యకు గురయ్యాడు. ఈ నెల 19న ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సాధన రష్మి పెరుమాల్ వెల్లడించారు. టప్పాచబుత్రాకు చెందిన పెయింటర్ మహ్మద్ ఒమర్ బిన్ హుస్సేన్ ( 29), ఆసిఫ్‌నగర్‌కు చెందిన కూలీ మహ్మద్ ఖాజా (32), మురాద్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఫిరోజ్ పాషా(30), ఆఘాపురాకు చెందిన కూలీ సయ్యద్ గౌస్ (32), నాంపల్లికి చెందిన రౌడీషీటర్ షేక్ అలీ (32) ఈ ఐదుగురు స్నేహితులు. ఈ ఐదుగురు తరచు నాంపల్లిలోని చంద్రా వైన్స్ వద్ద మద్యం సేవించేవారు. ఈక్రమంలోనే రౌడీషీటర్ షేక్ అలీ మద్యంకు కావాల్సిన డబ్బులను నలుగురి స్నేహితులను బెదిరించి తీసుకునేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించేవాడు. అతడి వేధింపులు భరించలేని ఎలాగైనా రౌడీషీటర్‌ను హత్య చేయాలని నలుగురు స్నేహితులు నిర్ణయించుకున్నారు. ఈక్రమంలోనే ఈనెల 19న రాత్రి వైన్ షాప్ వద్ద మద్యం తాగుతున్న షేక్ అలీపై కత్తులతో దాడి చేసి చంపేశారు. పరారీలో ఉన్న ఈ నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## మంత్రి పొన్నంపై ఆరోపణలు సహించం

### పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, అరెపల్లి మోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్, కెటిఆర్ మన్నలు పొందేందుకు మంత్రి పొన్న ప్రభాకర్‌పై ఎంఎల్‌ఎ కౌశిక్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కౌశిక్ రెడ్డి అబూతకల్పనలతో తప్పుదారి పట్టించే ఆరోపణలు చేస్తే తగినగుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బడుగు, బలహీన వర్గాలు నాయకుడుగా కింద స్థాయి నుండి దశల వారిగా ఎదిగరన్నారు. ఆయన్ను అవనీస్తే ఊరుకోమని హెచ్చరించారు. మాజీ ఎంఎల్‌ఎ అరెపల్లి మోహన్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి అంశంలో పారదర్శకత నడుస్తుందన్నారు. లారీల సమర్థ్యం 35 టన్నులు మాత్రమే అన్నారు. కౌశిక్ రెడ్డి వాస్తవాలు మాట్లాడే ప్రయత్నం చేసి, హుందాగా ఉండాలని హితవు పలికారు.

## రూ.7.35 లక్షల డ్రగ్స్, గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బెంగూళూర్ నుంచి హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న రూ.7.35 లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. భరత్‌సాయి అనే వ్యక్తి ఒక ప్రయివేటు ట్రావెల్స్‌లో డ్రగ్స్ తీసుకువస్తున్నాడనే సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ మహేష్, ఎస్‌ఐ రూపలు పంజగుట్ట మెట్రోస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 16 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దూల్‌పేట్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న సుదేశ్‌సింగ్, పి.దీపక్, లడ్డుసింగ్‌లను సిఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భూపాల్‌లు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 26 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఏ. అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.

## సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

### కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఆదేశించారు. శనివారం మన్సూరాబాద్ డివిజన్, సహారా స్టేట్స్ 10వబ్లాక్ వద్ద డ్రైయినేజీ మురుగునీటితో నిండి ఉన్న ప్రాంతాన్ని స్థానికులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్జస్ కాలనీ నుండి సహారా ఎస్టేట్స్,ఆటోనగర్ రోడ్ వరకు ఉన్న బాక్స్ డ్రైన్ నాలాలో డ్రైయినేజీ మురుగునీరు రావడంతో సహారా ఎస్టేట్స్ 10వ బ్లాక్ వద్ద బ్లాక్ అయ్యి మురుగు నీరు పోవడం లేదని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సహారా స్టేట్స్ వెనకాల ఆటోనగర్ రోడ్, బాక్స్ డ్రైన్ నాలా కొనసాగింపు పనులు మొదలుకాకపోవడం, ఆటోనగర్ డంపింగ్ యార్డ్ నుండి వేసిన స్టార్మ్ వాటర్ పైప్ లైన్ ఈ జంక్షన్‌లోనే కలపడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. బాక్స్ డ్రైన్ నాలా కొనసాగింపు పనులు మొదలయ్యేటట్టుగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ,ఎస్ బి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహార ఎస్టేట్స్ కాలనీ అధ్యక్షులు సయ్యద్ జానీ, రవిచంద్ర, రాఘవేందర్, అమర్నాథ్, విజయలక్ష్మి,శీనయ్య, రామన్‌గౌడ్, రాకేష్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మణ్, హామీద్ పాల్గొన్నారు.



**వనస్థలిపురం:** కాలనీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని చైతన్య నగర్ కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కాలనీ రోడ్ల అపరిశుభ్రతపై సంబంధిత అధికారులతో మాట్లాడి అగ్రహం వ్యక్తంచేశారు. జిహెచ్‌ఎంసి అధికారులు కాలనీలో ఉన్న రోడ్డు ఇరువైపుల చెత్తచేదారం లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పవన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌ఎస్ అర్జున్, ఉద్దీన్ జవాన్, రాంచందర్, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

## మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు



**ప్రజాపక్షం/షాబాద్ :** రెండు నెలల క్రితం నమోదయిన మిస్సింగ్ కేసు ను పోలీసులు ఛేధించారు. సిఐ కాంతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 7న షాబాద్‌కు చెందిన తొంట సంతోష(38) కనిపించడం లేదని అతని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం, హాజీపల్లి గ్రామానికి చెందిన సదుల సత్తయ్యపై అనుమానం రావడంతో అతడి అదుపులో తీసుకోని విచారించగా హత్యను ఒప్పుకున్నాడు. రెండు సంవత్సరాలుగా తొంట సంతోషతో సత్తయ్య కు వివాహేతర సంబంధం ఉంది. వేరే వ్యక్తులతో కూడా సంతోష సంబంధం పెట్టుకోడతంతో ఇద్దరి మధ్య దూరం పెరిగింది. గత నెల7న బొనగిరిపల్లి శివారులోని వెంచర్‌లో నైట్ వాచ్‌మెన్‌గా ఉండగా, సంతోష అక్కడకి వచ్చింది. ఇద్దరి మధ్య మాటా మాట పెరగడంతో కర్రతో ఆమె తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందింది. ఆదే రోజు రాత్రి దగ్గరలో వాగు దగ్గర గుంతతీసి పూర్చిపెట్టిన్నట్లు నిందితుడు ఒప్పుకున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి సంతోష మృతదేహం బయటకు తీశారు. మృత్యురాలి కుమారుడు సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడైన సదుల సత్తయ్యను రిమాండ్‌కు తరలించిన్నట్లు పోలీసులు తెలిపారు.

# అతిపెద్ద పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం

### 23 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో.. దేశ, విదేశాల నుంచి 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు రాక



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** దక్షిణ భారతదేశంలో అతి పెద్ద పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన 'ఇండోమ్యాక్' ఎగ్జిబిషన్‌కు కోయికే కట్టింగ్ అండ్ వెల్డింగ్ ఇండియా లిమిటెడ్ సిఒఒ డైరెక్టర్ కుమగయి ముఖ్య అతిథిగా హాజరై హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం ప్రారంబించారు. ఈ నెల 23 వ తేదీ వరకు జరగనున్న ఎక్స్‌పోకు ప్రవేశం ఉచితం. బి2బి ఇండస్ట్రియల్ మెషినరీ, ఇంజనీరింగ్ ఎగ్జిబిషన్ ఇది. ఈ ఎగ్జిబిషన్‌లో మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేవలు, భారీ, తేలిక పాటి యంత్రాలు, యంత్ర పరికరాలు, ఉపకరణాలు, ఇంజనీరింగ్ సాధనాల ప్రదర్శనలో ఉంటాయి. అత్యాధునిక సాంకేతికతలు, గ్లోబల్ ఇన్నోవేషన్‌లు, ఆధునిక పరిష్కారాలతో సహా విస్తృతమైన పారిశ్రామిక అప్లికేషన్‌లను ఆవిష్కరించడం దీని ముఖ్య ఉద్దేశం. వీటిలో కొన్ని భారత్‌లో మొదటిసారిగా పరిచయం కానున్నాయి. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరగనున్న ఈ ఎక్స్‌పో ..ఇండోమ్యాక్ మూడో ఎడిషన్ కావడం విశేషం. అంతకు ముందు 2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన రెండు ఎడిషన్‌లు అపూర్వమైన విజయాన్ని సాధించాయి. ఎగ్జిబిటర్‌లు, సందర్శకులు ఇద్దరికీ ఉపయోగపడింది. ఇండోమ్యాక్ హైదరాబాద్‌తో పాటు జంషెడ్‌పూర్, నాగ్‌పూర్‌తో సహా భారతదేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలలో ఏటా జరుగుతుంది. ఈ సంవత్సరం ఇండోమ్యాక్ ఎగ్జిబిషన్‌లో దేశ, విదేశాల నుంచి 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు విచ్చేశారు. ఇండస్ట్రియల్ మెషినరీ కొనుగోలుదారులు, అమ్మకందారుల సమ్మేళనాలలో ఇది ఒకటి. 750 కి పైగా లైవ్ మెషినరీలను ప్రదర్శిస్తున్నారు. 900కి పైగా ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ప్రదర్శనలో ఉన్నాయి. ఈ మూడు రోజులలో ఎగ్జిబిషన్‌కు పాన్ ఇండియా నుంచి.. ముఖ్యంగా దక్షిణ భారతదేశం, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి 18,000 మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. ఈవెంట్ కోసం 12,000 మంది సందర్శకులు ముందస్తుగా నమోదు చేసుకున్నారు.

ఇండోమ్యాక్ ఎక్స్‌పోలో ఇంజినీరింగ్ మెషినరీ, మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, హ్యాండ టూల్స్, పవర్ టూల్స్, సీఎన్సీ మెషీన్‌లు, మెటీరియల్ హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్, హైడ్రాలిక్స్, న్యూమాటిక్స్, వెల్డింగ్ ఎక్విప్‌మెంట్స్, సేఫ్‌డక్ట్స్, సేఫ్‌డకట్స్ క్విప్మెంట్, లేజర్ టెక్నాలజీ, ఎన్‌ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ సెక్టార్ నుంచి ఇతర కేటగిరీలు కలవు.

## ప్రజాపాలన దరఖాస్తుల సవరణ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తులలో సవరణలు చేయా లనుకున్న దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సంబం ధించి ఎంపిడిఒ కార్యాలయాల్లో పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గృహ జ్యోతి, మహాలక్ష్మి , పథకాలకు సంబంధించి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, గ్యాస్ సిలిండర్ వివరాలు రసీదు, విద్యుత్ బిల్లు సమర్పించి ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తులలో సవరణ చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం



**ప్రజాపక్షం/మల్దకల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల పరిధిలోని నేతివానిపల్లి గ్రామంలో శనివారం ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా గద్వాల నియోజకవర్గంలో యువకులకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. నేతివాని పల్లి నుంచి అడవిరావుల చెరువు గ్రామం వరకు కాంగ్రెస్ పార్టీ వెంకటేశ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌నాయక్ మా ట్లాడుతూ ప్రతి సంవత్సరం మా గ్రామంలో పరుగు పందెం నిర్వహిస్తామని తెలిపారు. క్రీడలు మా నసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదప డు తుందని తెలిపారు. ఈ పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు విరేష్ నాయక్, మాజీ సర్పంచు నేతన్న, గ్రామ పెద్దలు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విజేతకు ఐదుతులాల వెండి అందజేత



**ప్రజాపక్షం/నర్వ:** మండలంలోని ఉందేకోడ్ గ్రామంలో ఏరువాక పండుగ సందర్భంగా శనివారం గ్రామ రైతులు పెద్దసంఖ్యలో ఏరువాక తాడు పోటీల్లో పాల్గొన్నారు. అందులో విజేతగా రైతు కరువ ఉసోల్ల మహేశ్ గెలు పొందారు. ఆయనకు ఎంపీటీసీ పసుల నీరాజ్ సన్మానించి ఐదుతులాల వెండి బహుకరించారు. ఇలా ంటి వేడుకలు గ్రామాల్లో ఐక్యంగా ఉండి ఘనంగా నిర్వహించి మన్ననలు పొందాలని నీరాజ్ కోరారు. గ్రామంలో మంచి కార్యక్రమం చేయాలంటే నేను ముందుంటనని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

## ఖాళీ పోస్టులను భర్తీచేయాలి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖలలోఖాళీగా ఉన్న గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగఖాళీలను తక్షణమే భర్తీచేయాలని బిఆర్ ఎస్వి జిల్లా నాయకులు డి.శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈరెండు కేట గిరిలో ఇప్పటికే నోటిఫికేషన్లు జారీచేసినప్పటికి మరిన్నిఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని వీటినికూడా వెంటనే భర్తీచేయాలన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 2లక్షల ఉద్యోగాలను భర్తీచేసేందుకు వెంటనే నోటిఫికేషన్లు జారీచేయాలన్నారు. ఉద్యోగ నియామక సంస్థలు నిర్వహించే పరీక్షలను పూర్తిగా పారదర్శకంగా చేపట్టి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిబంధనలు అ మలు చేయాలని, గ్రూప్1 రాసిన అభ్యర్థుల సంఖ్యను వెంటనే ప్రకటించాలన్నారు. గ్రూప్1 అభ్యర్థులకు కేటగిరైజేషన్ ప్రకారం కటాఫ్ మార్కుల ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**వెల్దండ :** మండలకేంద్రానికి చెందిన మెకానిక్‌పాండు ఇటీవల అనా రోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంక టయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ధ్యాపవెంకటయ్య, అన్యపు రామస్వామి, మెరుగు విష్ణు, కిష్టాలు, వేములవెంకటేష్, ఎండి.అమీద్, తిరుపతిరెడ్డి, శ్రీను,తుంగశ్రీను, మట్టరవి, మెరుగురాజు, దేవేందర్, కొండలు, ఈదులపల్లి ఆనంద్ పాల్గొన్నారు.

## సమగ్ర పోషకంతో సుస్థిర వ్యవసాయం

### కెవికె శాస్త్రవేత్త భవాని

**ప్రజాపక్షం/పెబ్బేరు :** రైతులు వ్యవసాయ సాగులో సమగ్రమైన పోషక యాజమాన్య చర్యలు చేపట్టడంతో మంచి దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం శాస్త్రవేత్త డా. భవాని అన్నారు. గుమ్మడం క్లస్టర్ రైతు వేదికలో గుమ్మడం అయ్యవారిపల్లి రైతులకు వానాకాలం పం టలపై రైతుల అవలంభించవాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై రైతులకు అర్థమయ్యే సులభమైన రీతిలో అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా భూసార పరీక్ష, వరి నార్లలో తీసుకో వాల్సిన జాగ్రత్తలు, పైరుకు అందించాల్సిన సమగ్రమైనటువంటి పోషక యాజమాన్య పద్ధతులపై విస్తృత స్థాయిలో రైతులకు అవగాహన కల్పిం చడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.క్లస్టర్ ఏఈఓతో పాటు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోవర్ధన్ , రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో నివేదిత విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం / కొత్తకోట :** ఇటీవలే వేసవి సెలవుల్లో రాష్ట్ర స్థాయి నిర్వ హించిన డ్యాన్స్ , కరాటే పోటీల్లో కొత్తకోటకు చెందిన నివేదిత కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో డ్యాన్స్‌లో టి. శ్రీహితరెడ్డి తృతీయ బహుమతి సాయి మహిబాల కూచి పూడిలో కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు, హర్షవర్ధన్ , సహస్రలు ప్రశంస పత్రాలు సాధించగా రాష్ట్ర స్థాయి కరాటే వి.కె. సాత్విక్ కాంస్య పతకం , పూజ ప్రశంస పత్రాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ చంద్రయ్య, వైస్ ప్రిన్సిపల్ వీణ, కో ఆర్డినేటర్ స్వప్న, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

# కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర నాయకులు చంద్రయ్య యాదయ్య







**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఎఐటియుసి కార్మికుల హక్కుల కోసం నిలబడుతూ పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తూ కార్మికులకు దగ్గర అయి ఒదని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. శనివారం భూత్పూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథు లుగా హాజరై కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు దేశంలో ,రాష్ట్రంలో అనేక కార్మిక చట్టాలు తీసుకురావడం జరిగింది స్వాగతంత్ర పోరాట కాలంలో అనేకమంది కార్మికులు హక్కుల కోసం పోరాటుతూ దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను త్యాగం చేశారని వారన్నారు. ఇప్పుడున్న కార్మిక చట్టాలను కనీస వేతన చట్టం ,కార్మిక నష్టపరిహార చట్టం ,ఈ ఎస్ఐపిఎఫ్ బోనస్సు ఫ్యాక్టరీల్లో పనిచేసి చట్టం సాధించడంలో ఎఐటియుసి ప్రాముఖ్య పాత్ర పోషించిందని వారన్నారు రాష్ట్రంలో సింగరేణి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అంగన్‌వాడీ,ఆశా, మధ్యాహ్నం భోజనం ,మున్సిపాలిటీ గ్రామ పంచాయతీ ,మిషన్ భగీరథ ,కార్మికుల సమస్యలను పైన ,బీడీ కార్మికుల సమస్యలపైన బీడీ కార్మికుల సమస్యల పైన పోరాటం చేస్తుందని వార న్నారు. అసంఘటి రంగాలైన భవన నిర్మాణం కార్మిక సంఘం , హమాలీ సంఘం, ఆటో వివిధ రంగాల కార్మికల అండగా నిలబడుతూ సమస్యల పై అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. మహబూబ్ నగర్ జిల్లా వలస జిల్లా అని ప్రత్యేక గుర్తింపు ఉందని వారన్నారు. జడురపెజ్‌లో పని చేసే కార్మి కులకు కనీస వేతవము అమలు చేయడం లేదని, రైస్ మిల్లులు హాస్పిటల్స్, విద్యాసంస్థలు, ట్రాన్స్‌పోర్ట్ లాంటి పరిశ్రమల్లో లక్షలాదిమంది కార్మికులు రోజువారీగా పనిచేస్తు న్నా రని చాలీచాలని వేతనాలతో ఎనిమిది గంటల పని విధానం కాకుండా 10:00 పని చేస్తున్న సందర్భాలు ఉన్నాయని భద్రత, ప్రాణాలకు రక్షణ లేని జీవితాల బిక్కుబిక్కుమంటూ క్షణం తీరిక లేకుండా శ్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఏఐ టియుసి జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసులను కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం రామ్మోహన్ ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులుగా జిటిఎన్ ఆంజనేయులు జిల్లా సహాయ కార్యదర్శి గా ఎర్ర నర్సింలు జిల్లా కోశాధికారిగా కే నరసింహులు ఉపాధ్యక్షు లుగా రజేష్ ఏఐటీసీ జిల్లా నాయకులు సి ,ఆంజనేయులు టి,నరసింహ తిరు పతయ్య బిఎస్ఎన్ఎల్ నుంచి కృష్ణయ్య, సదుల్లా సోమ్లా నాయక్, లక్ష్మణ్ నాయక్, బాలరజు, ఆనందు గంటల శ్రీనివాసులు పెద్ద నరసింహ, చిన్న నర సింహ మహిళా శ్రామికురాలు కే భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ మహిళకు అన్ని విధాలా అండగా ఉంటాం



బాధిత మహిళకు పరామర్శ
రూ.2లక్షల ఆర్థికసాయాన్ని అందజేసిన
ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లితండాకు చెందిన ఆదివాసి బాధిత మహిళను ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితిని వైద్యు లను అడిగి తెలుసు కున్నారు. ఆయన మాట్లాడుతూ చెంచు మహిళపై జరి గిన దాష్టీకాన్ని హేయమైన అటవిక చర్య అని, నలుగురు వ్యక్తులు బాధిత మహిళపై పాశవికంగా దాడిచేసి అమానవీయంగా ప్రవర్తించారని పేర్కొన్నా రు. నిందితులకు కఠినమైన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయం పోలీసు అధికారుల కు ఫోన్‌చేసి నిందితులను అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు.ఇలాంటిదాడులకు పాల్పడినవారిని ఉపేక్షించేదిలేదని, నిందితులకు కఠినశిక్షపడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధా లుగా అండగా ఉంటుందని రూ.2లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ము గ్గురు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యను అందిస్తామన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతలపల్లి గ్రామా నికి చెందిన చెంచుమహిళ ఈశ్వరమ్మపై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షిం చాలని సిపిఐపార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోళ్ల ఏసయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడికిగురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళ ఈశ్వ రమ్మకు రాష్ట్రప్రభుత్వం తక్షణమే 50లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, దోషులు ఎంతటివారైన శిక్షిం చాలని లేనిపక్షంలో దోషులను శిక్షించేవరకు సిపిఐపార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఇలాంటి సంఘటనలు పునరావృత్తంకాకుండా శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## మహిళలపై దాడులు ఇంకెన్నాళ్లు ?



ప్రజాస్వామ్యదేశంలో మహిళలపై దాడులు ఇంకెన్నాళ్లు జరు గు తాయని, మహిళలపై దాడు లుచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కొల్లాపూర్ స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క అలి యాస్ కర్నెశిరీష అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతలపల్లి గ్రామానికిచెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మ దాడికిగురై నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను బర్రెలక్క శనివారం పరామ ర్శించారు. అనంతరం బర్రెలక్క మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం బాధిత చెంచు మహిళ ఈశ్వరమ్మకు 20లక్షల ఎక్స్‌గ్రేషియే చెల్లించి, ఈశ్వరమ్మ పిల్లలను ప్రభుత్వమే చదివించి , దాడిచేసిన వ్యక్తులను శిక్షించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ మునుగుతున్న టైటానిక్ షిప్‌లాంటింది : రఘునందన్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ మునుగుతున్న టైటానిక్ షిప్ లాంటి దని, అది మునిగిపోవడం ఖాయమని మెదక్ ఎంపి, బిజెపి నాయకులు ఎం.రఘునందన్ రావు అన్నారు. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ జర్న లిస్టు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో రఘునందన్‌రావు మాట్లాడారు. బిఆర్ఎస్ నుంచి ఆ పార్టీ నాయకులంతా రిటైర్ కావడం పక్కా అని, కెసిఆర్, హరీష్‌రావుతో పాటు ఎవరూ వచ్చి నా బిజెపిలోకి స్వాగతిస్తామంటూ సెటైర్లు గుప్పించారు. బిజెపిలో చేరిన మొదటి రోజు నుంచే ఆ పార్టీ కార్యకర్తగా బాధ్యతాయుత్తంగా పని చేస్తున్నానని చెప్పారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి సంబంధించి ఆయన స్పందిస్తూ పార్టీలో పద వులు రావడానికి కొత్త, పాత అంటూ ఏమి లేదని, నాయకుల సామర్థ్యాల మేరకు పార్టీ కేంద్ర అధిష్టానం కేటాయిస్తుందన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో బిసిలకు అవకాశం కల్పించాలి

### బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు పెద్దపీట వేసి, ఎక్కువ మంది బిసి బిడ్డలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. 10 శాతం లేని అగ్రకుల ఆదిపత్యాలకు రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ కులాలకు మంత్రి పదవులు ఇచ్చి రాష్ట్రంలోనే అత్యధిక 50 శాతం కలిగిన బిసి కులాల్లో ముదిరాజ్, మున్నూర్ కాపు, రజక లాంటి వెనుకబడిన కులాలకు మంత్రి పదవుల్లో అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ మంత్రి వర్గ విస్తరణలో క్యాబినేట్లో చోటు కల్పించాలని ఆయన డిమాండు చేశారు. ఈ నేపథ్యంలో ముదిరాజ్ వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అదే విధంగా ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న, షాద్‌నగర్ ఎమ్మెల్యే రజక కులానికి చెందిన వీర్లపల్లి శంకర్ బిసిలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆయన కోరారు. బిసిలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి మంత్రులుగా ఎక్కువ మందికి అవకాశం ఇవ్వాలని ఆయన అన్నారు.

# పెబ్బేరు మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన



**ప్రజాపక్షం/పెబ్బేరు :** రాజ్యాంగ నిర్మాత, భార తరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయా లకు అనుగుణంగా నడుచుకుంటూ స్ఫూర్తిని పొందాలని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం పెబ్బేరు మండలం సుగూరు గ్రామంలో డా. బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్ర హాన్ని స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డితో కలిసి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ చూస్తూ వారి ఆశయ సాధన కొరకు స్ఫూర్తి పొందాలని ప్రజలను సూచించారు. సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావ లంబన సాధించడానికి విద్య ఒక్కటే మార్గమని చెప్పారు. పేదవారు సైతం ప్రైవేట్ స్కూల్‌లో పిల్ల లను చదివించి లక్షల రూపాయలు దారపోస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు లేక నాణ్యమైన విద్య ఉండదని, అదే ప్రభుత్వ పాఠశా లల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు ఉంటార న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ భావి తరాలకు ఏం కావాలో అవస రాలు ఉంటాయి అనేది అంబేద్కర్ ఆ రోజుల్లోనే తెలుసుకొని దానికి అనుగుణంగా రాజ్యాంగం రాశారని కొనియాడారు. జాతీయ రహదారి నుం డి సుగురు వెంకటాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు సౌకర్యం కలిగిందని, ఫ్లడ్ డ్యామేజ్ పథకం కింద వంతెనను రోడ్లు భవనాలు శాఖ నిర్మాణం చేసిందన్నారు. అంతకు ముందు పెబ్బేరు మండల అభివృద్ధి కార్యక్రమంలో 40 మంది లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్ చెక్కు లను అందజేశారు. పెబ్బేరు ఎంపిపి శైలజ, జడ్పి టిసి పద్మా వెంకటేష్ , కురుమూర్తి, వెంకటేష్ , ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## విఓఎల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వంగూర్ :** గ్రామాలలో పని చేస్తున్న విఓఎల సమ స్యలను వెం టనే పరి ష్కరించాలని సిఐ టియు జిల్లా నాయ కు లు బండపల్లి శివ రా ములు అన్నారు. శని వారం మండల కేం ద్రంలో నిర్వహించిన విఓఎల జనరల్ బాడి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనం తరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మహిళాపొదుపు సంఘాల నిర్వహణ లో నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. సంవత్సరాలు తర బడి గ్రామా లలో పనిచేస్తున్న వివోఎలకు కనీసవేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ప్రభుత్వం గుర్తించి వివోఎలకు కనీస వేతనం 26వేలు, పిఎఫ్ ఇఎస్ఐ ప్రమాదబీమా, టిఎడిఎ వంటి సౌకర్యాలుకల్పించి ప్రతినెల 1వతేదీవరకు వేతనాలు అందేటట్లుచూడాలని ఆయన ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివోఏ మండలకమిటి అధ్య క్షులు జంగయ్య, నాయకులు రామస్వామి, లక్ష్మి రవికుమార్, రజిత బాలస్వామి, రాఘవేందర్, రవి , పాల్గొన్నారు.

## కేసులు సత్వరం పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేసుల సత్వర పరిష్కారానికి న్యా యమూర్తులు చొరవచూపాలని హైకోర్టు న్యాయమూర్తి నాగర్‌కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ యం.జి ప్రియదర్శిని అన్నారు. జిల్లా అడ్మి నిస్ట్రేటివ్ జడ్జిగా నియామకమైన తర్వాత ఆమె మొదటిసారి హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవిదేవితో కలిసి శనివారం నాగర్‌కర్నూల్ కోర్టుకు వచ్చారు. ఈసందర్భ ంగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు, కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్‌లు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాకోర్టులో వివిధ ప్రారంభోత్సవాలు చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. 14వేలకేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిలో రాజీ అవ్వదగ్గకేసులను నేషనల్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు అధికారులందూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాజీ అవ్వదగ్గ కేసులైనటువంటి సివిల్, మోటార్‌వెహికిల్స్, భార్యాభర్తల కేసులు తదితర కేసులు అన్ని కూడా ఇరుపక్షాలను రాజీకు దర్చడం మంచి దన్నారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేం దుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగ ర్‌కర్నూల్ జిల్లా డిస్ట్రిక్‌బార్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, బార్ అసోసియే షన్ మెంబర్ హన్మంత్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ పుప్పాలగూడలో ప్రారంభం

✻ పాల్గొన్న మంత్రి దామోదర్ రాజ నరసింహా



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** అత్యాధునిక డెంటల్ కేర్ కు ప్రసిద్ధి చెందిన డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్‌ను హైద రాబాద్‌లోని పుప్పాలగూ డలో కాంగ్రెస్ నేత మధు యాష్కితో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామో దర రాజ నరసింహ శని వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ అత్యాధునిక డెంటల్ కేర్ హాస్పిటల్ హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడం, దానిని తాను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ హాస్పిటల్ అంచెలంచెలుగా ఎదుగుతోందని, 2013లో మాదాపూర్ బ్రాంచ్, 2014లో మరో ప్రాంచ్‌తో పాటు, ఇప్పుడు ఈ బ్రాంచ్ ప్రారంభించినట్లు తెలి పారు. దంత వైద్యంలో రోగులకు మంచి సర్వీసు అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ డా. గౌడ్స్ కుటుంబం అంతా ఈ వృత్తిలోనే ఉందన్నారు. గవర్నర్, ముఖ్యమం త్రులు ఈ హాస్పిటల్‌కు వస్తూ ఉంటారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, సిఎండి డాక్టర్ ఎమ్ఎస్ గౌడ్ మాట్లా డుతూ 55 సంవత్సరాల క్రితం డెంటల్ క్లినిక్ ఏర్పాటు చేసినప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నానన్నారు. అంతర్జాతీయ డెంటల్ కాన్ఫరెన్స్‌లకు విదే శాలకు వెళ్లినప్పుడు అక్కడ చూసి ఆధునిక టెక్నాలజీని తమ హాస్పిటల్‌లో ఉపయోగించామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ ఆర్థోడాంటిక్స్ , సిఈఓ డాక్టర్ స్నిగ్ధా గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ గౌడ్స్ డెంటల్ హాస్పిటల్ విభిన్న దంత అవసరాలు తీర్చనుందన్నారు.

## జడ్చర్లలో వ్యక్తి దారుణ హత్య

**ప్రజాపక్షం/జడ్చర్ల:** పట్టణ పరిధిలో ఆంజనేయులు అనే వ్యక్తిని గొంతు కేసి దారుణంగా హత్య చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరి ధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తమ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం శనివారం తెల్లవారుజామున పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఆంజనే యులు 43కు జాతీయ రహదారిపై ఉన్న ఎంబీ మెడికల్ సెంటర్ వద్ద మేకల షెడ్డు ఉంది. శుక్రవారం రాత్రి మేకల కాపలా కోసం షెడ్డు దగ్గర పడుకున్నాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయులు గొంతు కోసి చంపేశారు. పోలీసులు ఘటనస్థ లానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం జడ్చర్ల ప్రభుత్వా సుప త్రికితరలించారు.మృతుడికిభార్య 3 కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు.

## పూర్తి స్థాయి కమిషనర్‌ను నియమించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయూష్ విభాగానికి పూర్తి స్థాయి కమిషన ర్‌ను నియమించాలనే అభిప్రాయాలు సర్వత్ర వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పూర్తిగా విఫలమవుతోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తి స్థాయి కమిష నర్ ఉంటేనే సకాలంలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని పలు వురు సూచిస్తున్నారు. ఇన్‌చార్జ్ కమిషనర్ వ్యవహారశైలితో ఆయూష్ సేవ లు మందగించడంతో పాటు సిబ్బందికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు ఉద్యోగులు వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందిం చి,పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని ఉద్యోగులు కోరారు.

# పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన




**ప్రజాపక్షం/వనపర్తిటౌన్:** దేశంలో నీట్ పరీక్ష గందరగోళంపై కేంద్రం గ్రేస్ మా ర్కులను పొందిన వారి మార్కులు మాత్రమే రద్దు చేసి జూన్ 23న రీ ఎగ్జామ్ నిర్వ హించి జూన్ 30న ఫలితాలు ఇస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలుపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచా రణ జరిపించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం. ఆది మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి వారికి మళ్లి రీ ఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవక తవకలు పక్కదారి పట్టించడమే అని వారు అ న్నారు. దీని వల్లన నీట్ ట్యాంకులు తారుమారు అయ్యి గందరగోళం ఏర్పడుతుందని తెలిపారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయకుండా ఎన్‌టిఏ ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్నారు. రీ ఎగ్జామ్ నిర్వహించి ఎన్‌టిఏను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమా ండ్ చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న ఎన్‌టిఏ చైర్మన్ డైరెక్టర్లను తప్పిం చాలని వారిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని యెడల దేశ వ్యాప్తంగా మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్ , సాయి, చరణ్ , ఈశ్వర్ , మహేష్ , శ్రీలత, మాధవి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి : బిజెవైఎం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం తక్షణమే జాబ్ కార్డ్‌ను ప్రకటించి ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర యువ మో ర్చా ఆధ్వర్యంలో టిజిపిఎస్‌సి ముందు ధర్నా చేపట్టారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులుసెవెళ్ళ మహేందర్ మాట్లాడుతూ గ్రూప్‌వన్ ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయడంతోపాటు గ్రూప్ 2 గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అద నంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా25 వేల టీచ ర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని,జాబ్ క్యాలెండర్ ను వెంటనే విడుదల చేయాలన్నారు. బిజెవైఎం నాయకులుటిజిపిఎస్‌సిలోలోకిదూసు కువెళ్లేందుకుయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
హైదరాబాద్ | ఆదివారం | 23 జూన్, 2024


## తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఎంపికలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు జరుగుతున్నా యని శామీర్‌పేట మండల విద్యాధికారి వసంతకు మారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 24న శామీర్‌పేటలోని మినీ స్టేడియంలో ఎంపికలు నిర్వ హిస్తామని చెప్పారు. 4వ తరగతి ప్రవేశానికి సంబందించి 01/09/2015 నుంచి 31/08/2016 తేదిలోపు జన్మించి ఉండాలని సూచిం చారు. అర్హత కలిగిన విద్యార్థులు పుట్టిన తేది ధృవ పత్రం, ఆధార్‌కార్డు, ప్రస్తుత పాఠశాల బోనోఫైడ్, మూడవ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డు, 5 పాస్ ఫోటోలతో జూన్ 24న ఉదయం 9 గంటలకు మిని స్టేడియంలో హాజరు కావాలని పేర్కోన్నారు. మరి న్ని వివరాలకు 9502456329, 9182 1338 56, 9704816313 ఫోన్ నెంబర్‌లకు సంప్రదిం చాలని ఆ ప్రకటనలో కోరారు.

## ఈటలను కలిసిన బిజెపి మేడ్చల్ జిల్లా కోశాధికారి



ప్రజాపక్షం/దుండిగల్: మల్కాజ్గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గా ఘన విజయం సాధించి జూన్ 23 వ తేది ఆదివారం ప్రమాణ స్వీకారం చేయబో తున్న సందర్భంగా మేడ్చల్ లోని ఆయన నివాసం లో బౌరంపేట్ బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలి యజేసిన బీజేపీ మేడ్చల్ జిల్లా కోశాధికారి పీసరి కృష్ణారెడ్డి ఈ కార్యక్రమం లో బౌరంపేట్ బీజేపీ నాయకులు డి.ప్రభాకర్ రెడ్డి, నల్ల రాంచంద్రరెడ్డి, సరిగారి సత్తిరెడ్డి, డి. సీ తారాం రెడ్డి, ఆర్ నర్సిం హా చారి, శ్రీనివాస్ రెడ్డి, పి.మాధవరెడ్డి, రణదీప్ రెడ్డి, ఆకుల సత్యనారా యణ, జంగారెడ్డి, సు రేందర్ రెడ్డి, అందె అశోక్, బౌరంపేట్ సింహపురి కాలనీ వాసులు ప్రమోద్ కుమార్, రాజేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో రౌడీలు హల్‌చల్

వారం రోజులుగా తిష్ట వేసి స్థానికులను బెంబేలు ఎత్తిస్తున్న కిరాయి గుండాలు
చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు






ప్రజాపక్షం/దుండిగల్ : కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా రాయుళ్ల కబంధ హస్తల్లో మునిగింది. దుండిగల్ గండి మైసమ్మ మండలం పరిధిలోని బహ దూర్ పల్లి సర్వే నంబర్ 131లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు కిరాయి గుండాలు తిష్ట వేశారు.ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు ఫ్రీ కాస్ట్ వాళ్ల వేసి ప్రభుత్వ భూమిలో కుర్చీలు వేసుకొని కూర్చుని అజ్మాయిస్ చలా ఇస్తున్నారు. అడిగే వారు లేకపోవ దంతో కబ్జారాయులు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది. ప్రభుత్వ స్థలంలో మండల రెవెన్యూ అధికా రులు పట్టించుకోకుం డా కబ్జారాయాల్లో భూమిలో పగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకు ల అండదండల తోటే ఈ కబ్జాకు శ్రీకారం చుడుతున్నా రని వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి బహదూర్ పల్లి లో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దుండిగల్ మండలం తహసీ ల్దార్ మతిన్ వివర ణ కోరగా బహదూర్ పల్లి 131 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని తమ దృష్టికి సైతం ఈ విషయం వచ్చిందని ప్రభుత్వ భూమి లో కబ్జాకు యత్నిస్తు న్న వారిపై దుండిగల్ పోలీసులకు సమాచారం చేరవేశామన్నా రు. కిరాయి గుండాలను వెం టనే బైండో వర్ చే యాలని బహదూర్‌పల్లి సెక్టా ర్ ఎస్ఐకి తెలిపినట్లు దుండిగల్ ఎమ్మార్వో మతి న్ తెలిపారు.

**ప్రేక్షక పాత్ర పోషిస్తున్న దుండగల్ పోలీసులు**

బహదూర్ పల్లి లో ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నారని డ యల్ 100ద్వారా స్థానికులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందిస్తే ఎటువంటి చర్యలు లేవని స్థానికులు తెలిపారు. ఈ విష యమై దుండిగల్ సీఐ శంకరయ్యను వివరణ కోరగా రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటా మని తమకు లిఖితపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు రాలేదని సిఐ శంకరయ్య తెలిపారు.

## మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

జెడ్‌పి చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేట:మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు కాం గ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జడ్‌పి చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అ న్నారు. శనివారం శామీపేట మండలం మజీద్‌పూర్‌లో ద్వాక్రా భవనాన్ని మహిళలతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా జడ్‌పి చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో మహిళలు ఆరర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడే విదంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. వడ్డీలేని రుణాలతో పాటు మహిళలు స్వ యం సహయక సంఘాలతో క్యాంటీన్‌లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. మహిళలకు అందుబాటులో భవనం వసతి కల్పించిన శామీర్‌పేట ఎంపిటిసిల ఫోరం అద్యక్షుడు, మజీద్‌పూర్ ఎంపి టిసి సరసం అశోక్‌రెడ్డిని జడ్‌పి చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అభినందించారు. ప్రత్యేకాధికారి పూర్ణిమ, మాజి సర్పంచ్ మల్లేష్, బిసిసెల్ అద్యక్షుడు అబ్బ గౌని భాస్కర్‌గౌడ్, కుడుముల వెంకటేష్, సత్యవతి, జ్యోతి, నవనీత, నర్మద, వనజ, గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఎస్‌కెఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : మర్పల్లి మండల పరధిలోని గుండ్ల పల్లి గ్రామంలో బచ్చన్, బిచ్చయ్య మరణించారు. అట్టి విషయం గ్రామ స్తుల ద్వారా తెలుసుకున్నా ఎస్‌కేఆర్ ట్రాస్టు చైర్మన్ మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి బిచ్చయ్య అత్యక్రియలకు 5వేల ఆర్థిక సహయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గోన్నారు.

## గౌడ సంఘానికి స్థలం కేటాయించాలని ఎంఎల్‌ఎకు వినతి



ప్రజాపక్షం/చర్లపల్లి: గౌడ సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శని వారం చర్లపల్లి గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చర్లపల్లి సర్వే నంబర్ 278లో గతంలో 5 ఎకరాల స్థలంను గౌడ సంఘా నికి కేటాయించారు.అందులో ఈత చెట్లను పెంచుకున్నామని,ఆ స్థలం మధ్యలో నుండి వాకింగ్ ట్రాక్,సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును నిర్మించారని వాటి వల్ల చెట్లు లేకుండాపోయాయని సభ్యులు తెలిపారు.గీతా పారిశ్రా మిక సంఘానికి వేసే చోట 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఎంఎల్ ఎను వినతి పత్రంలో కోరారు.స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంఎ ల్ఏ హామీ ఇచ్చారని సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాసుల ఆనంద్‌రాజ్‌గౌడ్,రుద్రగోని రాంచందర్ గౌడ్, ఉపాధ్యక్షులు రాగీరు నర్సింహగౌడ్,ఆనంద్‌రాజ్‌గౌడ్,శ్రావణ్‌కుమా ర్‌గౌడ్,అంజయ్యగౌడ్,నాధంగౌడ్,రాములుగౌడ్,అశోక్‌గౌడ్, శశికాంత్ గౌడ్,చెన్నయ్యగౌడ్,నాయకులు మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ వర్థంతి

ప్రజాపక్షం/బొమ్రాస్ స్పేట్ : ఆచార్య కొత్తపల్లి వర్థంతి సందర్భంగా బొ మ్రాస్‌పేట్ మండల తహసీల్దార్ కార్యాలయంలోఎంఆర్‌సి,భవనం ముం దు ఆవరణలో విద్యావంతుల వేదిక నాయకులు తహసిల్దార్ ,ఎంపిడిఓ నోడల్ ఆఫీసార్ కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నవాళు లు అ ర్పించారు. ప్రత్యేక రాష్టం సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని తెలంగాణ కో సం అంకితం చేసిన మహనుభావుడు ప్రొఫెసార్ జయశంకార్ అని విద్యా వంతుల వేదిక నాయకులు అన్నారు. తెలంగాణ ప్రజలను జాగృ తం చే యటంలో ఆయాన పోషించిన పాత్ర ఎంతో సమున్నతమైనదని తెలిపారు. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కోన్నారు.

## ఆర్‌టిసి సిబ్బంది నిర్లక్ష్యం... ప్రయాణికుల పాట్లు




ప్రజాపక్షం / కొడంగల్ :ఆర్‌టీ సీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల జోరు వర్షంలో ప్రయాణికులు తీవ్ర అ వస్థలు పడాల్సిన దుస్థితి కొడంగల్ ఆర్‌టీసీ బస్టాం డ్‌లో నెలకొం ది. ప్రయాణికుల కథనం మేరకు మహబుబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్‌టీసీ ప్రైవేట్ బస్సు మహబుబ్‌నగర్ నుంచి తాండూర్ వైపు వెళ్తుండగా మార్గమద్యలో ఓ స్టేజి దగ్గర బస్సు ఆపమని కండక్టర్ చెప్ప డంతో డ్రైవర్ ఆపకపోవడంతో ఇరువురి మద్య మాటల యుద్ధం జరగడం జరిగిందన్నారు. చివరిగా కొడంగల్ బస్టాండ్‌లోకి చేరుకోగానే బస్సు స్టాట్ కావడం లేదని ఫెయిల్ అయిందని బస్సును ఆపివేయడంతో కండక్టర్ వర్షంలో ప్రయాణికులను దింపి బస్సును తోసే ప్రయత్నం చేశారు. కాని బస్సు కదలకపోవడంతో చేసేది ఏమి లేక ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు. 20 నిమిషాల తరువాత ఫెయిల్ అయిన బస్సు తిరిగి ప్రయా ణికులను ఎక్కించుకుని వెళ్లిపోయారు. కండక్టర్ డ్రైవర్‌ల నిర్లక్ష్యం కార ణంగా ప్రయాణికులు వర్షంలో తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## టాయిలెట్ల పరిశుభ్రతపై దృష్టి సారించిన ఎంపి

మొబైల్ టాయిలేట్ల క్లీనింగ్ ట్రాక్ ప్రారంభం

ప్రజాపక్షం/తాండూరు: పాఠశాలలో నెలకొన్న టాయిలేట్ల పరిశుభ్రతపై ఎంపి రంజీత్‌రెడ్డి దృష్టి సారించారు. అందులో భాగంగానే చేవెళ్ళ పార్ల మెంట్ పరిధి తాండూరులోని ప్రభుత్వం జిల్లా పరిషత్ పాఠశాలలో జస్టీస్ కొండా మాదవరెడ్డి పౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన టాయిలెట్ల క్లీనర్ ట్రాక్‌ను చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎంపి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు స్వచ్ఛ్ భారత్ లో భాగంగానే తాను పాఠశాలలో నెలకొన్న విద్యార్థుల టాయిలెట్ల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు. అందుకు ఎన్ని నిధులు ఖర్చు అయిన సరే పాఠశాలలో టాయిలెట్ల పరిశుభ్రత కోసం ప్రత్యేక మొబైల్ ట్రాక్కును ఏర్పాటు చేయించి పరిశుభ్రం చేయిండం జరుగుతుందని తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న కంపును ప్రారద్రోలవచ్చనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాశ్వర్ గుప్తా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమే ష్‌కుమార్, జిల్లా కార్యదర్శి కృష్ణముదిరాజ్, ఎంఈఒలు వెంకటయ్య, సుధా కర్‌రెడ్డి, నాయకులు నాగారం మల్లేశం, కౌన్సిలర్‌లు అంతారం లలిత, సాహుశ్రీలత, నాయకులు బంటారం భద్రేశ్వర్ తదితరులు పాల్గోన్నారు.

## ఐదేళ్లు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి




ప్రజాపక్షం/తాండూరు: కేంద్ర మంత్రి పదవి హోదాతో పాటు రాష్ట్ర బిజేపి పార్టీ అధ్యక్ష పదవులపై తనకు ఆశ లేదని, ఆ పదవుల రేసులో కూడా లేదని చేవెళ్ళ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఎం పిగా గెలిచిన తరువాత శనివారం తాండూరు పట్టణంలో జరిగిన ఓ కార్యక్ర మానికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హజరైనారు. ఈ సందర్భంగా ఆయన మీడి యాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవిపై ఆశ లేదని, అదే విధంగా రాష్ట్ర బిజేపి పార్టీ అధ్యక్ష పదవి రేసులో కూడా లేదన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవి పొందాలంటే రాష్ట్ర వ్యాప్తంగా తనకు పట్టు ఉండాలని, అదే లేనప్పుడు తాను రాష్ట్ర అధ్యక్ష పదవి ఎలా పొందుతానని తెలిపారు. కేంద్ర మంత్రి పదవి వస్తే తాండూరు ప్రజలకు దూరమవుతానని తెలిపారు. తకు చే వెళ్ళ పార్లమెంట్ అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. రెండు వారలలో జుంటు పల్లి ప్రాజెక్టు పనులకు మరమ్మత్తులు చేయిస్తానని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఈ మేరకు స్థానిక ఎంఎ ల్ఏ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుక పోయానని వారి సహకారంతో జుంటుపల్లి ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేపడుతామని వివరించారు. కొందరు కాంట్రాక్ట రులు నిధులు తక్కువ ఉన్నాయని ముందుకు రావడం లేదని, త్వరలోనే అట్టి మరమ్మత్తు పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈ మీడియా సమావే శంలో ఎంపిపి బాలేశ్వర్ గుప్తా, కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్, జిల్లా ప్ర ధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, బిజేపి మహిళ మోర్చ నాయకులు అంతారం లలిత, సాహు శ్రీలత, బిజేపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం,జిల్లా కార్య దర్శి బంటారం బద్రేశ్వర్, కౌన్సిలర్‌లు బాలప్ప, శేఖపురం అంజనేయలు తదితరులు ఉన్నారు.

## మార్కెట్ కమిటీ రిజర్వేషన్‌పై తప్పడు ప్రచారం చేస్తే సహించేది లేదు

ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ హర్షనీయం
మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు




ప్రజాపక్షం/తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీరిజర్వేషన్‌పై కొందరు వ్యక్తులు పనికట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. శనివారం తాండూరు ప్రజాభవన్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, డిసిసిబి డైరక్టర్ రవిందర్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల తదితరులు మాట్లాడారు. తాండూరు ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటి రిజర్వేషన్ల ప్రకారమే ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపాపని, దీనిపై ఏలాంటి అనుమానం లేదని, బిసి జనరల్ కిందనే చైర్మన్‌ను ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. నూతన మార్కెటింగ్ శాఖ ఆమోదం తెలిసి వ్రాత పూర్వకంగా జిఒ కూడా త్వరలోనే విడుదల చేస్తుందని, దీనిపై ప్రతిపక్షన నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఏ మనోర్‌రెడ్డి పూర్తి స్థాయిలో రాజకీయ అనుభవం ఉందని, అప్పటికప్పుడు ఎంఎల్ఏ కాలేదని సూచిం చారు. తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పదవి బీసిలకే దక్కుతుందని, పట్లోళ్ళ బాల్‌రెడ్డి చైర్మన్ అవ్వడం ఖాయమని తెలిపారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్ష రుణమాఫీ చేయడం హర్శించదగ్గ విషయమని కోనియాడారు. జూలై 15లోపు రైతు ఏక కాలంలో రుణమాఫీ అవ్వడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డికి, స్థానిక ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలి పారు. ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్ విజయదేవి, ప్రవీణ్‌గౌడ్, ప్రభాక ర్‌గౌడ్, మాజీ కౌన్సిల్ జుబేర్ లాల, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, నాయ కులు బాతుల నాగు తదితరులు ఉన్నారు.

## మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి: తమ ప్రాంతంలో గత కొద్ది కాలంగా మంచి నీటి సరఫరా సక్రమంగా రావటం లేదని, ప్రెషర్ తక్కువగా, సమయం తక్కువగా నీరు విడుస్తున్నారని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని పివిఎన్ కాలనీవాసులు భాస్కర్, లక్ష్మి , భాస్కర్, కిషోర్, శంకర్ తదితరులు చె ప్పారు. శనివారం స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ జల మండలి మేనే జర్ నవీన్, వాటర్ మీటర్ పరిశీలకులు వినయ్‌కుమార్, సైట్ ఇన్‌ఛార్జి ప్రణయ్, అధికారులతో కల్సి ఆ ప్రాంతంలో పర్యటించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

## రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ధర్నా



ప్రజాపక్షం/మల్కాజిగిరి: గత ఎనిమిది నెలల క్రితం ప్రారంభించి అర్థాంత రంగా నిలిపేసిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలంటూ ఆర్టీసీ కాల నీలో మహిళలతో సహా ప్రాంతవాసులు, చిన్నారులు శనివారం ధర్నా చేసారు. అధికారుల దృ ష్టికి ఎన్ని సార్లు తీసుకొని వెళ్ళినా ఇదిగో అదిగో అంటూ చె ప్పటం తప్ప పనులు మాత్రం పూర్తి చేయటం లేదంటూ ఆగ్ర హం వ్యక్తం చేసారు. ధర్నా చేస్తున్న స్థానికులకు మద్దతుగా విచ్చేసిని బిజెపి నేత మేకల మోహనయాదవ్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కార్పొరేటర్, ఎమ్మెల్యేలు సైతం ఈ విషయం లో నిర్లక్ష్యం కనపరుస్తున్నారన్నారు. రోడ్డు పనులు పూర్తి కాక పోవటం వల్ల గుంతలు పెద్దవై పోయాయని, చిన్న పాటి వర్షం వచ్చినా నీరు నిలిచి ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. కాలనీకి చెందిన పద్మ, బిందు, శోభ, సుబ్బు, దస్తగిరి శెట్టి, పాండు, సతీష్ శేఖర్‌లు మాట్లాడుతూ ఈ ప్రాంతం మీ దుగా ప్రతి రోజు అనేక వాహనాలు తిరుగుతుంటాయని, అ నేక సార్లు ప్రమాదాలకు గురయ్యారన్నారు. అదే విధంగా ఈ రహదారిలో వెళు తున్న చిన్న పిల్లలు, సీనియర్ సిటిజన్లు గుం తల్లో పడి గాయాలపాలయ్యార న్నారు.పలు సార్లు జిహెచ్ఎం సి కార్యాలయానికి వెళ్లి చెప్పినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నందునే చివరికి ఆందోళన బాట పట్టామ న్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని వారు కోరారు.

## చెత్త రహిత ప్రాంతంగా మల్కాజిగిరిను తీర్చిదిద్దుతా

ప్రజాపక్షం/మల్కాజిగిరి: చెత్త రహిత ప్రాంతంగా మల్కాజిగిరి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు అధికారులతో సహా ప్రజలందరూ సహ కరించాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ అన్నారు. దీనిలోని భబూ గంగా శనివారం జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఆడి షనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డి.ఈ మాధవి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న పది రోజుల్లో ప్రతి రోడ్డులో ప్రత్యేక ప్రణాళికతో చెత్తను సేకరించాలని,అవసరమైతే అద నపు సి బ్బందిని ఏర్పాటు చేయాలని, ఎక్కడా చెత్త కు ప్పలు కనపడకుండా చూడాలని ఆయన సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారాలు పదే యకుండా నిర్దిష్టమైన బుట్టల్లో వేసి చెత్త తీసుకొని వెళ్ళే వారికి అప్పచెప్పా లన్నారు. రహదార్లపై సైతం చెత్త పడేయకుండా చూడాలన్నారు.

## విహారి హోమ్స్ కాలనీ వాసుల డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ప్రజాపక్షం/పోచారం :మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గూడ విహారి హోమ్స్ కాలనీ గుంతలమయమైన రోడ్లు డ్రైనేజీ తాగునీటి సమస్యలు ఇతవ రకు మున్సిపాలిటీ అధికారులు కానీ మాకు ఎలాంటి పరిష్కరించలేదని విహారి హోమ్స్ అధ్యక్షుడు కె ప్రభాకర్ తెలిపారు. ఇస్మాయిల్ ఖాన్ గూడ విహారి హోమ్స్ కాలనీలో పెద్దలు అసోసియేషన్ సభ్యులతో కలిసి శనివారం విలే కర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె, ప్రభాకర్ మాట్లాడుతూ విహారి హోమ్స్‌లో దాదాపు 300 ఇండ్లు ఉన్నాయి మాకు ప్రధా నంగా రోడ్లు, డ్రైనేజీ సమస్య తాగునీటి సమస్య వర్షం వచ్చినప్పుడు కాలనీ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సమస్యలపై స్థానిక కౌన్సిలర్ గొంగళ్ళ మహేష్, మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు మొరపె ట్టుకున్న ఇప్పుడు అప్పుడు అంటూ కాలం గడుపుతూ వచ్చారని కాలనీ వాసులు ప్రశ్నిస్తే ఇప్పుడు మాకు నిధులు లేవంటూ చేతులెత్తేసారని మాజీ మంత్రి మల్లారెడ్డి పలు అభివృద్ధి పనులకు శిలాఫలకు వేసి కొబ్బరికాయలు కొట్టి ఏళ్లు గడుస్తున్న ఒక్క పని సాగలేదని నిధులు శిలాఫలకు ఎందుకు వేయాల్సి వచ్చిందని కాలనీ ప్రజలు ప్రశ్నించారు. ఇప్పటికైన మున్సిపాలిటీ అధికారులు స్పందించి విహారి హోమ్స్ కాలనీ వాస్తులకు కనీస మౌలిక సమ స్యల పరిష్కరానికి కృషి చేయాలని మీడియా ద్వారా కోరారు. లేదంటే మా కాలనీలో సమస్యల పరిష్కారానికి ఎంత వరకైనా పోరాడుతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాజీరావు, ముకుంద రెడ్డి, వర్మ, విజయ్ కుమార్, నాయుడు, బాల సుబ్రహ్మణ్యం, చారీ, సికిందర్, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శివవిష్ణు దేవస్థానానికి నూతన చైర్‌పర్సన్‌గా ఉమామహేశ్వరి



ప్రజాపక్షం/శామీర్‌పేట : శ్రీ శివ విష్ణు దేవస్థానానికి నూతన చైర్ పర్స న్‌గా ఉద్దెమర్రి గ్రామానికి చెందిన ఆడెపు ఉమామహేశ్వరి(నిర్మల) ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని శివవిష్ణు దేవస్థానానికి నూతన చైర్ పర్సన్‌గా ఆడెపు ఉమామ హేశ్వరి కమిటి సభ్యులను దేవాదయశాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటి సభ్యులుగా బూడిద రవీందర్‌గౌడ్, సా మల రాజిరెడ్డి, బురిగల్ల రమేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం స్థానిక ఎంఎల్ఏ చామకూర మల్లారెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజ కవర్గ ఇనచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, డిసిసి అధ్యక్షుడు, మూడుచింత లపల్లి జడ్‌పిటిసి సింగిరెడ్డి హారివర్ధన్‌రెడ్డిలు నూతనంగా ఎన్నికైన చైర్ పర్స న్‌తో పాటు కమిటి సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ ఉమామహేశ్వరి మాట్లా డుతూ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ది చేయుటకు ప్రతి ఒక్కరు స హకరించాలని కోరారు. విచ్చేసిన ముఖ్య అతిదులు పార్టీలకతీతంగా ఆల యాభివృద్దికి పాటు పడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసిలు నాగరాజు, మాజి సర్పంచ్‌లు దోసకాయల వెంకటేష్, బాల్ నర్సింహా, రవీందర్‌రెడ్డి, నాయకులు విష్ణుగౌడ్, ప్రసాద్, శ్రీధర్, ఆనంద్, ఆలయ అర్చకులు మాదవ్‌శర్మ, వేంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

## 'చిట్టి' చదువు కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారం



ప్రజాపక్షం/కడ్తాల్ : తలకొండపల్లి పాతకుంట తండా గ్రామం కి చెందిన చిట్టీ అనే అమ్మాయి తండ్రి తల్లి చనిపోవడంతో చదువుల కోసం చిట్టి ఆర్థిక ఇబ్బంద లతో సతమత అవుతుంది.దీ నికి ఆమే తాతయ్యకు సైతం వ యసు పైబడడంతో భారంగా మారిన చిట్టి చదువు కోసం స్వయంగా ఆమే తాతయ్య తలకొండ పల్లి జెడ్పిటిసి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దగ్గరికి వచ్చి తన మనవరాలు చిట్టి చదు వుకు ఇబ్బంది అవుతుందని చెప్పడంతో స్పందించి వెంకటేష్ తన ట్రస్ట్ ద్వా రా తలకొండపల్లి జెడ్.పి టిసి ఉప్పల వెంకటేష్ విద్యార్థిని చిట్టిని ప్రజ్ఞ స్కూలు యజ మానంతో మా ట్లాడి పాఠశాల లో చేర్పించారు. విద్యా ర్థిని చిట్టికి మంచిగా చదువుకోవాలని విద్యార్థుల తో పాటు తాతయ్యని కూడా మంచిగా చూసుకోవాలని అమ్మాయికి చెప్పారు.ఏ ఆపద వచ్చిన తనను సంప్ర దించాలని ఉప్పల వెంకటేష్ భరోసా ఇచ్చారు.

# క్రీడ

## ఆర్చరీలో జ్యోతి టీమ్ సత్తా

### వరల్డ్‌కప్‌లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్



**టర్కీ :** భారత ఆర్చరీ స్టార్ త్రయం సురేఖ వెన్నం, అదితి స్వామి, పర్ణీత్ కౌర్ టర్కీ వేదికగా జరుగుతున్న వరల్డ్‌కప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో ఎస్తోనియాతో శనివారం జరిగిన మ్యాచ్ మూడో స్టేజ్‌లో నెగ్గిన ఈ త్రయం వరల్డ్‌కప్‌లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్ సొంతం చేసుకుంది. ఈ త్రయం ఎస్తోనియా టాప్ సీడ్ లిసెల్ జాట్మా, మీరీ మరితా, మారిస్ టెట్స్‌మన్‌తో తలపడి 232– 229 తేడాతో నెగ్గింది. కాగా, ఈ ఏడాది ఏప్రిల్, మే లో షాంఘైలో జరిగిన వరల్డ్‌కప్ స్టేజ్1, స్టేజ్ 2లోనూ ఈ త్రయం స్వర్ణ పతకం సాధించింది. ఇక పురుషుల కాంపౌడ్ అర్చరీలో ప్రియాన్ష్ కాంస్యం ముద్దాడాడు. మరోవైపు అంకిత భకత్, దీరజ్ బొమ్మదేవర కూడా సెమీస్ చేరుకొని పతకాల వేట కొనసాగిస్తున్నారు.



## అమెరికాపై గ్రాండ్ విక్టరీ

టీ20 వరల్డ్‌కప్ సూపర్ 8లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. అమెరికాతో శనివారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 9 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. అమెరికా నిర్దేశించిన 129 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విండీస్ 1 వికెట్ కోల్పోయి 10.5 ఓవర్లలోనే ఛేదించింది.హోప్ (82*) మెరుపు హాఫ్ సెంచరీతో విండీస్‌కు భారీ విజయం కట్టబెట్టాడు. నికొలస్ పూరన్ (27*) రాణించాడు. అమెరికా బౌలర్లలో హర్మీత్ సింగ్ 1 వికెట్ దక్కించుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన అమెరికా 19.5 ఓవర్లలో 128కే ఆలౌటైంది. విండీస్ బౌలర్లు పసికూన అమెరికాకు చుక్కలు చూపించారు. కట్టుదిడ్డంగా బంతులేస్తూ వికెట్లు పడగొట్టారు. ఆండ్రీ గౌస్ (29) టాప్ స్కోరర్. రోస్టన్ ఛేజ్, రస్సెల్ చెరో 3, జోసెఫ్ 2, మోటీ1 వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో విండీస్ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోగా, రెండు ఓటములతో అమెరికా ఇంటిబాట పట్టింది.

## బంగ్లాపై భారత్ విజయం

### సెమీస్‌కు చేరువైన టీమిండియా



టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా జోరు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌తో శనివారం ఏకపక్షంగా సాగిన సూపర్8 మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 50 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ షోకు కుల్దీప్ యాదవ్(3/19) సంచలన బౌలింగ్ తోడవ్వడంతో సునాయసంగా గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శివమ్ దూబే(24 బంతుల్లో 3 సిక్సర్లతో 34), విరాట్ కోహ్లీ(28 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 37), రిషభ్ పంత్(24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36) మెరుపులు మెరిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్(2/32), రిషద్ హొస్సేన్(2/43) రెండేసి వికెట్లు తీయగా.. షకీబ్ అల్ హసన్ ఓ వికెట్ తీసాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసి ఓటమిపాలైంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(32 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 40), టన్జిద్ హసన్(31 బంతుల్లో 4 ఫోర్లతో 29), రిషద్ హొస్సేన్(10 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 24) రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/19) మూడేసి వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు. హార్దిక్ పాండ్యాకు ఓ వికెట్ దక్కింది. ఈ విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది.

**హార్దిక్ శుభారంభం..**

197 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. దూకుడుగా ఆడిన లిటన్ దాస్(13)ను హార్దిక్ పాండ్యాతో కలిసి రోహిత్ శర్మ పెవిలియన్ చేర్చాడు. సూపర్ ప్లాన్‌తో దూకుడుగా ఆడుతున్న లిటన్ దాస్‌కు చెక్ పెట్టారు. క్రీజులోకి వచ్చిన నజ్ముల్ హెస్సెన్, తన్జిద్ హసన్ ఆచితూచి ఆడారు. వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని కుల్దీప్ యాదవ్ విడదీసాడు. తన్జిద్ హసన్‌ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు.

**దెబ్బతీసిన కుల్దీప్ యాదవ్**

ఆ వెంటనే టౌహిడ హృదయ్(4)ను ఔట్ చేసిన కుల్దీప్ యాదవ్.. మరుసటి ఓవర్‌లో షకీబ్ అల్ హసన్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నజ్ముల్ హొస్సేన్‌ను బుమ్రా క్యాచ్ ఔట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన జేకర్ అలీ,(1) రిషద్ హసన్ కూడా దారుణంగా విఫలమయ్యారు. రిషద్ హొస్సేన్(24)ను బుమ్రా ఔట్ చేయడంతో భారత విజయం లాంఛనమైంది.



## రిలీజ్‌కు సిద్ధమైన థమన్!

ఇండియాలో సూపర్‌క్రేజ్ ఉన్న సంగీత దర్శకుల్లో మ్యూజికల్ సెన్సేషన్ థమన్ ఒకరు. థమన్ ప్రస్తుతం పలు భారీ చిత్రాలకు సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లా నాయక్ చిత్రం యొక్క ఒరిజినల్ సౌండ్ ట్రాక్ రిలీజ్ పై క్లారిటీ ఇచ్చారు. జూన్ 28 వ తేదీన రిలీజ్ చేయనున్నారు. అయితే తాజాగా మరొక ఇంట్రెస్టింగ్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయడం జరిగింది. బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటించిన వీరసింహా రెడ్డి చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంకి సంబంధించిన ఓఎస్టీను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రాధే శ్యామ్, భగవంత్ కేసరి, అఖండ చిత్రాలకి కూడా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఇది ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ అని చెప్పాలి.



## 'కల్కి' ఫస్ట్ డే చూడాల్సిందే

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'కల్కి 2898 ఎడి' జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తుండగా, పూర్తి సైన్స్ ఫిక్షన్ మూవీగా ఈ సినిమా రానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. కాగా, ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ ట్రైలర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. ఇక ఈ రిలీజ్ ట్రైలర్ వావ్ ఫ్యాక్టర్స్‌తో రావడంతో అభిమానులు ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు. ఈ సినిమాను ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్ పై చూద్దామా అని వారు ఆతృతగా ఉన్నారు. కాగా, ఈ రిలీజ్ ట్రైలర్ కు ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్.రాజమౌళి కూడా ఫిదా అయ్యారు. ఆయన ఈ ట్రైలర్ చూసి స్టన్ అయినట్లుగా పేర్కొన్నారు. పవర్ ప్యాక్డ్ ట్రైలర్ అంటే ఇది.. ఈ సినిమాను ఖచ్చితంగా ఫస్ట్ డే ఫస్ట్ షో చూడాల్సిందే.. అంటూ రాజమౌళి తాజాగా ట్వీట్ చేశారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాత్రలు ఈ సినిమాకు బలంగా మారుతాయని ఆయన అన్నారు. ఇప్పుడు కల్కి సినిమాపై రాజమౌళి కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# రీల్

## 'ఇండియన్ 2' కు 'ఎ' సర్టిఫికెట్




యూనివర్సల్ హీరో కమల్ హాసన్ హీరోగా కాజల్ అగ ర్వాల్ అలాగే రకుల్ ప్రీత్ సింగ్ మరియు సిద్ధార్థ్‌ల కలయికలో మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండి యా చిత్రం ఇండియన్ 2 కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా తెలుగులో భారతీ యుడు 2 పేరిట రాబో తుంది. ఇక రీసెంట్ గానే మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని మరోసారి కన్ఫర్మ్ కూడా చేశారు. అయితే ఈ సినిమా విషయంలో ఒక ఊహించని ఇంట్రెస్టింగ్ వార్త వినిపిస్తుంది. జెనరల్‌గా శంకర్ సినిమాలు అన్నీ కూడా దాదాపు మూడు గంటలు ఉంటాయని తెలిసిందే. అదే విధంగా ఇప్పుడు ఇండియన్ 2 కి కూడా వచ్చినట్టుగా వినిపిస్తుంది. ఈ సినిమాకి ఏకంగా 3 గంటల 10 నిమిషాల నిడివి వచ్చిందట. అంతేకాకుండా ఇంకా ఆశ్చర్యకర విషయం ఏమిటంటే ఈ సినిమాకి 'ఏ' సర్టిఫికెట్ వచ్చినట్టుగా తెలుస్తుంది. ఓవర్సీస్ మార్కెట్‌లో బుకింగ్స్ మొదలు కాగా అక్కడ నుంచి ఈ వివరాలు బయటకి వచ్చాయి. మరి ఇదే నిజం అయితే శంకర్ ఏదో స్పెషల్ గానే ప్లాన్ చేశారని అనుకోవాలి.



## 'పేక మేడలు' జూలైలో విడుదల

నా పేరు శివ, 'అంధగారం' తదితర హిట్ చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ను 'పేక మేడలు'తో హీరోగా అనూష కృష్ణ హీరోయిన్ గా నటిస్తున్న సినిమా పేక మేడలు. ఎవరికి చెప్పొద్దు సినిమాతో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి విజయాన్ని అందుకొని ఇప్పుడు పేక మేడలు సినిమాతో ప్రేక్షకులు ముందుకు వస్తున్నారు. గతంలో ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విశ్వక్సేన్ చేతుల మీద విడుదల చేయగా టీజర్ కు చాలా మంచి స్పందన లభించింది. ఇప్పుడు ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ బూమ్ బూమ్ లచ్చన్న విడుదలైంది. లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న అంటూ సాగే ఈ సాంగ్ సింగర్ మనో గారు పాడగా లిరిక్స్ రాసింది భార్గవ్ కార్తీక్. స్మరణ్ సాయి అందించిన మ్యూజిక్ చాలా ఎట్రాక్టివ్ గా కొత్తగా ఉంది. ఈ పాట అధ్యంతం వినోదాత్మకంగా చిత్రీకరించినట్టుగా తెలుస్తోంది. ఒక మంచి కాన్సెప్ట్, కంటెంట్ ఉన్న స్టోరీగా ఈ సినిమా ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది. ఈ సినిమా జూలైలో విడుదల చేస్తున్నట్టు తెలిపారు మూవీ టీం.

## జోధ్‌పూర్‌లో మతఘర్షణలు

### ఇద్దరు పోలీసులకు గాయాలు, ఓ దుకాణం దగ్ధం



**జోధ్‌పూర్ :** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మతఘర్షణలు జరిగాయి. ఘర్షణలో సందర్భంగా రాళ్లు రువ్వుకోవడంతో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. ఓ దుకాణాన్ని దగ్ధం చేశారు. రెండు వాహనాలను తీవ్రంగా దెబ్బతిన్నట్లు పోలీసులు చెప్పారు. జోధ్‌పూర్‌లోని సూర్‌సాగర్ ప్రాంతంలోని రాజారామ్ సర్కిల్ సమీపంలో ఉన్న ఈద్గా వెనుకవైపున గేటును నిర్మిస్తుండగా శుక్రవారం రాత్రి ఘర్షణలు మొదలైనట్లు జోధ్‌పూర్ పశ్చిమ డిసిపి రాజేష్ కుమార్ యాదవ్ తెలిపారు. ఈద్గా వెనుకవైపున జనం రాకుండా ఉండేందుకు గేటు నిర్మిస్తున్నారని స్థానికులు దానిని వ్యతిరేకించారు. దీంతో రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొంత మంది రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు గాయపడినట్లు డిసిపి యాదవ్ చెప్పారు. ఓ షాపు, ట్రాక్టర్‌ను ఆందోళనకారులు దగ్ధం చేశారని, మరో జీపును ధ్వంసం చేశారన్నారు. పోలీసులు లాఠీలు, నాలుగైదు రౌండ్ల టియర్ బాష్పవాయువు గోళాలు ప్రయోగించి ఆందోళనకారులను అక్కడి నుంచి చెదరగొట్టినట్లు అధికారి పేర్కొన్నారు. అయితే పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చినప్పటికీ ఇంకా ఉద్రిక్తంగానే ఉందన్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకు శనివారం ఉదయం పెద్ద ఎత్తున రాజస్థాన్ సాయుధ కానిస్టేబ్యులరి దళాలను మోహరింపజేశారు. ఇరు పక్షాల నుంచి ఫిర్యాదులు రావడంతో రెండు ఎఫ్‌ఐఆర్‌లను దాఖలు చేసినట్లు పోలీసు కమిషనర్ రాజేంద్రసింగ్ అన్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వారిని కస్టడీలోకి తీసుకున్నామన్నారు. అనుమానితులను పట్టుకునేందుకు పోలీసులు ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా, ఈద్గా వెనుకవైపున గోడ నిర్మాణం శుక్రవారం సాయంత్రం ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. క్రమంగా ఇది హింసకు దారితీసిందన్నారు. ఆ తరువాత రాళ్లు రువ్వుకోవడం, దగ్ధం, విధ్వంసానికి పాల్పడడం జరిగిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులపై లాఠీలు ఝులిపించారు. కొంతమంది రోడ్డుపక్కన పార్క్ చేసిన ట్రాక్టర్‌కు నిప్పుపెట్టారు.

## బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి



**సివాన్:** బీహార్‌లో మరో వంతెన కుప్పకూలింది. శనివారం సివాన్ జిల్లాలో చిన్న వంతెన కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే, ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. వారం రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటనలు జరగడం ఇది రెండవసారి. ఘటనకు సంబంధించిన వీడియో.. అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీహార్‌లోని సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై ఉన్న వంతెన మహారాజ్‌గంజ్ జిల్లాలోని పటేధి బజార్ మార్కెట్‌ను, దర్భంగాలోని రామ్‌గఢ్ పంచాయతీతో కలుపుతోంది. ఈ వంతెనపై నుంచి ప్రతిరోజూ వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్లు జిల్లా మేజిస్ట్రేట్ ముకుల్ కుమార్ గుప్తా చెప్పారు. ఇది అతి పురాతన వంతెన అని, కెనలా నుంచి నీటిని విడుదల చేయడంతో వరద దాటిని తట్టుకులోక పిల్లరు కూలిపోయాయన్నారు. ఈ వంతెన దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిందని, దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే కూలిపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వంతెన కుప్పకూలడంతో గండక్ కాలువ మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు పొరుగు గ్రామాలకు వెళ్లడానికి చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాపోయారు. బీహార్‌లోని అరారియా జిల్లాలో బక్రా నదిపై రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రెండు వంతెనలు కూలిపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## ప్రొటెం స్పీకర్‌పై ఎన్‌డిఎ, 'ఇండియా' మధ్య వార్

### ప్రొటెం స్పీకర్ సహాయక పదవులకు ప్రతిపక్ష ఎంపిలు దూరం!

### ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు బెదిరిస్తున్నాయన్న మంత్రి కిరణ్ రిజుజు



**న్యూఢిల్లీ :** లోక్‌సభ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రొటెం స్పీకర్ అంశంపై ఎన్‌డిఎ ప్రభుత్వం, ఇండియా కూటమి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌ను నియమించడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేయగా, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కాగా, ప్రొటెం స్పీకర్‌కు సహకరించేందుకు చైర్‌పర్సన్‌ల ప్యానెల్‌కు నామినేట్ చేయబడిన ప్రతిపక్ష నాయకులు పదవులను అంగీకరించ కూడదని భావిస్తున్నట్లు వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 26న స్పీకర్ ఎన్నిక జరిగే వరకు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారిగా విధులు నిర్వహించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 95(1) ప్రకారం ఒడిశాలోని కటక్‌కు చెందిన బీజేపీ సభ్యుడు మహతాబ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. కొత్త లోక్‌సభ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ప్రత్యేక పార్లమెంట్ సెషన్‌లో ప్రొటెం స్పీకర్‌కు సహకరించేందుకు చైర్‌పర్సన్‌ల ప్యానెల్‌ను కూడా ప్రకటించారు. అయితే ప్రొటెం స్పీకర్‌కు సహాయంగా నామినేట్ చేయబడిన ముగ్గురు ప్రతిపక్ష ఎంపిలు కాంగ్రెస్ నేత కె సురేష్, టిఎంసి నాయకుడు సుదీప్ బందోపాధ్యాయ, డిఎంకె నేత టిఆర్ బాలు ప్యానెల్‌లో భాగస్వామిగా కావద్దని భావిస్తునట్లు ప్రతిపక్ష పార్టీల వర్గాలు తెలిపాయి. కాగా, బిజెపి సభ్యులు రాధా మోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే కూడా ప్యానెల్‌లో భాగంగా ఉన్నారు. ఇదిలా ఉండగా, కె సురేష్ సభలో ఎక్కువ కాలం పనిచేసినప్పటికీ మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడంపై పలువురు కాంగ్రెస్ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ లోక్‌సభ సభ్యుడిగా నిరంతరాయంగా సుదీర్ఘ కాలం పదవీకాలంలో కొనసాగిన మహతాబ్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. సురేష్ ఎనిమిది పర్యాయాలు ఎంపిగా ఉన్నప్పటికీ, 1998, 2004లో లోక్‌సభ సభ్యుడు కాలేదని, అందుకే పార్లమెంటు దిగువసభలో నిరంతరాయంగా పదవీకాలం కొనసాగించలేదని రిజిజు చెప్పారు. అందువల్ల ఎనిమిది పర్యాయాలు సభ్యుడిగా ఉన్న సురేశ్‌కు బదులుగా ఏడుసార్లు ఎంపి అయిన మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయడం ద్వారా ప్రభుత్వం పార్లమెంటరీ నిబంధనలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ ఆరోపించింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ బిజెపిని పెద్దఎత్తున చీల్చి చెండాడిన తర్వాత కూడా ప్రజాస్వామ్యం, సంప్రదింపులు, పార్లమెంటరీ నిబంధనలు, దేశ వ్యతిరేకత ఆ పార్టీకి ఎంత మాత్రం అర్థం కాలేదన్నారు. 'అయితే, నిరంకుశ బిజెపి ప్రొటెం స్పీకర్‌గా కూడా ప్రతిపక్ష సభ్యుడిని చూడలేకపోతుంది, ఆ స్థానంలో టర్న్‌కోట్ బిజెపి ఎంపిని నియమించింది' అని రాజా అన్నారు.

## కన్నకూతురిపై అత్యాచారం

### తండ్రికి 104 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**తిరువనంతపురం :** కుమార్తెపై అత్యాచారానికి పాల్పడి ఆమె గర్భం దాల్చేటట్లు చేసిన ఓ వ్యక్తికి కోర్టు 104 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. అలాగే రూ.లక్ష జరిమానాను సైతం వేసింది. కేరళ మలప్పురం జిల్లాలోని మంజేరీ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు(2) న్యాయమూర్తి ఎస్ రష్మి 41 ఏళ్ల దోషికి ఈ శిక్షను వేశారు. వివరాల్లోకి వెళితే... అరికోడ్‌కు చెందిన దోషికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2006లో బాధితురాలు జన్మించింది. ఆమెకు 10 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి బాధితురాలిపై తండ్రి నిత్యం లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించేవాడు. దీంతో ఆమె తనపై జరిగిన దారుణాన్ని ఎప్పుడూ బయటకు చెప్పలేదు. అయితే బాధితురాలు అనారోగ్యానికి గురవ్వడం వల్ల ఆమె తండ్రి ఆరికోడులోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పుడు బాధితురాలు గర్భవతి అని వైద్య పరీక్షల్లో తేలింది. వెంటనే ఆమెను అరికోడ్ ఆస్పత్రి నుంచి కోజీకోడ్ మెడికల్ కాలేజీకి రిఫర్ చేశారు. వైద్యుల సలహా మేరకు కోజీకోడ్ మెడికల్ కాలేజీలో బాధితురాలికి అబార్షన్ చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**

ఆ తర్వాత తనపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రిపై బాధితురాలు అరికోడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడ్ని 2023 ఏప్రిల్ 8న అరెస్టు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం అబ్బాస్ అలీ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం కబీర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె స్వయంప్రభ విచారణ జరిపి చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. రిమాండ్‌లో ఉన్న నిందితుడు బాధితురాలిని బెదిరిస్తాడని, కేసు విచారణ పూర్తయ్యే వరకు అతడికి బెయిల్ మంజూరు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాలని అభ్యర్థించారు. దీంతో కోర్టు నిందితుడికి బెయిల్ మంజూరు చేయలేదు. ఈ కేసుపై విచారణ జరిపిన మంజేరీ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు(2), దోషికి పోక్సో చట్టంలోని సెక్షన్ 5(జె) కింద రూ.25,000 జరిమానాతో పాటు జీవిత ఖైదు, సెక్షన్ 5(ఎం) కింద రూ.25 వేలు ఫైన్‌తోపాటు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఇలా పలు సెక్షన్ల కింద 104 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే రూ.లక్ష జరిమానా వేసింది. నిందితుడు జరిమానా చెల్లిస్తే దాన్ని బాధితురాలికి అందించాలని కోర్టు ఆదేశించింది. కాగా ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎఎన్ మనోజ్ కోర్టు ఎదుట 22 మంది సాక్షులను విచారించారు. 24 పత్రాలను కోర్టు ముందుంచారు. తీర్పు అనంతరం నిందితుడిని అధికారులు తవనూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

## జూలై 1 నుండి 3 నూతన క్రిమినల్ చట్టాల అమలును ఆపివేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** జూలై 1 వ తేదీ నుండి మూడు నూతన క్రిమినల్ చట్టాల అమలును తక్షణమే నిలిపివేయాలని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. ఈ బిల్లులపై పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా, 146 ఎంపిలను సస్పెండ్ చేసి ఏకపక్షంగా ఆ బిల్లులు ఆమోదించుకున్నారని విమర్శించారు. బిల్లుపై హోం శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సైతం సంబంధిత వర్గాలతో సరిగా చర్చించలేదని, స్థాయీ సంఘంలో సభ్యులుగా ఉన్న విపక్ష, కాంగ్రెస్ ఎంపిలు లిఖిత పూర్వకంగా ఇచ్చిన అసమ్మతిని కూడా పట్టించుకోలేదని 'ఎక్స్' ఖాతాలో జైరామ్ రమేశ్ పోస్ట్ చేశారు. జూలై 1 నుండి ఈ చట్టాలు అమలు కానున్నాయని, వాటిని వాయిదా వేసి, పునర్వ్యస్థీకరించబడే నూతన హోం శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం ద్వారా పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. వివిధ న్యాయ నిపుణులతో, సంస్థలతో స్థాయీ సంఘం చర్చించాలని సూచించారు.

**నిరుద్యోగం, ధరల పెరుగదలపై మోదీకి పట్టింపు లేదు:** నిరుద్యోగం, ధరల పెరుగుదలపై నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా, పట్టింపు లేకుండా వ్యవహరిస్తుందని జైరామ్ రమేశ్ విమర్శించారు. ఆహార ధరలు రెండింతలయ్యాయని, ధరలు, నిరుద్యోగం పెరుగుదలతో భారం రెట్టింపు అయిందన్నారు. ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, టమాటాలు,కాయగూరలు, పప్పుల ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## 53కు పెరిగిన నాటుసారా మృతులు

### ఇంకా వెంటిలేటర్‌పై అనేక మంది

### 250 లీటర్ల కల్తీ మద్యం స్వాధీనం

**చెన్నై :** తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా తాగి మృతి చెందిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 53కు పెరిగిందని కళ్లకురిచ్చి జిల్లా కలెక్టర్ ఎంఎస్ ప్రశాంత్ తెలిపారు. 193 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారనీ, వారిలో 140 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. బాధితుల్లో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటం వల్ల వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంత్ తెలిపారు. కల్తీసారా ఘటనలో ఇప్పటికే పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. 250 లీటర్లకు పైగా కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తమిళనాడు సిబిసిఐడి శాఖకు అప్పగించారు. ఈ ఘటనలో మరణించినవారి పిల్లల చదువులకు సంబంధించిన మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని సిఎం స్టాలిన్ తెలిపారు.

## నీట్ పిజి ప్రవేశ పరీక్ష వాయిదా

### ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్‌పై వేటు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఈనెల 23న జరగాల్సిన నీట్ పిజి ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పరీక్ష వాయిదా వేసినట్లు వైద్యారోగ్యశాఖ తెలిపింది. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పింది. 'విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తున్నాం. విద్యార్థుల ప్రయోజనాలతోపాటు పరీక్షా ప్రక్రియలో పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వైద్యారోగ్యశాఖ తెలిపింది. మరోవైపు, యుజిసి నెట్, నీట్ యుజి పరీక్షల నిర్వహణ విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ పరిణామాల మధ్య కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్ ఆ పదవి నుంచి తొలగించింది. భారత వాణిజ్య ప్రచార సంస్థ (ఐటిపిఒ) చైర్మన్, ఎండి ప్రదీప్ సింగ్ ఖరోలాకు ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. సుబోధ్‌ను కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

### ఈ నెల 29 నుంచి భక్తులకు మంచులింగ దర్శనం..



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని అమర్‌నాథ్ గుహలో శనివారం ఉదయం ప్రథమ పూజను నిర్వహించారు. దాంతో ఈ ఏడాది అమర్‌నాథ్ మొదలైనట్లయ్యింది. ఈ నెల 29 నుంచి అమర్‌నాథ్ గుహలో మంచులింగాన్ని దర్శించుకునేందుకు అవకాశం ఉన్నది. యాత్ర మళ్లీ దాదాపు రెండు నెలల తర్వాత అంటే ఆగస్టు 19న యాత్ర ముగియనున్నది. శ్రీనగర్‌లోని రాజ్ భవన్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి అమర్‌నాథ్‌ను దర్శించేందుకు భక్తులు వస్తారని.. వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేశామని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తెలిపారు. యాత్ర అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్ ట్రాక్, గందర్‌బల్ జిల్లాలోని బల్తాల్ మార్గాల్లో ఒకేసారి ప్రారంభంకానున్నది. ఈసారి యాత్రకు భారీగా భద్రతను కల్పించనున్నారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గతేడాది 4.5 లక్షల మందికిపైగా భక్తులు అమర్‌నాథ్ గుహను సందర్శించారు.